ఓం

తిరునారాయణీయం



డా॥ భాస్కర్ కొంపెల్ల

డా॥ రమ కొంపెల్ల



శ్రీరస్తు * శుభమస్తు * అవిఘ్నమస్తు

ఓం శ్రీమతే రామనుజాయ నమః

తిరునారాయణీయం

శ్రీమద్వాల్మీకి ప్రణీతమైన

సుందరకాండ (లఘుపాఠం)

ఆదిత్యహృదయమ్

సంక్షేపరామాయణమ్

సెప్టెంబర్ 2015

శ్రీ మన్మథనామ సంవత్సర శ్రావణమాసం

తిరునారాయణీయమ్

2015

అమూల్యము

ప్రతులకు (ఉచితము)

101, సాయిమిత్రా ఎన్క్లేవ్, తార్నాక,

సికిందరాబాద్ – 500 017.





శ్రీ రామావతారంలో శ్రీ ఆదికేశవస్వామి

ఎంబర్ మన్నార్ ఆలయం, నర్సాపురం, ప.గో. జిల్లా

ఓం నమో వాసుదేవాయ

పావనమైన గోదావరీ తీరంలో ఉన్న నరసాపురంలో పుట్టి పెరిగిన మా నాన్నగారు శ్రీమాన్ కందాళం తిరునారాయణ రవిబాబు గారు సద్వైష్ణవ సాంప్రదాయంలో జీవితాన్ని గడిపారు. తన జీవితకాలంలో కేవలం తన సంతానానికి మాత్రమే కాకుండా, ఎందరో బంధుమిత్రులకి, వాళ్ళ పిల్లలకి ఆశ్రయమిచ్చి వాళ్ళ జీవితాలకి సుఖసోపానాలు వేసారు. తన నిష్కల్మషమైన మనస్సుతో అందరి గౌరవాభిమానాల్నీ చూరగొన్నారు.

నర్సాపురంలో ఎంబర్ మన్నార్ కోవెలలో విజయం చేసిన శ్రీ ఆదికేశవస్వామికి మా పూర్వీకులు తమ సంపదలో కొంతభాగాన్ని కైంకర్యార్ధం నివేదించడం వల్ల, ప్రతియేటా ఆ స్వామికి జరిగే బ్రహ్మోత్సవాల సమయంలో ఆదికేశవస్వామి శ్రీరామావతారంలో సీతాసమేతుడై, తన పరివారంతో మా ఇంటిముందుకొచ్చి నిలిచి, మా నాన్నగారందించే సేవల్ని అందుకుని, మమ్మల్ని అందర్నీ

ఆశీర్వదించి కదుల్తాడు. చిన్ననాటినుండీ నేటివరకూ మా తల్లిదండ్రులతో ఆ ఉత్సవంలో పాల్గొనడం మా అందరికీ ఒక దివ్యమైన మరువలేని అనుభూతి. ఆ భాగ్యాన్ని మాకు కలిగించిన మా నాన్నగారు తన గుండెను గుడిగాకట్టి విష్ణుపథాన్ని చేరుకున్నారు. ఆయన దివ్యస్మృతికై ఏదో ఒక రామకార్యాన్ని చెయ్యాలనే ఉద్దేశ్యంతో “తిరునారాయణీయమ్” అనే ఈ జపాకుసుమాన్ని ఆయన పేరిట శ్రీరామునికి అర్పిస్తున్నాం.

మా నాన్నగారికి ఇష్టమైనవీ, ఆయన నిత్యపారాయణ చేసినవీ అయిన శ్రీమద్రామాయణంలోని ‘సుందరకాండ’, ‘ఆదిత్యహృదయం’, ‘సంక్షేప రామాయణం’ అనే మూడింటినీ నిత్యపారాయణ యోగ్యంగా ఒకచోట సంధానించి అందిస్తున్నాం. సులభపారాయణకోసం సుందరకాండ లఘుపాఠాన్ని అందిస్తున్నాం. చదువరులు ఈ దివ్యస్తోత్రాలని పఠించి శ్రీ సీతారాముల కృపకు పాత్రులు కావాలని ఆశిస్తూ.

కుమార్తెలు

జానకి, రమ, లక్ష్మి, శశిరేఖ, మాధవి

స్మృత్యంజలి

లక్ష్మీదేవ్యాః కృపాపాత్రం జానకీరాఘవవ్రతమ్

భవన్తం మృదుహాసేన నిత్యవాత్సల్యవర్షిణమ్

కందాళవంశాబ్ధిజాతం శశినం పాతు మాధవః

రమాధృత పదం దత్త్వా జన్మరాహిత్యసిద్ధయే

లక్ష్మీదేవి యొక్క కృపకు పాత్రులైన, సీతారాముల భక్తులైన, మెత్తని నవ్వుతో ఎప్పుడూ ప్రేమానురాగాలు కురిపించే స్వభావులైన, కందాళ వంశమనే సముద్రంలో పుట్టిన చంద్రులైన మిమ్ములను మాధవుడు, పునర్జన్మలేని సిద్ధిని కలుగజేయుటకై విష్ణుపాదమునిచ్చి, రక్షించుగాక !

ఓం నమో నారాయణాయ



శ్రీమాన్ కందాళం తిరునారాయణ రవిబాబు గారు

నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లా



సుందరకాండః – లఘుపాఠః

ప్రార్థనా శ్లోకాలు

హరిః ఓం

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం

ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే

అగజాననపద్మార్కం గజానన మహర్నిశం

అనేకదం తం భక్తానామేకదంత ముపాస్మహే

యస్యద్విరదవక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్

విఘ్నం నిఘ్నంతి సతతం విష్వక్సేనం తమాశ్రయే

వాల్మీకిధ్యానమ్:

కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్

ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్

వాల్మీకేర్మునిసింహస్య కవితావనచారిణః

శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్.

ఆంజనేయప్రార్థనా:

గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసమ్

రామాయణమహామాలారత్నం వందేఽనిలాత్మజమ్

అంజనానందనం వీరం జానకీశోకనాశనమ్

కపీశమక్షహంతారం వందే లంకాభయంకరమ్

ఆమిషీకృతమార్తాండం గోష్పదీకృతసాగరమ్

తృణీకృతదశగ్రీవ మాంజనేయం నమామ్యహమ్

మనోజవం మారుతతుల్యవేగం

జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్

వాతాత్మజం వానరయూథముఖ్యం

శ్రీరామదూతం శిరసా నమామి.

ఉల్లంఘ్య సింధో స్సలిలం సలీలం

యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః

ఆదాయ తేనైవ దదాహ లంకాం

నమామి తం ప్రాంజలిరాంజనేయమ్.

ఆంజనేయమతిపాటలాననం

కాంచనాద్రి కమనీయ విగ్రహమ్

పారిజాత తరుమూలవాసినం

భావయామి పవమాననందనమ్

యత్ర యత్ర రఘునాథకీర్తనం

తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్

బాష్పవారిపరిపూర్ణలోచనం

మారుతిం నమత రాక్షసాంతకమ్

శ్రీరామాయణ ప్రార్థనా:

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే

వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా.

తదుపగతసమాససంధియోగం

సమమధురోపనతార్థవాక్యబద్ధమ్

రఘువరచరితం మునిప్రణీతం

దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్

శ్రీ రామప్రార్థనా:

శ్రీ రాఘవం దశరథాత్మజ మప్రమేయమ్

సీతాపతిం రఘుకులాన్వయరత్నదీపమ్

ఆజానుబాహు మరవిందదళాయతాక్షమ్

రామం నిశాచరవినాశకరం నమామి

వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామండపే

మధ్యే పుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్

అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం

వ్యాఖ్యాంతం భరతాధిభిః పరివృతం రామం భజే శ్యామలమ్.

ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథి ర్యది

పౌరుషే చాప్రతిద్వంద్వః శరైనం జహి రావణిమ్

తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్

నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్

శ్రీ రఘునందనపరబ్రహ్మణే నమః

హరిః ఓం

సుందరకాండః – లఘుపాఠః

తతో రావణనీతాయాః సీతాయాః శత్రుకర్శనః

ఇయేష పదమన్వేష్టుం చారణాచరితే పథి

అప్పుడు శత్రువుల్ని కృశింపజేసే హనుమంతుడు రావణుడిచేత తీసుకొనిపోబడిన సీతాదేవిని వెతకటానికి దేవయోనులు సంచరించే మార్గములో (ఇది ఆకాశంలో ఉన్న ఒక మార్గము) ప్రయాణించాలని నిశ్చయించాడు.

దుష్కరం నిష్ప్రతిద్వంద్వం చికీర్షన్ కర్మ వానరః

సముదగ్రశిరోగ్రీవో గవాంపతి రివాబభౌ

చెయ్యడానికి శక్యంగాని పనిని (నూరు యోజనాల సముద్రాన్ని దాటడం) ఎలాంటి అడ్డంకులూ లేకుండా చెయ్యాలనుకుని తలనీ, మెడనీ పైకెత్తి హనుమంతుడు ఆబోతులా ప్రకాశించాడు.

స సూర్యాయ మహేంద్రాయ పవనాయ స్వయంభువే

భూతేభ్యశ్చాంజలిం కృత్వా చకార గమనే మతిమ్

అతడు సూర్యుడికీ, మహేంద్రుడికీ, బ్రహ్మదేవుడికీ, భూతాలకీ దోసిలి పట్టి నమస్కరించి, బయల్దేరుదామని నిర్ణయించుకున్నాడు.

అంజలిం ప్రాఙ్ముఖః కృత్వా పవనాయాత్మయోనయే
తతో హి వవృధే గంతుం దక్షిణో దక్షిణాం దిశమ్

తూర్పువైపుకి తిరిగి, తన జన్మకి కారణమైన వాయుదేవుడికి దోసిలి పట్టి నమస్కరించి, దక్షిణం వైపుకి తిరిగి, ప్రయాణం మొదలుపెట్టడానికి తన శరీరాన్ని పెంచాడు.

యథా రాఘవనిర్ముక్తః శరః శ్వసనవిక్రమః
గచ్ఛేత్తద్వద్గమిష్యామి లంకాం రావణపాలితామ్

రాముడు వదిలిన బాణంలా నేను వాయువేగంతో రావణుడు పాలించే లంకకి వెళ్తాను.

సర్వథా కృతకార్యోఽహమేష్యామి సహ సీతయా
ఆనయిష్యామి వా లంకాం సముత్పాట్య సరావణామ్

అన్ని విధాలా పనిని సాధించి, నేను సీతతో సహా తిరిగివస్తాను. లేదా, రావణునితో సహా లంకని పెకిలించి పట్టుకొస్తాను

ఏవముక్త్వా తు హనుమాన్ వానరాన్ వానరోత్తమః

ఉత్పపాతాథ వేగేన వేగవానవిచారయన్

సుపర్ణమివ చాత్మానం మేనే స కపికుంజరః

మహావేగంగా ప్రయాణించ గలిగిన వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు ఆ వానరుల్తో ఇలా చెప్పి, ఇతరమైన ఆలోచనల్ని విడిచిపెట్టి, వేగంగా పైకి ఎగిరాడు. తనని తాను సాక్షాత్తూ గరుత్మంతుడే అనుకున్నాడు.

స మత్తకోయష్టిభకాన్ పాదపాన్ పుష్పశాలినః

ఉద్వహన్నూరువేగేన జగామ విమలేఽమ్బరే

పువ్వుల్తోనూ, మదించిన కొంగలతోనూ నిండిన చెట్లని తన తొడల వేగంతో పెకిలించి తనతోపాటుగా ఎగిరేటట్టు చేస్తూ, హనుమంతుడు నిర్మలమైన ఆకాశంలోకి ఎగిరాడు.

తస్య వేగసమాధూతైః పుష్పైస్తోయమదృశ్యత

తారాభిరభిరామాభిరుదితాభిరివాంబరమ్

అతని వేగంవల్ల ఎగిరిపడ్డ పువ్వుల్తో నిండిపోయిన ఆ సముద్రపు నీటిని చూస్తే మనోహరమైన నక్షత్రాలు ఉదయిస్తున్నప్పుడు ఆకాశం ఎలా ఉంటుందో అలా అనిపించింది.

ప్లవమానం తు తం దృష్ట్వా ప్లవంగం త్వరితం తదా

వవర్షుః పుష్పవర్షాణి దేవగంధర్వదానవాః

అప్పుడు వేగంగా ఎగిరి వెళుతున్న ఆ హనుమంతుణ్ణి చూసి, దేవతలూ, గంధర్వులూ, దానవులూ అతని మీద పూలవానలు కురిపించారు.

తస్మిన్ ప్లవగశార్దూలే ప్లవమానే హనూమతి
ఇక్ష్వాకుకులమానార్థీ చింతయామాస సాగరః

ఆ వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు ఎగురుతూంటే ఇక్ష్వాకువంశానికి మర్యాద చెయ్యాలన్న కోరికగల సముద్రుడిలా అనుకున్నాడు.

అహమిక్ష్వాకునాథేన సగరేణ వివర్ధితః
ఇక్ష్వాకుసచివశ్చాయం నావసీదితుమర్హతి
ఇతి కృత్వా మతిం సాధ్వీం సముద్రశ్ఛన్నమంభసి
హిరణ్యనాభం మైనాకమువాచ గిరిసత్తమమ్
సలిలాదూర్ధ్వముత్తిష్ఠ తిష్ఠత్వేష కపిస్త్వయి
అస్మాకమతిథిశ్చైవ పూజ్యశ్చ ప్లవతాం వరః

"నేను ఇక్ష్వాకువంశానికి ప్రభువైన సగరుడి చేత పెంచబడ్డవాణ్ణి. ఆ వంశంలో పుట్టిన రాముడికి ఇతడు సహాయం చేస్తున్నాడు. అందువల్ల, ఇతనికి శ్రమ కలిగి నీరసపడిపోకూడదు." ఇలా అనుకున్న సముద్రుడు తన నీటి మధ్యలో నివసించే బంగారంతో కూడిన మైనకపర్వతంతో "మనం పూజించదగ్గ అతిథి ఈ హనుమంతుడు. ఇతను ఆకాశంలో ఎగరగలిగేవాళ్ళందరికంటే గొప్పవాడు. అతను నీ మీద నిలబడ్డానికి వీలుకుదిరేలా నువ్వు నీటిలోంచి పైకి లే!" అన్నాడు.

ప్రీతో హృష్టమనా వాక్యమబ్రవీత్ పర్వతః కపిం
మానుషం ధారయన్ రూపమాత్మానః శిఖరే స్థితః

ఆ మైనాకపర్వతం ప్రేమతో, సంతోషంతో నిండిన మనస్సుతో, తన శిఖరం మీద మానవరూపంలో నిలబడి హనుమంతుడితో ఇలా అన్నాడు.

దుష్కరం కృతవాన్కర్మ త్వమిదం వానరోత్తమ
నిపత్య మమ శృంగేషు విశ్రమస్వ యథాసుఖమ్

"ఓ వానరోత్తమా! నువ్వు ఎవ్వరూ చెయ్యలేని పనిని చేస్తున్నావు. నా శిఖరాల మీద దిగి కాస్త విశ్రాంతి తీసుకో"

త్వరతే కార్యకాలో మే అహశ్చాప్యతివర్తయే
ప్రతిజ్ఞా చ మయా దత్తా న స్థాతవ్యమిహాంతరే
ఇత్యుక్త్వా పాణినా శైలమాలభ్య హరిపుంగవః
జగామాకాశమావిశ్య వీర్యవాన్ ప్రహసన్నివ

"నా పని చెయ్యడానికి సమయం మించిపోతోంది. పగలు గడిచిపోతోంది. నేను మాటిచ్చాను. మధ్యలో ఆగడానికి వీల్లేదు." ఇలా హనుమంతుడు మైనాకుడితో చెప్పి, తన చేత్తో ప్రేమగా అతన్ని నిమిరి, ఆనందంగా ఆకాశమార్గంలో ముందుకి సాగాడు.

సముద్రమధ్యే సురసా బిభ్రతీ రాక్షసం వపుః

ప్లవమానం హనూమంతమావృత్యేదమువాచ హ

అలా ఎగిరి వెళుతున్న హనుమంతుణ్ణి సముద్రం మధ్యలో సురసా అనే రాక్షసశరీరం ఉన్న ఆడది అడ్డుకుని ఇలా అంది.

మమ భక్షః ప్రదిష్టస్త్వమీశ్వరై ర్వానరర్షభ

అహం త్వాం భక్షయిష్యామి ప్రవేశేదం మమాననమ్

“ఓ వానరోత్తమా! ఈ వేళ నువ్వు నాకు దేవతలిచ్చిన ఆహారానివి. నేను నిన్ను తినాలి. నా నోట్లోకి రా!”

తద్దృష్ట్వా వ్యాదితం త్వాస్యం వాయుపుత్రః సుబుద్ధిమాన్

సుసంక్షిప్యాత్మనః కాయం బభూవాంగుష్ఠమాత్రకః

గొప్ప తెలివితేటలున్న హనుమంతుడు అలా తెరిచి ఉన్న నోరు చూసి తన దేహాన్ని కుదించి చాలా చిన్నదిగా, బొటనవేలంత, చేసేశాడు.

సోఽభిపత్యాశు తద్వక్త్రం నిష్పత్య చ మహాజవః

అంతరిక్షే స్థితః శ్రీమానిదం వచనమబ్రవీత్

వెంటనే చాలా వేగంగా ఆమె ముఖంలోకి వెళ్ళి, మళ్ళీ బైటకి వచ్చేసి ఆకాశంలో నిలబడి ఇలా అన్నాడు.

ప్రవిష్టోఽస్మి హి తే వక్త్రం దాక్షాయణి నమోఽస్తు తే

గమిష్యే యత్ర వైదేహీ సత్యం చాసీద్వరస్తవ

"ఓ దక్షకుమారీ! సురసా! నమస్కారం. నీ నోట్లోకి ప్రవేశించాను గదా! నీక్కావలసింది జరిగింది గదా! ఇంక సీత ఉన్న చోటకి వెళతాను."

ప్లవమానంతు తం దృష్ట్వా సింహికా నామ రాక్షసీ

ఘనరాజీవ గర్జంతీ వానరం సమభిద్రవత్

అలా ఎగిరి వెళుతున్న అతన్ని చూసి, సింహిక అనే రాక్షసి పెద్ద మేఘం గర్జిస్తున్నట్టు గర్జిస్తూ వెంట పరిగెత్తింది.

తతస్తస్యా నఖైస్తీక్ష్ణైర్మర్మాణ్యుత్కృత్య వానరః

ఉత్పపాతాథ వేగేన మనస్సంతాపవిక్రమః

అప్పుడు హనుమంతుడు ఆమె ఆయువుపట్టుని తన పదునైన గోళ్ళతో చీల్చి, ఆ రాక్షసి నోరు మూసుకునే లోపుగానే వేగంగా పైకి ఎగిరాడు.

సతువీర్యవతాం శ్రేష్ఠః ప్లవతామపి చోత్తమః

జగామ వేగవాన్ లంకాం లంఘయిత్వా మహోదధిమ్

మహాపరాక్రమవంతులలో శ్రేష్ఠుడూ, మహా వేగముగా ప్రయాణించువాడూ, గొప్ప వానరుడూ ఐన హనుమంతుడు ఆ మహాసముద్రాన్ని దాటి లంకకి చేరుకున్నాడు.

పాలితాం రాక్షసేంద్రేణ నిర్మితాం విశ్వకర్మణా

కైలాసశిఖరప్రఖ్యామాలిఖంతీమివాంబరం

ప్లవమానామివాకాశే దదర్శ హనుమాన్ పురీమ్

రాక్షసరాజు రావణుడిచేత పాలింబడేదీ, విశ్వకర్మచేత నిర్మించబడ్డదీ, కైలాసపర్వతశిఖరంతో సమానమైనదీ, ఆకాశాన్ని తాకుతున్నట్టున్నదీ, గాలిలో తేలుతున్నట్టున్నదీ అయిన లంకానగరాన్ని హనుమంతుడు చూశాడు.

ప్రదోషకాలే హనుమాంస్తూర్ణముత్ప్లుత్య వీర్యవాన్

ప్రవివేశ పురీం రమ్యాం సువిభక్తమహాపథామ్

వీరుడైన హనుమంతుడు సాయంకాలసమయంలో త్వరగా ఎగిరి విశాలంగా, చక్కగా విడగొట్టబడ్డ రహదారులున్న ఆ అందమైన నగరంలోకి ప్రవేశించాడు.

అథ సా హరిశార్దూలం ప్రవిశంతం మహాబలమ్

నగరీ స్వేన రూపేణ దదర్శ పవనాత్మజమ్

అలా ఆ మహాబలుడైన హనుమంతుడు నగరంలోకి వెడుతూంటే, ఆ నగరమే (లంక అనే పేరున్న రాక్షసిగా) స్వంతరూపందాల్చి అతనిని చూసింది.

తతః కృత్వా మహానాదం సా వై లంకా భయావహామ్

తలేన వానరశ్రేష్ఠం తాడయామాస వేగితా

అప్పుడు, ఆ లంక భయంకరంగా అరుస్తూ, వేగంగా ఆ హనుమంతుణ్ణి అరచేత్తో ఒక్క దెబ్బ కొట్టింది.

తతః సంవర్తయామాస వామహస్తస్య సోఽఙ్గులీః

ముష్టినాభిజఘానైనాం హనుమాన్ క్రోధమూర్ఛితః

అప్పుడు హనుమంతుడు కోపంతో ఊగిపోతూ ఆమెని ఎడమచేతి వేళ్ళు మడిచి పిడికిటితో కొట్టాడు.

పపాత సహసా భూమౌ వికృతాననదర్శనా

తతో వై భృశసంవిగ్నా లంకా సా గద్గదాక్షరమ్

ఉవాచాగర్వితం వాక్యం హనుమంతం ప్లవంగమమ్

ఆ దెబ్బకి ఆ లంక వెంటనే వికారమైన రూపంతో భూమ్మీద పడిపోయింది. చాలా భయపడుతూ, తడబడే కంఠంతో, ఏమాత్రం గర్వంలేని మాటల్తో హనుమంతుడితో ఇలా అంది.

ప్రసీద సుమహాబాహో త్రాయస్వ హరిసత్తమ

ఇదం తు తథ్యం శృణు వై బ్రువంత్యా మే హరీశ్వర

స్వయంభువా పురా దత్తం వరదానం యథా మమ

“ఓ మహాబాహూ, వానరశ్రేష్ఠా! అనుగ్రహించు. రక్షించు. పూర్వం బ్రహ్మదేవుడు నాకిచ్చిన వరాన్ని గురించి నిజంగా చెపుతున్నాను. విను.

యదా త్వాం వానరః కశ్చిద్విక్రమాద్వశమానయేత్

తదా త్వయా హి విజ్ఞేయం రక్షసాం భయమాగతమ్

‘ఎప్పుడైతే ఒక వానరుడు వచ్చి నిన్ను జయిస్తాడో, ఆనాడే రాక్షసులందరికీ నాశనభయం వచ్చిందని తెలుసుకో.’ (అని బ్రహ్మ లంకకి చెప్పాడు.)

తత్ప్రవిశ్య హరిశ్రేష్ఠ పురీం రావణపాలితామ్

విధత్స్వ సర్వకార్యాణి యాని యానీహ వాంఛసి.

ఓ వానరశ్రేష్ఠా! రావణుడు ఏలుతున్న ఈ లంకలోకి వెళ్ళి, ఏ పనులు చెయ్యాలనుకున్నావో అవి అన్నీ చేసుకో”.

ప్రవిశ్య నగరీం లంకాం కపిరాజహితంకరః

చక్రేఽథ పాదం సవ్యం శత్రూణాం స తు మూర్ధని.

ఎప్పుడూ సుగ్రీవుడికి నచ్చే పనులే చేసే హనుమంతుడు లంకానగరంలో ప్రవేశించి శత్రువు తలమీద ఎడమకాలు పెట్టాడు.

సనికామం విమానేషు విషణ్ణః కామరూపధృత్

విచచార పునర్లంకాం లాఘవేన సమన్వితః

స్వేచ్ఛగా తను కోరుకున్న రూపాన్ని ధరించి వెళ్ళగల హనుమంతుడు అక్కడున్న భవనాల్లో వెదికిన తర్వాత కూడా సీత కనబడక పోవడంతో దిగులు పడ్డాడు. నేర్పుతో వెదకడానికి మళ్ళీ లంకంతా పరిశీలిస్తూ తిరిగాడు.

గృహాద్గృహం రాక్షసానాముద్యానాని చ సర్వశః

వీక్షమాణోఽప్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః

ఒక ఇంటినుంచి మరొక ఇంటికి వెడుతూ రాక్షసుల ఇళ్ళన్నీ చూస్తూ, వాళ్ళ తోటల్లో వెదుకుతూ, ఏమాత్రం భయపడకుండా పెద్ద పెద్ద భవనాల్లోకూడా చూస్తూ తిరిగాడు

తతస్తదా బహువిధభావితాత్మనః

కృతాత్మనో జనకసుతాం సువర్త్మనః

అపశ్యతోఽభవదతిదుఃఖితం మనః

సుచక్షుషః ప్రవిచరతో మహాత్మనః

సన్మార్గంలో ప్రవర్తించే ఆ హనుమంతుడు దృఢమైన నిశ్చయంతోనూ, సునిశితమైన దృష్టితోనూ ఎంత వెతికినా సీత కనిపించలేదు. అతని మనసు రకరకాల ఆలోచనల్తో నిండిపోయింది. అలా తిరుగుతూ తిరుగుతూ విచారంగా ఉన్నాడు.

విమానం పుష్పకం నామ సర్వరత్నవిభూషితం
బహునిర్యూహసంకీర్ణం దదర్శ పవనాత్మజః

హనుమంతుడు పుష్పకమనే పేరుతో పిలవబడే ఒక విమానాన్ని చూశాడు. అది అన్ని రకాల రత్నాలతోటీ అలంకరించబడి ఉంది. అది అనేకమైన మదించిన ఏనుగుల ఆకారంలో ఉన్న శిఖరాల్తో నిర్మింపబడి ఉంది.

తత్ర దివ్యోపమం ముఖ్యం స్ఫాటికం రత్నభూషితమ్
అవేక్షమాణో హనుమాన్ దదర్శ శయనాసనమ్

అక్కడ ఒక పక్కన, హనుమంతుడు గొప్ప పడకగదిని చూశాడు. అది రత్నాల్తో అలంకరించబడింది. స్ఫటికమణుల్తో తాపడం చేయబడ్డది. స్వర్గంలో ఉండే పడకగదిలా ఉంది.

పాదమూలగతాశ్చాపి దదర్శ సుమహాత్మనః
పత్నీః స ప్రియభార్యస్య తస్య రక్షఃపతేర్గృహే

అతడు, ఆ పడకగదిలో, మహాత్ముడైన రాక్షసరాజు రావణుడి ప్రియమైన భార్యలందర్నీ వాడి కాళ్ళ దగ్గర పడుకుని ఉండగా చూశాడు.

తాసామేకాంతవిన్యస్తే శయనాం శయనే శుభే
దదర్శ రూపసంపన్నామపరాం స కపిః స్త్రియమ్

గౌరీం కనకవర్ణాభామిష్టామంతఃపురేశ్వరీమ్

కపిర్మందోదరీం తత్ర శయనాం చారురూపిణీమ్

వాళ్ళ మధ్యలో, ఒక ప్రక్కన అమర్చబడ్డ మంగళకరమైన పానుపు మీద నిద్రిస్తున్న,గొప్ప రూపసంపదలున్నఒక స్త్రీని, హనుమంతుడు చూశాడు. ఆమె పచ్చని రంగున్నది. బంగారము వంటి కాంతి కలది, భర్తకి చాలా ఇష్టమైనది, అంతఃపురానికి అధికారిణి అయిన మందోదరీ అనే రావణుడి పట్టపురాణి.

స తాం దృష్ట్వా మహాబాహుర్భూషితాం మారుతాత్మజః

తర్కయామాస సీతేతి రూపయౌవనసంపదా

హర్షేణ మహతా యుక్తో ననంద హరియూథపః

మహాబలవంతుడైన ఆ హనుమంతుడు అందంగా అలంకరించుకుని ఉన్న ఆమెని రూపాన్నీ, రాజసాన్నీ, యౌవనాన్నీ చూసి ఆమె సీతే అనుకుని సంతోషపడ్డాడు.

నహి రామసమః కశ్చి ద్విద్యతే త్రిదశేష్వపి

అన్యేయమితి నిశ్చిత్య పానభూమౌ చచార సః

‘కాని రాముడితో సమానమైనవాడు దేవతల్లో కూడా ఎవడూ లేడు కదా! ఈమె సీత కాదు. మరో అమ్మాయి అయి ఉంటుంది’ అని నిశ్చయించుకుని పానగృహం వైపుకి సాగాడు.

సంపరిక్రమ్య హనుమాన్రావణస్య నివేశనాత్

అదృష్ట్వా జానకీం సీతామబ్రవీద్వచనం కపిః

సీత కనబడకపోయే సరికి, హనుమంతుడు రావణుడి ఇంటినుంచి దూరంగా వెళ్ళి, మనసులో ఇలా అనుకున్నాడు.

ఇహ సంపాతినా సీతా రావణస్య నివేశనే

ఆఖ్యాతా గృధ్రరాజేన న చ పశ్యామి తామహమ్

సీత ఇక్కడే రావణుడి దగ్గరే ఉందని ఆ గ్రద్దరాజు సంపాతి చెప్పాడు. కాని నాకు ఆమె కనబడలేదు.

యది సీతామదృష్ట్వాహం వానరేంద్రపురీమితః

గమిష్యామి తతః కో మే పురుషార్థో భవిష్యతి

నేను సీతని చూడకుండా ఇక్కడనుంచి కిష్కింధకి తిరిగి వెళితే ఏమిటి సాధించినట్టు?

గత్వా తు యది కాకుత్థ్సం వక్ష్యామి పరమప్రియమ్

న దృష్టేతి మయా సీతా తతస్త్యక్ష్యతి జీవితమ్

“నాకు సీత కనబడలేదు” అనే అయిష్టమైన మాటని నేను రాముడి దగ్గరకెళ్ళి చెప్పానంటే అది వినగానే రాముడు ప్రాణాలు వదిలేస్తాడు.

ఘోరమారోదనం మన్యే గతే మయి భవిష్యతి

ఇక్ష్వాకుకులనాశశ్చ నాశశ్చైవ వనౌకసామ్

ఇప్పుడు నేను తిరిగి వెళితే ఇక్ష్వాకుకులం (రాముడి వంశం) నశించిపోతుంది. వానరులంతా కూడా నశిస్తారు. ఇది భయంకరమైన ఏడుపులకి దారితీస్తుంది.

యావత్సీతాం హి పశ్యామి రామపత్నీం యశస్వినీమ్

తావదేతాం పురీం లంకాం విచినోమి పునః పునః

రాముడి భార్య, గొప్ప కీర్తిమంతురాలు అయిన ఆ సీతాదేవి కనబడేదాకా నేనీ లంకానగరాన్ని మళ్ళీ మళ్ళీ వెదుకుతూనే ఉంటాను.

ఆశోకవనికా చేయం దృశ్యతే యా మహాద్రుమా

ఇమామధిగమిష్యామి న హీయం విచితా మయా

పెద్ద పెద్ద చెట్లతో ఎదురుగా అశోకవనం కనబడుతోంది. ఇందులోకి వెళతాను. నేను ఈ వనంలో వెదకలేదు కదా !

జిత్వా తు రాక్షసాన్ సర్వానిక్ష్వాకుకులనందినీం

సంప్రదాస్యామి రామాయ యథా సిద్ధిం తపస్వినే

రాక్షసులందర్నీ జయించి, తపస్సు చేసేవాడికి కావలసిన సిద్ధిని ఇచ్చినట్టు, ఇక్ష్వాకుకులానికి ఆనందాన్నిచ్చే సీతని రాముడి దగ్గరకి చేరుస్తాను.

స ముహూర్తమివ ధ్యాత్వా చింతావగ్రథితేంద్రియః

ఉదతిష్ఠన్ మహాతేజా హనుమాన్ మారుతాత్మజః

విచారంతో బంధించబడ్డ ఇంద్రియాలతో ఉన్న ఆ మహాతేజుడైన హనుమంతుడు క్షణకాలం ధ్యానం చేసి లేచాడు.

నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై,
నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో
నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః

లక్ష్మణుడితో సహా ఉన్న రాముడికి నమస్కారం, జనజమహారాజు కూతురైన సీతాదేవికి నమస్కారం. రుద్ర, ఇంద్ర, యమ, వాయుదేవులకి నమస్కారం. సూర్య చంద్రులకీ, మరుద్గణాలకీ నమస్కారం.

స తేభ్యస్తు నమస్కృత్యా సుగ్రీవాయ చ మారుతిః
దిశః సర్వాః సమాలోక్య హ్యశోకవనికాం గతః

హనుమంతుడు వాళ్ళకి నమస్కరించాక, సుగ్రీవుడికి కూడా నమస్కరించి, అన్ని దిక్కులవైపు చూసి, అశోకవనం వైపుకు వెళ్ళాడు.

స పుష్పితాగ్రాం రుచిరాం తరుణాంకురపల్లవామ్
తామారుహ్య మహాబాహుః శింశుపాం పర్ణసంవృతామ్

హనుమంతుడు చిటారుకొమ్మల్లో పువ్వులున్నదీ, అందమైనదీ, చిగుళ్ళల్లో ముదిరిన మొగ్గలున్నదీ, ఆకుల్తో కప్పబడ్డదీ అయిన శింశిపావృక్షం ఎక్కి (కూర్చున్నాడు).

స వీక్షమాణస్తత్రస్థో మార్గమాణశ్చ మైథిలీమ్
అవేక్షమాణశ్చ మహీం సర్వాం తామన్వవైక్షత

హనుమంతుడు అక్కడే ఉండి సీతకోసం వెతుకుతూ, అటూ ఇటూ పరిశీలిస్తూ, ఆ ప్రదేశం అంతా పరీక్షగా చూశాడు.

తతో మలినసంవీతాం రాక్షసీభిః సమావృతామ్
ఉపవాసకృశాం దీనాం నిశ్శ్వసంతీం పునః పునః
దదర్శ శుక్లపక్షాదౌ చంద్రరేఖామివామలామ్

ఇంతలో హనుమంతుడు ఒక యువతిని చూశాడు. ఆమె మాసిపోయిన బట్ట చుట్టబెట్టుకుని ఉంది. రాక్షసస్త్రీలంతా ఆమె చుట్టూ ఉన్నారు. ఉపవాసాలు చేసి కృశించిపోయినదానిలా, దీనంగా ఉంది. మాటిమాటికీ నిట్టూరుస్తోంది. శుక్లపక్షం మొదట్లో ఉండే చంద్రరేఖలా సన్నగా, నిర్మలంగా ఉంది.

తాం సమీక్ష్య విశాలాక్షీమధికం మలినాం కృశామ్
తర్కయామాస సీతేతి కారణైరుపపాదిభిః

విశాలమైన కళ్ళూ, చిక్కిపోయిన ఒళ్ళూ, మట్టిపట్టిన శరీరం చూసి, కాస్త తెలివితో ఆలోచిస్తే నమ్మేందుకు చాలా కారణాలు ఉండడంతో, ఆమె సీతే అని ఊహించాడు.

వైదేహ్యా యాని చాంగేషు తదా రామోఽన్వకీర్తయత్

తాన్యాభరణజాలాని గాత్రశోభీన్యలక్షయత్

సీత ఏ ఏ ఆభరణాల్ని ఏ ఏ అంగాల్లో పెట్టుకునేదో రాముడు చెప్పాడు (ఇదంతా హనుమంతుడు తనకు దొరికిన సీత ఆభరణాల్ని చూపించినప్పుడు, వాటిని చూసి రాముడు చెప్పాడు.) ఇప్పుడు హనుమంతుడు ఆ అంగాలమీద అవి ఉన్నట్టుగా చూశాడు. (అవి పెట్టుకున్నట్టుగా ఉన్న గుర్తులు చూశాడు).

అస్యా దేవ్యా యథా రూపమంగప్రత్యంగసౌష్ఠవమ్

రామస్య చ యథా రూపం తస్యేయమసితేక్షణా

ఈ దేవికున్న రూపం, ఆమె అంగాల సౌష్ఠవం ఎలా ఉన్నాయో, అలాగే రాముడి రూపం, అంగ సౌష్ఠవం కూడా ఉన్నాయి. నల్లని కళ్ళున్న సీత రూపం రాముడి రూపానికి తగినట్టుంది.

ఇయం సా ధర్మశీలస్య మైథిలస్య మహాత్మనః

సుతా జనకరాజస్య సీతా భర్తృదృఢవ్రతా

ఉత్థితా మేదినీం భిత్త్వా క్షేత్రే హలముఖక్షతే

పద్మరేణునిభైః కీర్ణా శుభైః కేదారపాంసుభిః

యజ్ఞభూమిని నాగలితో దున్నినప్పుడు, తామరపువ్వుల పుప్పొడిలాంటి మంగళకరమైన పరాగంతో కప్పబడ్డ శరీరంతో ఆ భూమిని చీల్చుకుని బైటకి వచ్చింది ఈవిడే. ధార్మికుడూ, మిథిలానగరానికి రాజూ, మహాత్ముడూ అయిన జనకుడి కూతురూ, దృఢమైన పాతివ్రత్యం గల ఆ సీత ఈవిడే.

ఇమాం తు శీలసంపన్నాం ద్రష్టుమర్హతి రాఘవః

రావణేన ప్రమథితాం ప్రపామివ పిపాసితః

రావణుడు ఎన్ని బాధలు పెట్టినా తన ఉత్తమమైన శీలాన్ని వదలకుండా ఉన్న ఈ సీతని రాముడు చూస్తే పరమసంతోషపడతాడు; దాహం వేసినవాడు చలివేంద్రం చూసినట్టుగా.

నమస్కృత్వా చ రామాయ లక్ష్మణాయ చ వీర్యవాన్

సీతాదర్శనసంహృష్టో హనుమాన్ సంవృతోఽభవత్

సీత కనబడ్డ ఆనందంలో ఉన్న వీరుడైన హనుమంతుడు రామలక్ష్మణులకి నమస్కరించి, చెట్టు ఆకుల్లో దాక్కుని ఉన్నాడు.

షడంగవేదవిదుషాం క్రతుప్రవరయాజినామ్

శుశ్రావ బ్రహ్మఘోషాన్ స విరాత్రే బ్రహ్మరక్షసామ్

షడంగవేదాల్లో నిష్ణాతులూ, అనేక మహాయజ్ఞాలు చేసినవాళ్ళూ అయిన బ్రహ్మరాక్షసులు తెల్లవారుజామున చేసే వేదఘోషని (వేదాలు చదువుతుంటే వచ్చే శబ్దం) హనుమంతుడు విన్నాడు.

విబుధ్య తు యథాకాలం రాక్షసేంద్రః ప్రతాపవాన్
స్రస్తమాల్యాంబరధరో వైదేహీమన్వచింతయత్

ప్రతాపవంతుడైన రావణుడు ఎప్పుడూ లేచే సమయానికి లేచాడు. అప్పుడే లేవడం వల్ల అతని వంటిమీద ఉన్న బట్టలూ, పూలమాలలూ జారిపోతున్నాయి. లేవగానే సీత గురించే ఆలోచించాడు.

స సర్వాభరణైర్యుక్తో బిభ్రచ్ఛ్రియమనుత్తమామ్
తాం నగైర్బహుభిర్జుష్టాం సర్వపుష్పఫలోపగైః

అన్ని ఆభరణాలూ అలంకరించుకుని, చాలా ఉత్తమమైన శోభతో ఆ రావణుడు అన్నిరకాల పువ్వుల్తో పండ్లతో నిండిన చెట్లున్న అశోకవనంలోకి ప్రవేశించాడు.

తతో దృష్ట్వైవ వైదేహీ రావణం రాక్షసాధిపమ్
ప్రావేపత వరారోహా ప్రవాతే కదలీ యథా

రాక్షసరాజు రావణుణ్ణీ చూడగానే సీత పెద్దగాలి వీస్తే ఊగిపోయే అరటిచెట్టులా వణికిపోయింది.

స తాం పరివృతాం దీనాం నిరానందాం తపస్వినీమ్

సాకారైర్మధురైర్వాక్యైర్న్యదర్శయత రావణః

రాక్షస స్త్రీలందరి మధ్యన దీనంగా, ఆనందంలేకుండా ఉన్న ఆ సీతకి రావణుడు తన చేతులు తిప్పుతూ, తియ్యని మాటల్తో తన అభిప్రాయం చెప్పాడు.

కామయే త్వాం విశాలాక్షి బహుమన్యస్వ మాం ప్రియే

సర్వాంగగుణసంపన్నే సర్వలోకమనోహరే

"ఓ సీతా! నీ విశాలంగా పెద్దవిగా ఉన్న కళ్ళతో, చక్కగా సౌష్ఠవంగా ఉన్న అన్ని అవయవాల్తో అందరి మనసునీ ఆకర్షిస్తున్నావ్. నేను నిన్ను ఇష్టపడుతున్నాను. నన్ను ప్రేమించు."

సర్వాసామేవ భద్రం తే మమాగ్రమహిషీ భవ

భుంక్ష్వ భోగాన్యథాకామం పిబ భీరు రమస్వ చ

నా భార్యలందర్లో ముఖ్యురాలివై పట్టపురాణివి అవు. నీకు మంగళమవుగాక! ఇష్టం వచినట్టుగా భోగాల్ని అనుభవించు. తిను. తాగు. సుఖించు.

తృణమంతరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా

నివర్తయ మనో మత్తః స్వజనే క్రియతాం మనః

రావణుడితో ముఖాముఖి మాట్లాడ్డం ఇష్టంలేక ఒక గడ్డిపోచ మధ్యలో పెట్టి స్వచ్ఛంగా నవ్వి ఆ సీత జవాబిచ్చింది. “నీ మనస్సుని నామీదనుంచి మళ్ళించుకో. నీ భార్యల మీద ధ్యాసపెట్టి వాళ్ళని ప్రేమగా చూడు”

శక్యా లోభయితుం నాహమైశ్వర్యేణ ధనేన వా

అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా

“ఐశ్వర్యం, డబ్బూ చూపించి నన్నెవ్వళ్ళూ లోభపెట్టలేరు. కాంతి సూర్యుణ్ణించి ఎలా విడిపోదో అలాగే రాముణ్ణించి నేను వేరు కాను”

క్షిప్రం తవ స నాథో మే రామః సౌమిత్రిణా సహ

తోయమల్పమివాదిత్యః ప్రాణానాదాస్యతే శరైః

కొద్దిరోజుల్లో నా భర్త రాముడు లక్ష్మణుడితో కలిసి, కొద్దిగా ఉన్న నీటిని సూర్యుడు ఇగిర్చినట్టుగా, బాణాల్తో నీ ప్రాణాల్ని తీసేస్తాడు.

సీతాయా వచనం శ్రుత్వా పరుషం రాక్షసేశ్వరః

ప్రత్యువాచ తతః సీతాం విప్రియం ప్రియదర్శనమ్

రావణుడు పరుషంగా ఉన్న సీత మాటలు విని, పైకి మెత్తగా కనబడుతున్నా, నిజానికి అప్రియమైన మాటలు ఈ విధంగా చెప్పాడు.

పరుషాణీహ వాక్యాని యాని యాని బ్రవీషి మామ్

తేషు తేషు వధో యుక్తస్తవ మైథిలి దారుణః

ఓ మైథిలీ! నువ్వు నాతో కఠినంగా మాట్లాడిన ఒక్కక్క మాటకీ నిన్ను చాలా దారుణంగా చంపవచ్చు.

ద్వౌ మాసౌ రక్షితవ్యౌ మే యోఽవధిస్తే మయా కృతః

తతః శయనమారోహ మమ త్వం వరవర్ణిని

నేను నీకు రెండు నెలలు గడువిచ్చా. ఆ గడువుని నేను గౌరవించాలి. ఆ గడువు తీరగానే నువ్వు నా శయ్య పైకి రావాలి.

ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం భర్తారం మామనిచ్ఛతీమ్

మమ త్వాం ప్రాతరాశార్థమాలభంతే మహానసే

ఆ గడువు లోపులో నువ్వు నన్ను భర్తగా అంగీకరించకపోతే, రెండు నెలల తర్వాత నిన్ను నా పొద్దున్న భోజనానికోసం వంటింట్లో చంపేస్తారు.

ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణః శత్రురావణః

సందిశ్య చ తతః సర్వా రాక్షసీర్నిర్జగామ హ

శత్రువుల్ని ఏడ్పించే ఆ రాక్షసరాజు రావణుడు సీతతో ఇలా చెప్పి “సీతని లొంగదీయండి” అని రాక్షసస్త్రీలని ఆజ్ఞాపించి వెళ్ళిపోయాడు.

అవలీనస్తు తద్వాక్యం హనుమాన్ శింశుపాద్రుమే

సీతాం సంతర్జయంతీనాం రాక్షసీనాం స శుశ్రువే

హనుమంతుడు ఆ శింశుపావృక్షం మీద దాక్కుని ఉండి, సీతని భయపెడుతున్న రాక్షసస్త్రీల మాటలు వింటున్నాడు.

అథ తాసాం వదంతీనాం పరుషం దారుణం బహు

రాక్షసీనామసౌమ్యానాం రురోద జనకాత్మజా

ఉవాచ పరమత్రస్తా బాష్పగద్గదయా గిరా

ఆ తర్వాత, క్రూరస్వభావం ఉన్న ఆ రాక్షసస్త్రీలు కఠినంగా, భయపెట్టేలా, అతిగా మాట్లాడుతూంటే, విని సీత ఏడ్చింది. భయపడి, కన్నీళ్ళవల్ల కలిగిన తడబడే మాటల్తో ఇలా అంది.

న మానుషీ రాక్షసస్య భార్యా భవితుమర్హతి

కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః

“ఒక మానవస్త్రీ రాక్షసుడి భార్య అవడం తగదు. మీరంతా నన్ను చంపి తినెయ్యాలంటే తినెయ్యండి. మీరు చెప్పింది మాత్రం నేను చెయ్యను”

హా రామేతి చ దుఃఖార్తా హా పునర్లక్ష్మణేతి చ

హా శ్వశ్రు మమ కౌసల్యే హా సుమిత్రేతి భామినీ

సీత దుఃఖంతో బాధపడుతూ "అయ్యో రామా! అయ్యో లక్ష్మణా! అయ్యో అత్తా కౌసల్యా, సుమిత్రా!" అంటూ ఏడ్చింది.

కీదృశం తు మహాపాపం మయా జన్మాంతరే కృతమ్

యేనేదం ప్రాప్యతే దుఃఖం మయా ఘోరం సుదారుణమ్

"పూర్వజన్మలో నేనెలాంటి మహాపాపం చేసానో కదా! నేనిప్పుడు అతిదారుణమైన, భయంకరమైన దుఃఖాన్ని అనుభవిస్తున్నాను."

సాహం త్యక్తా ప్రియేణైవ రామేణ విదితాత్మనా

ప్రాణాంస్త్యక్ష్యామి పాపస్య రావణస్య గతా వశమ్

"ప్రసిద్ధమైన బుద్ధిగలవాడూ, ప్రియుడూ అయిన రాముడికి దూరమై పాపాత్ముడైన రావణుడి వశంలో ఉండిపోయాను. నేను ప్రాణాల్ని వదిలేస్తాను."

సీతాం తాభిరనార్యాభిర్దృష్ట్వా సంతర్జితాం తదా

రాక్షసీ త్రిజటా వృద్ధా శయానా వాక్యమబ్రవీత్

అప్పుడు, చెడ్డవాళ్ళైన ఆ రాక్షసస్త్రీలు సీతని అలా భయపెడుతూంటే, అంతవరకూ నిద్రపోతున్న త్రిజట అనే ముసలిరాక్షసి ఇలా అంది.

స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః

రాక్షసానామభావాయ భర్తురస్యా భవాయ చ

“ఇప్పుడే నాకు ఒక భయంకరమైన, తలుచుకుంటే వెంట్రుకలు నిక్కబొడుచుకునేలాంటి కల వచ్చింది. అది రాక్షసుల నాశనం, ఈ సీత భర్త ఉన్నతినీ సూచిస్తోంది”

గజదంతమయీం దివ్యాం శిబికామంతరిక్షగామ్
యుక్తాం హంససహస్రేణ స్వయమాస్థాయ రాఘవః
శుక్లమాల్యాంబరధరో లక్ష్మణేన సహాగతః
స్వప్నే చాద్య మయా దృష్టా సీతా శుక్లాంబరావృతా
రామేణ సంగతా సీతా భాస్కరేణ ప్రభా యథా

రాముడు తెల్లని మాలలూ, వస్త్రాలూ కట్టుకుని లక్ష్మణుడితో సహా పల్లకీ ఎక్కి వచ్చాడు. ఆ పల్లకీ ఏనుగు దంతాల్తో చెయ్యబడింది. దాన్ని వెయ్యి హంసలు ఆకాశాంలో మోస్తున్నాయి. ఈ రోజు కలలో సీత కూడా తెల్లని దుస్తులు ధరించింది. కాంతి సూర్యుడితో కలిసినట్టు, సీత రాముడితో కలిసింది.

లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా సహ వీర్యవాన్
ఆరుహ్య పుష్పకం దివ్యం విమానం సూర్యసన్నిభమ్
ఉత్తరాం దిశమాలోక్య జగామ పురుషోత్తమః

పరాక్రమవంతుడైన ఆ పురుషశ్రేష్ఠుడు రాముడు, తమ్ముడు లక్ష్మణుడితోనూ, సీతతోనూ కలిసి, సూర్యుడిలా ప్రకాశిస్తున్న దివ్యమైన పుష్పక విమానం ఎక్కి, ఉత్తరదిక్కు వైపుకి వెళ్ళాడు.

కంఠే బద్ధ్వా దశగ్రీవం ప్రమదా రక్తవాసినీ
కాలీ కర్దమలిప్తాంగీ దిశం యామ్యాం ప్రకర్షతి

ఎర్రని బట్టలు కట్టుకుని, ఒళ్ళంతా బురద పూసుకొని ఉన్న ఒక నల్లని ఆడది రావణుణ్ణి మెడకి తాడుకట్టి దక్షిణదిశవైపు ఈడ్చుకుపోతోంది.

ఏవం తత్ర మయా దృష్టః కుంభకర్ణో నిశాచరః
రావణస్య సుతాః సర్వే దృష్టాస్తైలసముక్షితాః

కుంభకర్ణుడు కూడా నాకు కలలో ఇలాగే కనబడ్డాడు. రావణుడి కొడుకులంతా నూనె పూసుకుని ఉన్నారు.

ఏకస్తత్ర మయా దృష్టః శ్వేతచ్ఛత్రో విభీషణః
శుక్లమాల్యాంబరధరః శుక్లగంధానులేపనః

వాళ్ళల్లో ఒక్క విభీషణుడు మాత్రమే తెల్లని మాలలు, బట్టలు ధరించి, తెల్లని మంచి గంధం పూసుకుని, తెల్లని గొడుగు పట్టుకుని నాకు కనిపించాడు.

లంకా దృష్టా మయా స్వప్నే రావణేనాభిరక్షితా

దగ్ధా రామస్య దూతేన వానరేణ తరస్వినా

రావణుడు రక్షిస్తున్న ఈ లంకానగరాన్ని, రాముడి దూతగా వచ్చిన ఒక మహావేగవంతుడైన వానరుడు కాల్చివేసినట్టు నాకు కలలో కనిపించింది.

ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా

అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్

ఓ రాక్షసస్త్రీలలారా! జనకుడి కూతురైన ఈ సీతకి నమస్కరించి అనుగ్రహం పొందితే, ఈమె మనని ఈ భయంనుంచి తప్పించగలదు.

హనుమానపి విక్రాంతః సర్వం శుశ్రావ తత్త్వతః

సీతాయాస్త్రిజటాయాశ్చ రాక్షసీనాం చ తర్జనమ్

తతో బహువిధాం చింతాం చింతయామాస వానరః

పరాక్రమశాలి హనుమంతుడు కూడా సీత మాటల్నీ, త్రిజట కల గురించి చెప్పిన మాటలూ, రాక్షసస్త్రీలు సీతని భయపెట్టడాన్నీ, అన్నీ విన్నాడు. తరవాత అనేక రకాలుగా ఆలోచించాడు.

రామమక్లిష్టకర్మాణం సుబంధుమనుకీర్తయన్

నైనాముద్వేజయిష్యామి తద్బంధుగతమానసామ్

సీత మనస్సు ఆమెకి అతి గొప్ప బంధువైన రాముడిమీదే లగ్నమై ఉంది. శ్రమలేకుండా సులువుగా అన్ని పనుల్నీ చెయ్యగల ఉత్తమబంధువైన ఆ రాముణ్ణి కీర్తిస్తే ఈ సీత నన్ను చూసి భయపడకుండా ఉంటుంది. (తను చెప్పాపెట్టకుండా ఎదురైతే సీత ఎలా భయపడుతుందోనని హనుమంతుడి ఆలోచన).

ఇక్ష్వాకూణాం వరిష్ఠస్య రామస్య విదితాత్మనః
శుభాని ధర్మయుక్తాని వచనాని సమర్పయన్
శ్రావయిష్యామి సర్వాణి మధురాం ప్రబ్రువన్ గిరమ్
శ్రద్ధాస్యతి యథాహీయం తథా సర్వం సమాదధే

ఇక్ష్వాకువంశంలో పుట్టిన రాజుల్లో పరమశ్రేష్ఠుడైన రాముడికి సంబంధించిన కథంతా, మంగళప్రదమైన మాటలు పలుకుతూ, మధురంగా మాట్లాడుతూ, ఈమెకి వినిపిస్తాను. బాగా నమ్మకం కలిగేలా చేస్తాను.

ఏవం బహువిధాం చింతాం చింతయిత్వా మహాకపిః
సంశ్రవే మధురం వాక్యం వైదేహ్యా వ్యాజహార హ
జానకీ చాపి తచ్ఛ్రుత్వా పరం విస్మయమాగతా

హనుమంతుడు ఈ విధంగా చాలా రకాలుగా ఆలోచించి, సీతకి వినిపించేలా మధురమైన వాక్యాలు పలికాడు. సీత కూడా ఆ వాక్యాలు విని చాలా ఆశ్చర్యపడింది.

తతః శాఖాంతరే లీనం దృష్ట్వా చలితమానసా

వేష్టితార్జునవస్త్రం తం విద్యుత్సంఘాతపింగలమ్

అప్పుడు సీత, మెరుపుల గుంపులా పచ్చని శరీరంతో, తెల్లని బట్టలు కట్టుకుని, కొమ్మలమధ్యలో ఒదిగి ఉన్న, ఆ హనుమంతుణ్ణి చూసి ఉలిక్కిపడింది.

తామబ్రవీన్మహాతేజా హనూమాన్ మారుతాత్మజః

శిరస్యంజలిమాధాయ సీతాం మధురయా గిరా

హనుమంతుడు సీత దగ్గరకి వచ్చి తలమీద దోసిలి పట్టి నమస్కరిస్తూ మధురమైన మాటల్తో ఇలా అన్నాడు.

కా ను పద్మపలాశాక్షి క్లిష్టకౌశేయవాసిని

కిమర్థం తవ నేత్రాభ్యాం వారి స్రవతి శోకజమ్

మాసిన పట్టుబట్టలు కట్టుకుని ఉన్న తామర రేకుల్లాంటి కళ్ళుగలదానా! ఎవరు నువ్వు? దేనికోసం నీ కళ్ళనుంచి దుఃఖంవల్ల కన్నీళ్ళు కారుతున్నాయి?

సా తస్య వచనం శ్రుత్వా రామకీర్తనహర్షితా

ఉవాచ వాక్యం వైదేహీ హనుమంతం ద్రుమాశ్రితమ్

అతని మాటలు విన్న ఆ సీత, రాముణ్ణి గురించి చెప్పడంవల్ల సంతోషిస్తూ, చెట్టుమీద ఉన్న అతనితో ఇలా అంది.

పృథివ్యాం రాజసింహానాం ముఖ్యస్య విదితాత్మనః
స్నుషా దశరథస్యాహం శత్రుసైన్యప్రతాపినః

“నేను భూమిమీదున్న రాజులందర్లో గొప్పవాడూ, ప్రసిద్ధమైన బుద్ధిబలం గలవాడూ, శత్రుసైన్యాల్ని పీడించేవాడూ అయిన దశరథుడి కోడలిని.”

దుహితా జనకస్యాహం వైదేహస్య మహాత్మనః
సీతేతి నామ నామ్నాహం భార్యా రామస్య ధీమతః

“నేను బుద్ధిశాలీ, విదేహరాజూ అయిన జనకుడి కూతుర్ని. నా పేరు సీత. బుద్ధిమంతుడైన రాముడికి భార్యను.”

తస్యాస్తద్వచనం శ్రుత్వా హనుమాన్ హరిపుంగవః
దుఃఖాద్దుఃఖాభిభూతాయాః సాంత్వముత్తరమబ్రవీత్

ఆ హనుమంతుడు, ఒక దుఃఖం తర్వాత మరొక దుఃఖంలో చిక్కుకున్న ఆ సీత మాటలు విని, ఓదార్పుగా ఇలా అన్నాడు.

అహం రామస్య సందేశాద్దేవి దూతస్తవాగతః
వైదేహి కుశలీ రామస్త్వాం చ కౌశలమబ్రవీత్
అహం సుగ్రీవసచివో హనుమాన్నామ వానరః
ప్రవిష్టో నగరీం లంకాం లంఘయిత్వా మహోదధిమ్

“ఓ విదేహరాజకుమారీ! నేను రాముడు పంపిస్తే, నీ దగ్గరకి దూతగా వచ్చాను. రాముడు క్షేమంగా ఉన్నాడు. నీ క్షేమం గురించి తెలుసుకోమన్నాడు. నేను సుగ్రీవుడి మంత్రిని. వానరుణ్ణి. నా పేరు హనుమంతుడు. మహాసముద్రం దాటి లంకలోకి వచ్చాను.”

సా తయోః కుశలం దేవీ నిశమ్య నరసింహయోః
ప్రీతిసంహృష్టసర్వాంగీ హనుమంతమథాబ్రవీత్

ఆ సీతాదేవి మానవుల్లో ఉత్తములైన రామలక్ష్మణుల క్షేమవార్త వినగానే ఒళ్ళంతా ఆనందంతో పొంగిపోతూ, హనుమంతుడితో ఇలా అంది.

యది రామస్య దూతస్త్వమాగతో భద్రమస్తు తే
పృచ్ఛామి త్వాం హరిశ్రేష్ఠ ప్రియా రామకథా హి మే
గుణాన్రామస్య కథయ ప్రియస్య మమ వానర.

“నువ్వు రాముడికి దూతవే అయితే నీకు క్షేమం అవుగాక! ఓ వానరశ్రేష్ఠా! నాకు రామకథ చాలా ఇష్టం. అందుకే నిన్ను అడుగుతున్నా. నా ప్రియుడైన రాముడి గుణాల్ని గురించి చెప్పు.”

సీతాయాశ్చింతితం బుద్ధ్వా హనుమాన్ మారుతాత్మజః
శ్రోత్రానుకూలైర్వచనైస్తదా తాం సంప్రహర్షయత్

హనుమంతుడు సీత ఆలోచనల్ని కనిపెట్టి (ఆమె తను రావణుడి తాలూకు అని అనుమానిస్తోందని కనిపెట్టి), ఆమె చెవులకి ఇంపైన మాటల్తో సంతోషపెట్టాడు.

రామో భామిని లోకస్య చాతుర్వర్ణ్యస్య రక్షితా
మర్యాదానాం చ లోకస్య కర్తా కారయితా చ సః

“ఓ సీతా! రాముడు సమస్త ప్రపంచాన్నీ, నాలుగు వర్ణాల వాళ్ళనీ రక్షిస్తూంటాడు. లోకంలో మర్యాదలు ఏర్పాటుచేసి, వాటినందరూ పాటించేలా చూస్తాడు.

అర్చిష్మానర్చితోఽత్యర్థం బ్రహ్మచర్యవ్రతే స్థితః
సాధూనాముపకారజ్ఞః ప్రచారజ్ఞశ్చ కర్మణామ్

రాముడు కాంతిమంతుడు. బాగా గౌరవింపబడేవాడు. ఇప్పుడు బ్రహ్మచర్యవ్రతంలో ఉన్నవాడు. మంచివాళ్ళకి ఉపకారం చెయ్యడం ఎలాగో తెలిసినవాడు. కర్మల యొక్క ఫలితాల గురించి బాగా తెలిసినవాడు.

రాజవిద్యావినీతశ్చ బ్రాహ్మణానాముపాసితా
శ్రుతవాన్ శీలసంపన్నో వినీతశ్చ పరంతపః

రాజవిద్యలో శిక్షణ పొందినవాడు. బ్రాహ్మణుల్ని గౌరవించేవాడు. శాస్త్రాల్ని చదువుకున్నవాడు. వినయం ఉన్నవాడు. శత్రువుల్ని పీడించేవాడు.

యజుర్వేదవినీతశ్చ వేదవిద్భిః సుపూజితః

ధనుర్వేదే చ వేదేషు వేదాంగేషు చ నిష్ఠితః

తన స్వంత శాఖ అయిన యజుర్వేదాన్ని నేర్చుకున్నాడు. వేదవేత్తలంతా అతన్ని గౌరవిస్తారు. ధనుర్వేదం, మిగిలిన మూడు వేదాలు, వేదాంగాలలో కూడా గొప్ప పాండిత్యం ఉన్నవాడు.

విపులాంసో మహాబాహుః కంబుగ్రీవః శుభాననః

గూఢజత్రుః సుతామ్రాక్షో రామో దేవి జనైః శ్రుతః

ఓ దేవీ! ఆ రాముని భుజాలు విశాలమైనవి. చేతులు పొడవైనవి. కంఠం శంఖంలా ఉంటుంది. ముఖం మంగళాన్నిచ్చేది. మూపుకున్న సంధి ఎముకలు కనబడవు. అతని అందమైన కళ్ళు ఎర్రగా ఉంటాయి. అందరికీ అతనెవరో తెలుసు.

దుందుభిస్వననిర్ఘోషః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్

సమః సమవిభక్తాంగో వర్ణం శ్యామం సమాశ్రితః

దుందుభిధ్వని వంటి కంఠధ్వనీ, నిగనిగలాడే శరీరపు రంగూ ఉన్నవాడు. ప్రతాపం ఉన్నవాడు. సమంగా సరిపడే ఎత్తున్నవాడు. పద్ధతిగా విభజించబడ్డ అవయవాలున్నవాడు. నల్లని మేనిరంగువాడు.

త్రిస్థిరస్త్రిప్రలంబశ్చ త్రిసమస్త్రిషు చోన్నతః

త్రితామ్రస్త్రిషు చ స్నిగ్ధో గంభీరస్త్రిషు నిత్యశః

అతని ఛాతీ, మోచెయ్యి, పిడికిలి స్థిరంగా ఉంటాయి. కనుబొమలు, చేతులు పొడవుగా ఉంటాయి. బొడ్డు, పొత్తికడుపూ, ఛాతీ పొడుగ్గా ఉంటాయి. కనుచివరలు, గోళ్ళు, అరచేతులు, అరకాళ్ళు ఎర్రగా ఉంటాయి. కాలిలో రేఖలూ, వెంట్రుకలూ నున్నగా ఉంటాయి. కంఠధ్వని, నడక గంభీరంగా ఉంటాయి.

సత్యధర్మపరః శ్రీమాన్ సంగ్రహానుగ్రహే రతః
దేశకాలవిభాగజ్ఞః సర్వలోకప్రియంవదః

రాముడు సత్యధర్మం పట్ల చాలా ఆసక్తి ఉన్నవాడు. శ్రీమంతుడు. జనాల్ని చేరదీయడంలోనూ, వాళ్ళని అనుగ్రహించడంలోనూ చాలా ఆసక్తి ఉన్నవాడు. దేశకాలాల విభాగాల్ని తెలిసినవాడు. అందరితో ప్రేమగా మాట్లాడేవాడు.

భ్రాతా చ తస్య వైమాత్రః సౌమిత్రిరపరాజితః
అనురాగేణ రూపేణ గుణైశ్చైవ తథావిధః

ఎవ్వళ్ళచేతా ఓడింపబడని లక్ష్మణుడు, ఆ రాముడి సవతితల్లికి కొడుకు. తమ్ముడు. అనురాగంలో, రూపంలో, గుణాల్లో, అన్నింటిలోనూ రాముడిలాంటి వాడే.

తావుభౌ నరశార్దూలౌ త్వద్దర్శనసముత్సుకౌ
విచిన్వన్తౌ మహీం కృత్స్నామస్మాభిరభిసంగతౌ

ఆ మానవశ్రేష్ఠులిద్దరూ నిన్ను వెతుక్కుంటూ భూమంతా తిరుగుతూ మమ్మల్ని కలుసుకున్నారు.

నివేదితౌ చ తత్త్వేన సుగ్రీవాయ మహాత్మనే

తయోరన్యోన్యసల్లాపాద్భృశం ప్రీతిరజాయత

నేను మహాత్ముడు సుగ్రీవుడికి రామలక్ష్మణుల విషయాల్ని చెప్పాను. ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకున్నాక, రామసుగ్రీవులిద్దరికీ బాగా స్నేహం కుదిరింది.

వానరోఽహం మహాభాగే దూతో రామస్య ధీమతః

రామనామాంకితం చేదం పశ్య దేవ్యంగులీయకమ్

ఓ మహాభాగ్యవంతురాలా! నేను బుద్ధిశాలి అయిన రాముడి దూతని. ఓ దేవీ! రాముని పేరు గుర్తుగా ఉన్న ఈ ఉంగరం చూడు."

గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్

భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితాభవత్

సీత ఆ ఉంగరాన్ని తీసుకుని, చూస్తూ, భర్త శ్రీరాముణ్ణే చేరినంత సంతోషం పొందింది.

సా రామసంకీర్తనవీతశోకా

రామస్య శోకేన సమానశోకా

శరన్ముఖే సాంబుదశేషచంద్రా

నిశేవ వైదేహసుతా బభూవ

రాముడికి ఎంత శోకం ఉందో, సీతకి కూడా అంత శోకమే ఉంది. కాని రాముడి యొక్క వర్ణన వినడంవల్ల సీతకి కొద్దిగా శోకం తగ్గింది. ఇలా ఒకపక్క శోకంతో, మరోపక్క ఆనందంతో ఉన్న ఆమె, శరత్కాలం మొదటి రోజుల్లో కొద్దిగా మబ్బులు మిగిలి ఉన్నప్పుడు చంద్రుడితో కూడిన రాత్రి ఎలా ఉంటుందో, అలా ఉంది.

సా సీతా వచనం శ్రుత్వా పూర్ణచంద్రనిభాననా
హనూమన్తమువాచేదం ధర్మార్థసహితం వచః

నిండు చందమామలాంటి ముఖం ఉన్న సీత అతని మాటలు విని, ధర్మార్థాల్తో కూడిన మాటల్ని ఇలా చెప్పింది.

రాక్షసానాం వధం కృత్వా సూదయిత్వా చ రావణమ్
లంకామున్మూలితాం కృత్వా కదా ద్రక్ష్యతి మాం పతిః

“నా భర్త రాక్షసుల్ని చంపి, రావణుణ్ణి హతమార్చి, లంకానగరాన్ని పూర్తిగా నాశనం చేసి, నన్నెప్పుడు చూస్తాడో గదా!

స వాచ్యః సంత్వరస్వేతి యావదేవ న పూర్యతే
అయం సంవత్సరః కాలస్తావద్ధి మమ జీవితమ్

ఈ సంవత్సరకాలం పూర్తి అవకముందే నన్ను రక్షించడానికి తొందరపడాలని ఆ రాముడికి చెప్పు. ఎందుకంటే నేను అంతవరకూనే బ్రతికి ఉంటాను.

వర్తతే దశమో మాసో ద్వౌ తు శేషౌ ప్లవంగమ
రావణేన నృశంసేన సమయో యః కృతో మమ

ఓ హనుమంతుడా! క్రూరడైన రావణుడు నాకిచ్చిన గడువులో ఇప్పుడు పదవనెల గడుస్తోంది. ఇంక రెండు నెలలే మిగిలి ఉన్నాయి.

అసంశయం హరిశ్రేష్ఠ క్షిప్రం మాం ప్రాప్స్యతే పతిః
అంతరాత్మా చ మే శుద్ధస్తస్మింశ్చ బహవో గుణాః

హనుమంతుడా! నా మనసు పరిశుద్ధమైంది. రాముడిలో కూడా అనేక సద్గుణాలున్నాయి. అందువల్ల, నా భర్త తప్పకుండా నన్ను త్వరగా చేరుకుంటాడు. దీనిలో ఎలాంటి అనుమానం లేదు.”

ఇతి సంజల్పమానాం తాం రామార్థే శోకకర్శితామ్
అశ్రుసంపూర్ణనయనామువాచ వచనం కపిః

రాముడి కోసం దుఃఖంతో కృశించి, కన్నీళ్ళు నిండిన కళ్ళతో ఈ విధంగా చెపుతున్న సీతతో హనుమంతుడు ఇలా అన్నాడు.

న త్వామిహస్థాం జానీతే రామః కమలలోచనే
శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్రమేష్యతి రాఘవః
చమూం ప్రకర్షన్మహతీం హర్యృక్షగణసంకులామ్

“ఓ కమలనేత్రా, సీతా! నువ్వు ఇక్కడున్నట్లు రాముడికి తెలియదు. నా మాట వినగానే వెంటనే రాముడు వానరగణాల్తోనూ, ఎలుగుబంట్ల గుంపుతోనూ నిండిన పెద్ద సైన్యంతో వస్తాడు.

అథవా మోచయిష్యామి త్వామద్యైవ వరాననే
అస్మాద్దుఃఖాదుపారోహ మమ పృష్ఠమనిందితే

లేదా, ఓ అందమైన ముఖమున్న సీతా! నిన్ను ఇప్పుడే ఈ దుఃఖం నుంచి తప్పిస్తాను.   ఓ దోషమేమీ లేని సీతాదేవీ! నా వీపు పైకి ఎక్కు. నిన్ను ఇప్పుడే రాముడి దగ్గరకి చేరుస్తాను.”

మైథిలీ తు హరిశ్రేష్ఠాచ్ఛ్రుత్వా వచనమద్భుతమ్
హర్షవిస్మితసర్వాంగీ హనుమంతమథాబ్రవీత్

అద్భుతమైన ఆ హనుమంతుడి మాటలు వినగానే సీతకి సంతోషంతో ఒళ్ళంతా పులకించింది. అతనితో ఇలా అంది.

కథం వాల్పశరీరస్త్వం మామితో నేతుమిచ్ఛసి,
సకాశం మానవేంద్రస్య భర్తుర్మే ప్లవగర్షభ

“ఓ వానరశ్రేష్ఠుడా! ఇంత చిన్న శరీరం ఉన్న నువ్వు నన్ను ఇక్కడనుంచి నా భర్త రాముడి దగ్గరకి తీసుకుపోగలవని ఎలా అనుకుంటున్నావు?”

స తస్మాత్పాదపాద్ధీమానాప్లుత్య ప్లవగర్షభః

తతో వర్ధితుమారేభే సీతాప్రత్యయకారణాత్

బుద్ధికుశలుడైన హనుమంతుడు ఆ చెట్టు నుంచి కిందకి దూకి, సీతని నమ్మించడం కోసం పెరగడం ప్రారంభించాడు.

మేరుమందరసంకాశో బభౌ దీప్తానలప్రభః

అగ్రతో వ్యవతస్థే చ సీతాయా వానరోత్తమః

అలా ఆ వానరోత్తముడు హనుమంతుడు మేరు, మందర పర్వతాల్లా ఎత్తైన శరీరంతో, మండుతున్న అగ్నిలా వెలిగిపోతూ సీత ఎదుట నిలిచాడు.

హరిః పర్వతసంకాశస్తామ్రవక్త్రో మహాబలః

వజ్రదంష్ట్రనఖో భీమో వైదేహీమిదమబ్రవీత్

ఎర్రని ముఖంతోనూ, వజ్రాల్లాంటి కోరల్తో, గోళ్ళతో, భయం పుట్టించేలా, పర్వతంలా ఉన్న ఆ మహాబలశాలి హనుమంతుడు సీతతో ఇలా అన్నాడు.

సపర్వతవనోద్దేశాం సాట్టప్రాకారతోరణామ్

లంకామిమాం సనాథాం వా నయితుం శక్తిరస్తి మే

“పర్వతాలూ, తోటలూ, కోటబురుజులూ, ప్రాకారాలూ, ముఖద్వారాలూ, రావణుడితో సహా లంకానగరం, అన్నీ తీసుకుని వెళ్ళేంత శక్తి ఉంది నాకు”

తం దృష్ట్వా భీమసంకాశమువాచ జనకాత్మజా
పద్మపత్రవిశాలాక్షీ మారుతస్యౌరసం సుతమ్

వాయుదేవుడి ఔరసపుత్రుడూ, భయంకరుడూ అయిన హనుమంతుణ్ణి చూసి కమల దళాల్లా విశాలమైన కన్నులున్న సీత ఇలా అంది.

జానామి గమనే శక్తిం నయనే చాపి తే మమ
అవశ్యం సంప్రధార్యాశు కార్యసిద్ధిర్మహాత్మనః

"నువ్వు నన్ను తీసుకుని వెళ్ళగలవన్న విషయం నాకు తెలుసు (నమ్మకం ఉంది). కాని మహత్ముడైన రాముడి యొక్క పని చెడిపోకుండా ఎలా చెయ్యాలో మనం నిర్ణయించాలి.

భర్తుర్భక్తిం పురస్కృత్య రామాదన్యస్య వానర
న స్పృశామి శరీరం తు పుంసో వానరపుంగవ

ఓ వానరోత్తమా! పాతివ్రత్యధర్మాన్ని పాటించే నేను రాముడు తప్ప వేరే మగవాడి ఒంటిని ముట్టుకోను.

యదహం గాత్రసంస్పర్శం రావణస్య బలాద్గతా
అనీశా కిం కరిష్యామి వినాథా వివశా సతీ

బలాత్కారంవల్ల, రావణుడి ఒళ్ళు నాకు తగలడం జరిగింది. కాని ఆ సమయంలో నన్ను రక్షించే నాథుడు లేకపోవడంవల్లా, స్వయంగా రక్షించుకునే శక్తి లేకపోవడంవల్లా ఆ రావణుడి ఆధీనంలోపడి ఏమీ చెయ్యలేకపోయాను.

యది రామో దశగ్రీవమిహ హత్వా సబాంధవమ్
మామితో గృహ్య గచ్ఛేత తత్తస్య సదృశం భవేత్

రాముడిక్కడ రావణుణ్ణీ, వాడి బంధువుల్నీ చంపి, నన్నిక్కడనుంచి తీసికెళితే, అది రాముడికి తగినట్టుంటుంది.

ఇదం శ్రేష్ఠమభిజ్ఞానం బ్రూయాస్త్వం తు మమ ప్రియమ్
శైలస్య చిత్రకూటస్య పాదే పూర్వోత్తరే పురా
తస్యోపవనఖండేషు నానాపుష్పసుగంధిషు
విహృత్య సలిలే క్లిన్నో మమాంకే సముపావిశః

(రాముడు నన్ను నువ్వు చూశావని నమ్మడానికోసం) నువ్వు నా భర్త తో ఈ (చెప్పబోయే) విషయాన్ని గొప్ప గుర్తుగా చెప్పు. పూర్వం చిత్రకూటపర్వతం యొక్క ఈశాన్యదిశలో ఉన్న చిన్న కొండ దగ్గర రకరకాల పువ్వుల సువాసనల్తో నిండిన వనం ఉండేది. ఆ వనంలో ఉన్న నీటిలో విహరించి బాగా తడిసిపోయాడు. నా దగ్గరకొొచ్చి కూర్చున్నాడు.

తతోమాంససమాయుక్తో వాయసః పర్యతుండయత్

తమహం లోష్టముద్యమ్య వారయామి స్మ వాయసమ్

ఇంతలో ఒక కాకి వచ్చి మాసం కావాలన్న కోరికతో నన్ను దాని ముక్కుతో పొడవడం మెదలుపెట్టింది. అప్పుడు నేను మట్టిబెడ్డల్తో కొట్టి దాన్ని ఆపాను.

వాయసః సహసాగమ్య విదదార స్తనాంతరే

తతః సముక్షితో రామో ముక్తైః శోణితబిందుభిః

ఆ కాకి మళ్ళీ అక్కడికొచ్చి నా స్తనాల మధ్యలో చీరడం మొదలుపెట్టింది. అప్పుడు నా వంటిమీద నుంచి రాలిపడ్డ రక్తపు చుక్కలు రాముణ్ణి తడిపాయి.

వాయసేన తతస్తేన బలవత్ క్లిశ్యమానయా

స మయా బోధితః శ్రీమాన్ సుఖసుప్తః పరంతపః

అలా కాకి నన్ను బాధిస్తూంటే, నేను సుఖంగా నిద్రపోతున్న శత్రుసంహారి, శోభాయమానుడు అయిన రాముణ్ణి నిద్రలేపాను.

స దర్భం సంస్తరాద్గృహ్య బ్రాహ్మేణాస్త్రేణ యోజయత్

స దీప్త ఇవ కాలాగ్నిర్జజ్వాలాభిముఖో ద్విజమ్

రాముడు దర్భాసనం (దర్భగడ్డితో చేసిన చాప) నుంచి ఒక దర్భతీసి, దానిమీద బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు. ఆ దర్భ ప్రళయకాలంలో అగ్నిలా ఆ పక్షి ఎదురుగా మండింది.

స తం ప్రదీప్తం చిక్షేప దర్భం తం వాయసం ప్రతి

తతస్తం వాయసం దర్భః సోంబరేఽనుజగామ హ

రాముడు ఆ మండుతున్న దర్భని ఆ కాకివైపు విసిరాడు. అది ఆ కాకిని తరుముకుంటూ వెళ్ళింది.

స పిత్రా చ పరిత్యక్తః సురైశ్చ సమహర్షిభిః

త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః

ఆ కాకి రక్షించేవాడి కోసం మూడు లోకాలూ తిరిగి, దాని తండ్రి ఇంద్రుడూ, ఇతర దేవతలూ, మహర్షులూ, ఎవ్వరూ కూడా వాణ్ణి రక్షించే శక్తిలేదని వదిలేస్తే, చివరికి వచ్చి రాముణ్ణే శరణువేడాడు.

స తం నిపతితం భూమౌ శరణ్యః శరణాగతమ్

వధార్హమపి కాకుత్స్థః కృపయా పర్యపాలయత్

శరణన్నవాణ్ణి కాపాడే ఆ రాముడు, రక్షణకోరి వచ్చి నేలమీదపడి నమస్కారం పెడుతున్న కాకిని, అది చంపదగినదే అయినా, జాలితో రక్షించాడు.

ధారయిష్యామి మాసం తు జీవితం శత్రుసూదన

ఊర్ధ్వం మాసాన్న జీవిష్యే త్వయా హీనా నృపాత్మజ

ఓ శత్రుసంహారకుడైన రామా! నేను ఒక్క నెల్లాళ్ళ పాటే బ్రతికి ఉంటాను. అటుపైన నువ్వు లేకుండా జీవించలేను.

మత్సందేశయుతా వాచస్త్వత్తః శ్రుత్వా చ రాఘవః
పరాక్రమవిధిం వీరో విధివత్సంవిధాస్యతి

వీరుడైన రాముడు ఈ నా సందేశంతో కూడిన ఈ మాటలు నువ్వు చెప్పగానే, చేయవలసిన పద్ధతిలో తన పరాక్రమం ప్రదర్శిస్తాడు."

తతో వస్త్రగతం ముక్త్వా దివ్యం చూడామణిం శుభమ్
ప్రదేయో రాఘవాయేతి సీతా హనుమతే దదౌ

ఇలా ఆనవాలు, సందేశం చెప్పాక, సీత తన కొంగుకి కట్టుకున్న చూడామణిని, ముడి విప్పి "దీన్ని రాముడికియ్యి" అని చెప్తూ హనుమంతుడికి ఇచ్చింది.

మణిరత్నం కపివరః ప్రతిగృహ్యాభివాద్య చ
సీతాం ప్రదక్షిణం కృత్వా ప్రణతః పార్శ్వతః స్థితః

హనుమంతుడు ఆ శ్రేష్ఠమైన మణిని తీసుకుని, సీత నమస్కరించి, ప్రదక్షిణం చేసి ఆమె ప్రక్కనే నిలబడ్డాడు.

మణిం దత్త్వా తతః సీతా హనూమంతమథాబ్రవీత్
అభిజ్ఞానమభిజ్ఞాతమేతద్రామస్య తత్త్వతః
మణిం తు దృష్ట్వా రామో వై త్రయాణాం సంస్మరిష్యతి
వీరో జనన్యా మమ చ రాజ్ఞో దశరథస్య చ

మణిని ఇచ్చిన తర్వాత సీత హనుమంతుడితో మళ్ళీ ఇలా అంది. "ఈ ఆనవాలుగా ఇస్తున్న వస్తువు గురించి రాముడికి పూర్తిగా తెలుసును. ఈ చూడామణిని చూడగానే రాముడికి ముగ్గురం గుర్తుకొస్తాం; నా తల్లీ, నేనూ, దశరథమహారాజూ.

త్వాం దృష్ట్వా ప్రియవక్తారం సంప్రహృష్యామి వానర
అర్ధసంజాతసస్యేవ వృష్టిం ప్రాప్య వసుంధరా

ఓ హనుమంతా! సగం సగం మొలకలెత్తిన పంటభూమి మీద వర్షం పడ్డట్టుగా, ఎంతో ప్రియమైన మాటలు చెప్తున్న నిన్ను చూసి, నేను చాలా ఆనందిస్తున్నాను. (సీతకి ఊరట కలిగిందని భావం)

ఏతదేవ హి రామస్య దృష్ట్వా మత్కేశభూషణమ్
శ్రద్ధేయం హనుమన్వాక్యం తవ వీర భవిష్యతి.

ఓ వీరహనుమన్! నా తలకి పెట్టుకునే ఈ చూడామణిని చూడగానే రాముడు నువ్వు (నా గురించి) చెప్పిన మాటలన్నీ నమ్ముతాడు.

తద్యథా తస్య విక్రాంతమనురూపం మహాత్మనః
భవేదాహవశూరస్య తథా త్వముపపాదయ

అందుచేత, యుద్ధంలో శూరుడూ, మహాబుద్ధిశాలీ అయిన రాముడు తనకి తగిన పరాక్రమం చూపించేటట్టుగా చెయ్యి.

హనుమన్ సింహసంకాశౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ

సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్బ్రూయా హ్యనామయమ్

ఓ హనుమన్! సింహాలవంటి సోదరుల్ని రామలక్ష్మణుల్ని కుశలం అడిగానని చెప్పు. మంత్రులందరితో ఉన్న సుగ్రీవుడినీ, ఇతరులందర్నీ నేను కుశలం అడిగానని చెప్పు"

తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్

నిశమ్య హనుమాన్ శేషం వాక్యముత్తరమబ్రవీత్

హనుమంతుడు మంచి అర్థం, యుక్తి, వినయం అన్నీ కలిసిన ఆమె మాటల్ని విని, చివరిగా చెప్పవలసిన సమాధానం ఇలా చెప్పాడు.

నఖదంష్ట్రాయుధాన్ వీరాన్ సింహశార్దూలవిక్రమాన్

వానరాన్వారణేంద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్

వానరులు పరాక్రమంలో సింహాలూ, పెద్దపులులూ. వాళ్ళ శరీరాలు ఏనుగుల శరీరాల్లా చాలా ఎత్తైనవి. వాళ్ళకి గోళ్ళూ, కోరలే ఆయుధాలు. వాళ్ళంతా కలిసి వస్తారు. నువ్వు చూస్తావు.

సగణం రావణం హత్వా రాఘవో రఘునందనః

త్వామాదాయ వరారోహో స్వపురీం ప్రతియాస్యతి

మారుదో దేవి శోకేన మా భూత్తే మనసోఽప్రియమ్

ఓ సీతా! రఘువంశానికి ఆనందం కలిగించే రాముడు రావణుణ్ణి, అతని పరివారాన్నీ నాశనంచేసి, నిన్ను తీసుకుని తన నగరానికి తిరిగి తీసుకెళ్తాడు. ఏడవకు. నీ మనసుకి దుఃఖం కలగకూడదని నా ఆశ."

స తం మణివరం గృహ్యా శ్రీమాన్ ప్లవగసత్తమః

ప్రణమ్య శిరసా దేవీం గమనాయోపచక్రమే

అలా మణిని తీసుకున్న ఆ శ్రీమంతుడైన హనుమంతుడు సీతాదేవికి తలవంచి నమస్కరించి బయల్దేరడానికి సిద్ధమయాడు.

తస్మాద్దేశాదపక్రమ్య చింతయామాస వానరః

అల్పశేషమిదం కార్యం దృష్టేయమసితేక్షణా

త్రీనుపాయానతిక్రమ్య చతుర్థ ఇహ దృశ్యతే

ఆ ప్రదేశం నుంచి కాస్త దూరం వెళ్ళి, ఇలా ఆలోచించాడు. నల్లని కన్నులున్న సీతని చూశాను. ఇంకా చెయ్యవలిసింది కొద్దిగా మిగిలి ఉంది. ఇప్పుడు సామదానభేదాలని వదిలేసి, తిన్నగా దండోపాయాన్నే ప్రయోగించాలి.

కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్

పూర్వకార్యావిరోధేన స కార్యం కర్తుమర్హతి

ఏదైనా పని చెయ్యాలని ఎవరైనా ఆజ్ఞాపిస్తే, ఆ పనికి విరుద్ధంగాలేని మరోకొన్ని పనుల్ని కూడా చేసుకొచ్చేవాడే నిజంగా పనులు చెయ్యడంలో సమర్థుడు.

తతో మారుతవత్క్రుద్ధో మారుతిర్భీమవిక్రమః

ఊరువేగేన మహతా ద్రుమాన్ క్షేప్తుమథారభత్

ఇలా ఆలోచించి, భయంకర పరాక్రమం ఉన్న హనుమంతుడు, కోపంతో, తన గొప్ప తొడలవేగంతో ఎగురుతూ, గాలిదుమారం చెట్లన్నిటినీ విరగ్గొట్టినట్టు, చెట్లని విరగ్గొట్టి పారేయడం మొదలెట్టాడు.

రావణస్య సమీపే తు రాక్షస్యో వికృతాననాః

విరూపం వానరం భీమమాఖ్యాతుముపచక్రముః

వికృతమైన ముఖాలున్న రాక్షసస్త్రీలు రావణుడి దగ్గరకెళ్ళి అతనితో వికృతరూపంలో భయంకరుడిలా ప్రవర్తిస్తున్న వానరాన్ని గురించి చెప్పడం ప్రారంభించారు.

అశోకవనికామధ్యే రాజన్ భీమవపుః కపిః

సీతయా కృతసంవాదస్తిష్ఠత్యమితవిక్రమః

"రాజా! భయంకరమైన శరీరం, విపరీతమైన పరాక్రమం ఉన్న ఒక వానరుడు అశోకవనం మధ్యలో ఉన్నాడు. సీతతో మాట్లాడాడు"

న చ సా జానకీ సీతా హరిం హరిణలోచనః

అస్మాభిర్బహుధా పృష్టా నివేదయితుమిచ్ఛతి.

"లేడికళ్ళ సీతని మేమెంత అడిగినా ఆ వానరుణ్ణి గురించి చెప్పటల్లేదు"

రాక్షసీనాం వచః శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః

హుతాగ్నిరివ జజ్వాల కోపసంవర్తితేక్షణః

ఆ రాక్షసస్త్రీల మాటలు విని కోపంతో కళ్ళు త్రిప్పుతూ రావణుడు హోమం చేసిన అగ్నిలా రగిలిపోయాడు.

ఆత్మనః సదృశాన్ క్రూరాన్ కింకరాన్నామ రాక్షసాన్

వ్యాదిదేశ మహాతేజా నిగ్రహార్థం హనూమతః

రావణుడు, తనతో సమానమైన కింకరులనే పేరున్న రాక్షసశూరుల్ని హనుమంతుణ్ణి పట్టుకోడానికి పంపాడు.

స భూత్వా సుమహాకాయో హనుమాన్ మారుతాత్మజః

ధృష్టమాస్ఫోటయామాస లంకాం శబ్దేన పూరయన్

తస్యాస్ఫోటితశబ్దేన మహతా సానునాదినా

పేతుర్విహంగా గగనాదుచ్చైశ్చేదమఘోషయత్

వాయుపుత్రుడైన హనుమంతుడు దేహాన్ని చాలా పెద్దగా పెంచి, లంకంతా మార్మోగేలా జబ్బలు చరిచాడు. ప్రతిధ్వని వచ్చేలా జబ్బలు చరిచేసరికి, ఆ శబ్దానికి పక్షులు రాలి కిందపడిపోయాయి. హనుమంతుడు బిగ్గరగా అరిచాడు కూడా.

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః

రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః

లోకంలో అందరికన్న బలశాలి రాముడు విజేతయై ఉన్నాడు. మహాబలశాలి లక్ష్మణుడు విజేతయై ఉన్నాడు. రాఘవుడి చేత పాలింపబడే రాజు సుగ్రీవుడు కూడా విజేతయై ఉన్నాడు.

దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః

హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః

నేను కోసలరాజూ, అన్ని పనుల్నీ అతి సునాయాసంగా చేసే రాముడికి దాసుణ్ణి. ఈ శత్రువుల్ని సంహరించగల వాణ్ణి, వాయుపుత్రుణ్ణి. హనుమంతుణ్ణి.

న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్

శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః

అర్దయిత్వా పురీం లంకామభివాద్య చ మైథిలీమ్

సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్

నేను వేలకొద్దీ రాళ్ళూ, చెట్లూ ప్రయోగిస్తూ యుద్ధం చేస్తూంటే, వెయ్యిమంది రావణులైనా సరే యుద్ధరంగంలో నా ఎదుట నిలబడలేరు. రాక్షసులందరూ చూస్తూండగానే నేను లంకానగరాన్ని పీడించి, సీతకి నమస్కరించి, నేను చేద్దామనుకున్న పని పూర్తిచేసుకుని తిరిగి వెళ్తాను."

స హత్వా రాక్షసాన్వీరాన్ కింకరాన్మారుతాత్మజః

యుద్ధకాంక్షీ పునర్వీరస్తోరణం సముపాశ్రితః

హనుమంతుడు ఆ రాక్షసవీరులైన కింకరుల్ని అందర్నీ మట్టుబెట్టి, ఇంకా యుద్ధం చెయ్యడానికి సిద్ధమై, మళ్ళా తోరణముఖద్వారం దగ్గర నిలబడ్డాడు.

సందిష్టో రాక్షసేంద్రేణ ప్రహస్తస్య సుతో బలీ

జంబుమాలీ మహాదంష్ట్రో నిర్జగామ ధనుర్ధరః

తతస్తే రాక్షసేంద్రేణ చోదితా మంత్రిణః సుతాః

నిర్యయు ర్భవనాత్తస్మాత్సప్త సప్తార్చిరోచిషః

రావణుడు అజ్ఞాపించగానే, మంత్రి ప్రహస్తుడి కొడుకూ, బలశాలీ అయిన జంబుమాలి విల్లు చేతబట్టి బయల్దేరాడు. తర్వాత రావణుచేత ప్రేరేపించబడి, అగ్నిలాంటి తేజస్సున్నవాళ్ళూ, గొప్ప సైన్యం వెనకనున్నవాళ్ళూ, విలుకాళ్ళూ అయిన ఏడుగురు మంత్రికుమారులు వాళ్ళ ఇళ్ళనుంచి యుద్ధానికి బయల్దేరారు.

హతాన్ మంత్రిసుతాన్ బుద్ధ్వా వానరేణ మహాత్మనా

సందిదేశ దశగ్రీవః పంచసేనాగ్రనాయకాన్

మహాత్ముడైన హనుమంతుడు ఆ మంత్రికుమారులందర్నీ చంపేశాడని విని ఐదుగురు గొప్ప సేనానాయకుల్ని ఆజ్ఞాపించాడు (యుద్ధానికి వెళ్ళమని).

సేనాపతీన్ పంచ స తు ప్రమాపితాన్

హనూమతా సానుచరాన్ సవాహనాన్

నిశమ్య రాజా సమరోద్ధతోన్ముఖం

కుమారమక్షం ప్రసమైక్షతాగ్రతః

ఐదుగురు సేనాపతుల్నీ వాహనాల్నీ, వాళ్ళ సైన్యాల్నీ కూడా హనుమంతుడు నాశనం చేశాడని విని రావణుడు, మహాతీవ్రంగా యుద్ధంచేసేవాడూ, యుద్ధానికి సిద్ధంగా ఉన్న తన కొడుకు అక్షకుమారుడి వైపు చూశాడు.

నిహత్య తం వజ్రిసుతోపమప్రభం

కుమారమక్షం క్షతజోపమేక్షణమ్

తమేవ వీరోఽభిజగామ తోరణం

కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే

ఇంద్రుడి కొడుకుతో సమానమైన తేజస్సున్నవాడూ, రక్తంలాంటి కళ్ళున్నవాడూ అయిన అక్షకుమారుణ్ణి చంపేసి, ప్రజల్ని చంపడానికి తీరిగ్గా కూర్చున్న యముడిలా, ఆ హనుమంతుడు తోరణం దగ్గరే ఇంకా రాక్షసులు వస్తారేమోనని ఎదురుచూస్తున్నాడు.

తతస్తు రక్షోధిపతిర్మహాత్మా

హనూమతాక్షే నిహతే కుమారే

మనః సమాధాయ స దేవకల్పం

సమాదిదేశేంద్రజితం సరోషః

హనుమంతుడు అక్షకుమారుణ్ణి కూడా చంపేశాడని తెలిసి రావణుడు మనస్సుని కుదుటపరుచుకుని, కోపంతో ఊగిపోతూ, దేవతలతో సమానమైన ఇంద్రజిత్తుని యుద్ధానికి వెళ్ళమని ఆదేశించాడు.

ఆయాంతం సరథం దృష్ట్వా తూర్ణమింద్రజితం కపిః

విననాద మహానాదం వ్యవర్ధత చ వేగవాన్

రథమెక్కి వేగంగా వస్తున్న ఇంద్రజిత్తుని చూసి, హనుమంతుడు గొప్పశబ్దం వచ్చేలా అరిచి, గబగబా శరీరాన్ని పెంచాడు.

తావుభౌ వేగసంపన్నౌ రణకర్మవిశారదౌ

సర్వభూతమనోగ్రాహి చక్రతుర్యుద్ధముత్తమమ్

అతివేగంగా కదుల్తూ, గొప్పగా యుద్ధంచెయ్యడంలో నేర్పరులైన వాళ్ళిద్దరూ అందరి మనసులకీ ఆశ్చర్యం కలిగేలా యుద్ధం చేసారు.

తతః పైతామహం వీరః సోఽస్త్రమస్త్రవిదాం వరః

సందధే సుమహాతేజాస్తం హరిప్రవరం ప్రతి

ఆ తర్వాత వీరుడూ, మహాతేజస్వీ, అస్త్రవిద్య నేర్చినవాళ్ళలో శ్రేష్ఠుడూ అయిన ఇంద్రజిత్తు హనుమంతుడి మీద బ్రహ్మాస్త్రాన్ని ఎక్కుపెట్టాడు.

అవధ్యోఽయమితి జ్ఞాత్వా తమస్త్రేణాస్త్రతత్త్వవిత్
నిజగ్రాహ మహాబాహుర్మారుతాత్మజమింద్రజిత్

అస్త్రాల బలాబలాలు బాగా తెలిసిన ఇంద్రజిత్తు, హనుమంతుణ్ణి చంపడం సాధ్యం కాదని తెలుసుకుని, బ్రహ్మాస్త్రంతో కట్టిపడేశాడు.

హనుమాంశ్చింతయామాస వరదానం పితామహాత్
అస్త్రేణాపి హి బద్ధస్య భయం మమ న జాయతే
పితామహమహేంద్రాభ్యాం రక్షితస్యానిలేన చ

హనుమంతుడు తనకి బ్రహ్మ ఇచ్చిన వరాన్ని గుర్తుకి తెచ్చుకున్నాడు. నన్ను బ్రహ్మదేవుడు, మహేంద్రుడు, వాయుదేవుడూ రక్షిస్తున్నారు గాబట్టి ఈ అస్త్రం చేత కట్టబడ్డా నాకేం భయంలేదు (అనుకున్నాడు).

తం మత్తమివ మాతంగం బద్ధం కపివరోత్తమమ్
రాక్షసా రాక్షసేంద్రాయ రావణాయ న్యవేదయన్

బంధించబడి, మదించిన ఏనుగులా ఉన్న హనుమంతుణ్ణి రాక్షసులు రావణుడి దగ్గరకి తీసుకెళ్ళి చూపించారు.

భ్రాజమానం తతో దృష్ట్వా హనుమాన్రాక్షసేశ్వరమ్

మనసా చింతయామాస తేజసా తస్య మోహితః

అప్పుడు కాంతివంతంగా ఉన్న రావణుణ్ణి చూసి,అతని తేజస్సుకి ముగ్ధుడైన హనుమంతుడు మనసులో ఇలా అనుకున్నాడు.

అహో రూపమహో ధైర్యమహో సత్త్వమహో ద్యుతిః

అహో రాక్షసరాజస్య సర్వలక్షణయుక్తతా

ఆహా! ఏమి రూపం ఈ రావణుడిది! ఏమి ధైర్యం! ఏమి బలం! ఏమి తేజస్సు! అన్ని లక్షణాల్తో ఉన్నాడే!

తముద్వీక్ష్య మహాబాహుః పింగాక్షం పురతః స్థితమ్

కోపేన మహతావిష్టో రావణో లోకరావణః

శంకాహృతాత్మా దధ్యౌ స కపీంద్రం తేజసావృతమ్

గొప్ప బాహువులున్నవాడూ, లోకాల్ని ఏడ్పించేవాడూ అయిన రావణుడు ఎదురుగా నిలబడ్డ వానరుణ్ణి చూసి, కోపంతో నిండిన మనస్సులో ఎన్నో సందేహాలు కలిగి, తేజోమూర్తి హనుమంతుడి గురించి ఆలోచనలో పడ్డాడు.

కిమేష భగవాన్నందీ భవేత్సాక్షాదిహాగతః

యేన శప్తోఽస్మి కైలాసే మయా సంచాలితే పురా

సోఽయం వానరమూర్తిః స్యాత్కింస్విద్బాణో మహాసురః

సాక్షాత్తూ ఇక్కడికొచ్చిన ఇతను, పూర్వం నేను కైలాసం ఎత్తుతున్నప్పుడు నన్ను శపించిన పూజ్యుడైన ఆ నందీశ్వరుడేనా? లేక వానరాకారంలో ఉన్న బాణాసురుడా?

స రాజా రోషతామ్రాక్షః ప్రహస్తం మంత్రిసత్తమమ్

కాలయుక్తమువాచేదం వచోఽవిపులమర్థవత్

ఆ రావణుడు కోపంతో ఎర్రబడ్డ కళ్ళతో, మంత్రిశ్రేష్ఠుడైన ప్రహస్తుడితో, సమయానికి తగ్గట్టు, అర్థంతో నిండిన, తక్కువ మాటల్లో అడిగాడు.

మత్పురీమప్రధృష్యాం వా గమనే కిం ప్రయోజనమ్

వనభంగే చ కోఽస్యార్థో రాక్షసీనాం చ తర్జనే

ఆయోధనే వా కిం కార్యం పృచ్ఛ్యతామేష దుర్మతిః

"ఎవ్వరూ ఎదిరించలేని నా నగరానికి ఏ ప్రయోజనం కోసం వచ్చాడో, ఎందుకు యుద్ధం చేశాడో, వనాన్ని నాశనంచేసి, రాక్షసస్త్రీల్ని ఎందుకు భయపెట్టాడో ఈ దుర్బుద్ధిని అడుగు."

తం సమీక్ష్య మహాసత్త్వం సత్త్వవాన్ హరిసత్తమః

వాక్యమర్థవదవ్యగ్రస్తమువాచ దశాననమ్

హనుమంతుడు రావణుణ్ణి చూసి ఏమాత్రం భయపడకుండా అతన్తో అర్థవంతమైన మాటలు చెప్పాడు.

అహం తు హనుమన్నామ మారుతస్యారసః సుతః
అహం సుగ్రీవసందేశాదిహ ప్రాప్తస్తవాలయమ్
రాక్షసేంద్ర హరీశస్త్వాం భ్రాతా కుశలమబ్రవీత్

"ఓ రాక్షసరాజా! నేను వాయుదేవుడి ఔరసపుత్రుణ్ణి, హనుమంతుడని పేరు. నేను సుగ్రీవుడి ఆజ్ఞ వల్ల ఇక్కడికి వచ్చాను. నీ సోదరుడు, వానరరాజు అయిన సుగ్రీవుడు నిన్ను కుశలమడిగాడు.

భ్రాతుః శృణు సమాదేశం సుగ్రీవస్య మహాత్మనః
ధర్మార్థోపహితం వాక్యమిహ చాముత్ర చ క్షమమ్

మహాత్ముడైన నీ సోదరుడు సుగ్రీవుడు నీకు కబురు పంపాడు. ధర్మార్థాల్తో కూడినవీ, ఇహపరాల్లో శ్రేయస్సునిచ్చేవీ అయిన ఆ మాటలు విను.

న చాపి త్రిషు లోకేషు రాజన్విద్యేత కశ్చన
రాఘవస్య వ్యలీయం యః కృత్వా సుఖమవాప్నుయాత్

ఓ రాజా! ఈ మూడు లోకాల్లోనూ ఏ ఒక్కడూ రాముడికి అపకారం చేసి సుఖంగా బతకలేడు.

తత్త్రికాలహితం వాక్యం ధర్మ్యమర్థానుబంధి చ

మన్యస్వ నరదేవాయ జానకీ ప్రతిదీయతామ్

అందుచేత మూడు కాలాల్లోనూ మంచిదీ, ధర్మసమ్మతమైనదీ, అర్థాన్నిచ్చేదీ అయిన నామాటని అంగీకరించు. సీతని రాముడికి తిరిగి ఇచ్చెయ్.

స్వాని మిత్రాణి మంత్రీంశ్చ జ్ఞాతీన్ భ్రాతౄన్సుతాన్హితాన్

భోగాన్ దారాంశ్చ లంకాం చ వినాశముపానయ

నీ స్నేహితులు, మంత్రులు, జ్ఞాతులు, తమ్ముళ్ళు, కొడుకులు, నీ మంచికోరేవాళ్ళు, భోగాలు, భార్యలు, లంక ఇవన్నీ నాశనం చేసుకోకు.

సర్వభూతేషు సర్వత్ర సర్వకాలేషు నాస్తి సః

యో రామం ప్రతియుధ్యేత విష్ణుతుల్యపరాక్రమమ్

విష్ణువుతో సమానమైన పరాక్రమం ఉన్న రాముడి ఎదురుగా నిల్చి యుద్ధం చెయ్యగలగినవాడు ఎక్కడా, ఏ కాలంలోనూ లేడు.

తస్య తద్వచనం శ్రుత్వా వానరస్య మహాత్మనః

ఆజ్ఞాపయద్వధం తస్య రావణః క్రోధమూర్ఛితః

ఆ హనుమంతుడి మాటలు విని, రావణుడు క్రోధావేశంతో “వీణ్ణి చంపండి” అని ఆదేశించాడు.

వధే తస్య సమాజ్ఞప్తే రావణేన దురాత్మనా

నివేదితవతో దౌత్యం నానుమేనే విభీషణః

ఉవాచ హితమత్యర్థం వాక్యం వాక్యవిశారదః

దురాత్ముడైన రావణుడు హనుమంతుణ్ణి చంపమని ఆజ్ఞాపించడం చూసి, (రావణుడి తమ్ముడు) దూతని చంపకూడదని తెలిసిన విభీషణుడు అతని వధని ఇష్టపడలేదు. మంచి హితమైన మాటల్ని చెప్పాడు.

ప్రసీద లంకేశ్వర రాక్షసేంద్ర

ధర్మార్థయుక్తం వచనం శృణుష్వ

దూతానవధ్యాన్ సమయేషు రాజన్

సర్వేషు సర్వత్ర వదంతి సంతః

ఓ లంకేశ్వరా! రాక్షసరాజా! అనుగ్రహించు. ధర్మార్థాల్తో కూడిన నా మాట విను. ఏ దేశంలోనూ, ఏ సమయంలోనూ కూడా దూతల్ని చంపకూడదని సత్పురుషులు చెప్తారు.

తస్య తద్వచనం శ్రుత్వా దశగ్రీవో మహాత్మనః

దేశకాలహితం వాక్యం భ్రాతురుత్తరమబ్రవీత్

రావణుడు మహాత్ముడూ,తమ్ముడూ అయిన ఆ విభీషణుడు చెప్పిన దేశకాలానుగుణాలైన మాట విని, ఇలా అన్నాడు.

కపీనాం కిల లాంగూలమిష్టం భవతి భూషణమ్

తదస్య దీప్యతాం శీఘ్రం తేన దగ్ధేన గచ్ఛతు

తోక వానరులకి చాలా ఇష్టమైన అలంకారం గదా! దానికి నిప్పంటించండి. కాలిపోయిన తోకతో వెనక్కి పంపండి.

తైలేన పరిషిచ్యాథ తేఽగ్నిం తత్రాభ్యపాతయన్

లాంగూలేన ప్రదీప్తేన రాక్షసాంస్తానపాతయత్

రోషామర్షపరీతాత్మా బాలసూర్యసమాననః

అప్పుడు రాక్షసులు నూనెతో తడిపి, తోకకి నిప్పంటించారు. ఆ తోక మండుతూంటే, బాలసూర్యుడిలా ముఖం ఉన్న హనుమంతుడు, పట్టరాని కోపంతో, ఆ రాక్షసుల్నందర్నీ కిందకి పడదోశాడు.

దీప్యమానే తతస్తత్ర లాంగూలాగ్రే హనూమతః

రాక్షస్యస్తా విరూపాక్ష్యః శంసుర్దేవ్యాస్తదప్రియమ్

అక్కడ హనుమంతుడి తోక చివరన రాక్షసులు నిప్పంటిస్తున్నప్పుడు, అశోకవనంలో వికృతమైన ముఖాలున్న స్త్రీలు, సీతకి అప్రియమైన ఆ వార్త చెప్పారు.

శ్రుత్వా తద్వచనం క్రూరమాత్మాపహరణోపమమ్

వైదేహీ శోకసంతప్తా హుతాశనముపాగమత్

రావణుడు తనని అపహరించి తెచ్చినప్పుడు ఎంత బాధపడిందో, అంత బాధాకలిగించే ఆ క్రూరమైన మాట విని, సీత దుఃఖంలో నిండి, అగ్నిని ప్రార్థించింది.

యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః

యది చాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః

“ఓ అగ్నిదేవా! నేనేగనక పతిసేవ చేసినదాన్నయితే, తపస్సు చేసి ఉన్నట్టయితే, నాకు పాతివ్రత్యమే ఉంటే, హనుమంతుడిని పట్ల చల్లగా ఉండు”.

దహ్యమానే చ లాంగూలే చింతయామాస వానరః

ప్రదీప్తోఽగ్నిరయం కస్మాన్న మాం దహతి సర్వతః

తన తోక మండుతూండగా, హనుమంతుడు ‘తోకంతా మండుతున్నా ఈ అగ్ని నన్ను ఎందుకు కాల్చటల్లేదో!’ అనుకున్నాడు.

సీతాయాశ్చానృశంస్యేన తేజసా రాఘవస్య చ

పితుశ్చ మమ సఖ్యేన న మాం దహతి పావకః

‘ఆ సీతాదేవికి నామీద ఉన్న దయవల్లా, రాముడి తేజస్సువల్లా, నా తండ్రి వాయుదేవుడితో ఉన్న స్నేహంవల్లా, అగ్నిదేవుడు నన్ను కాల్చడం లేదు.’

భూయః స చింతయామాస ముహూర్తం కపి కుంజరః
ఉత్పపాతాథ వేగేన ననాద చ మహాకపిః

ఆ వానరశ్రేష్ఠుడు మళ్ళా ఒక్క క్షణం ఆలోచించి, వేగంగా పైకి ఎగిరి, గర్జించాడు.

వనం తావత్ప్రమథితం ప్రకృష్టా రాక్షసా హతాః
బలైకదేశః క్షపితః శేషం దుర్గవినాశనమ్

'వనం అంతా విరిచాను. పరాక్రమవంతులైన రాక్షసుల్ని చంపాను. సైన్యంలో ఒక భాగాన్ని నాశనం చేసాను. ఇంక ఈ కోటని నాశనం చెయ్యడం మిగిలింది.'

యో హ్యయం మమ లాంగూలే దీప్యతే హవ్యవాహనః
అస్య సంతర్పణం న్యాయం కర్తుమేభిర్గృహోత్తమైః

'నా తోకమీద ఉన్న ప్రజ్వలిస్తున్న అగ్నిదేవుడికి, ఈ మంచి మంచి ఇళ్ళతో సంతర్పణ చెయ్యడం న్యాయమైన పని'.

తతః ప్రతప్తలాంగూలః సవిద్యుదివ తోయదః
భవనాగ్రేషు లంకాయా విచచార మహాకపిః
ముమోచ హనుమానగ్నిం కాలానలశిఖోపమమ్

ఆ హనుమంతుడు మండుతున్న తోకతో, మెరుపుతో కలిసి ఉన్న మేఘంలా, లంకలో ఇళ్ళపైన పరుగులెత్తాడు. వాటిమీద ప్రళయకాలాగ్నిశిఖల్లాంటి అగ్నిని విడిచిపెట్టాడు.

హనూమతా వేగవతా వానరేణ మహాత్మనా
లంకాపురం ప్రదగ్ధం తద్రుద్రేణ త్రిపురం యథా

మహావేగంగా ఎగిరే హనుమంతుడు ఆ లంకానగరాన్ని రుద్రుడు త్రిపురాన్ని కాల్చినట్టుగా కాల్చేశాడు.

తత్ర దేవాః సగంధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః
దృష్ట్వా లంకాం ప్రదగ్ధాం తాం విస్మయం పరమం గతాః

అక్కడ ఆ లంకానగరం కాల్చబడుతూంటే చూసి దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు చాలా ఆశ్చర్యపడ్డారు.

వజ్రవిద్రుమవైదూర్యముక్తారజతసంహితాన్
విచిత్రాన్ భవనాద్ధాతూన్ స్యందమానాన్ దదర్శ సః
సందీప్యమానాం విత్రస్తాం త్రస్తరక్షోగణాం పురీమ్
అవేక్ష్య హనుమాన్ లంకాం చింతయామాస వానరః

కాలిపోయిన భవనాల్నుంచి వజ్రం, పగడం, వైడూర్యం, ముత్యం, వెండి కలిసిపోయి రకరకాల రూపాల్లో ధాతువులు కారిపోతూండగా హనుమంతుడు

చూశాడు. మంటల్తో నిండింది, భయపడింది, భయంతో నిండిన రాక్షసగణాల్తో ఉన్నదీ అయిన ఆ లంకానగరాన్ని చూసి, హనుమంతుడు ఇలా ఆలోచించాడు.

ధిగస్తు మాం సుదుర్బుద్ధిం నిర్లజ్జం పాపకృత్తమమ్
యది దగ్ధా త్వియం లంకా నూనమార్యాపి జానకీ
దగ్ధా తేన మయా భర్తుర్హతం కార్యమజానతా

'ఛీ! నేనంత సిగ్గులేనివాణ్ణి! బుద్ధిలేనివాణ్ణి! మహాపాపాత్ముణ్ణి. ఈ లంకంతా కాలిపోయి ఉంటే పూజ్యురాలు సీత కూడా కాలిపోయి ఉంటుంది. నేను తెలివితక్కువతనంతో స్వామి పనినంతా పాడుజేసాను.'

ఇతి చింతయతస్తస్య నిమిత్తాన్యుపపేదిరే
పూర్వమప్యుపలబ్ధాని సాక్షాత్పునరచింతయత్

హనుమంతుడీ విధంగా ఆలోచిస్తూండగా పూర్వం అతనికి కనబడ్డ శకునాలు కనబడ్డాయి. అప్పుడు మళ్ళీ ఇలా అనుకున్నాడు.

యద్వా దహనకర్మాయం సర్వత్ర ప్రభురవ్యయః
న మే దహతి లాంగూలం కథమార్యాం ప్రధక్ష్యతి

'ఎక్కడా ఏ అడ్డూ లేకుండా ప్రసరించగలిగిన ఈ అగ్ని, నా తోకనే కాల్చలేదు. ఇంక సీతని ఎలా కాలుస్తాడు?'

స తథా చింతయంస్తత్ర దేవ్యా ధర్మపరిగ్రహమ్

శుశ్రావ హనుమాన్వాక్యం చారణానాం మహాత్మనామ్

అలా ధర్మపరాయణురాలైన సీతని గురించి ఆలోచిస్తున్న హనుమంతుడికి (ఆకాశంలో వెడుతున్న) చారణుల మాటలు వినబడ్డాయి.

దగ్ధేయం నగరీ సర్వా సాట్టప్రాకారతోరణా

జానకీ న చ దగ్ధేతి విస్మయోఽద్భుత ఏవ నః

“కోటబురుజులూ, ప్రాకారాలూ, ముఖద్వారాలూ, నగరం.. అంతా కాలిపోయింది. కాని సీతమాత్రం కాల్చబడలేదన్నది ఆశ్చర్యం కలిగిస్తోంది”.

తతస్తు శింశుపామూలే జానకీం పర్యుపస్థితామ్

అభివాద్యాబ్రవీద్దిష్ట్యా పశ్యామి త్వామిహాక్షతామ్

ఆ తర్వాత, హనుమంతుడు శింశుపావృక్షం దగ్గర ఉన్న జానకిని చూసి, నమస్కరించి, “దైవవశంవల్ల ఏ అపాయంలేకుండా ఉన్న నిన్ను చూడగలిగా” అన్నాడు.

తతః స కపిశార్దూలః స్వామిసందర్శనోత్సుకః

ఆరురోహ గిరిశ్రేష్ఠమరిష్టమరిమర్దనః

తర్వాత, శత్రువుల్ని సంహరించే ఆ హనుమంతుడు ప్రభువుని చూడాలన్న ఉత్సాహంతో మంగళప్రదమైన గొప్ప పర్వతం పైకి ఎక్కాడు.

స మారుత ఇవాకాశం మారుతస్యాత్మసంభవః
ప్రపేదే హరిశార్దూలో దక్షిణాదుత్తరాం దిశమ్

హనుమంతుడు దక్షిణదిక్కునుంచి ఉత్తరదిక్కుకి పోవడానికి వాయువులా ఆకాశంలోకి ఎగిరాడు.

తస్య బాహూరువేగం చ నినాదం చ మహాత్మనః
నిశమ్య హరయో హృష్టాః సముత్పేతుస్తతస్తతః

మహాత్ముడైన ఆ హనుమంతుడి బాహువుల వేగం, తొడల వేగం, ధ్వనిని విని వానరులు సంతోషంతో వాళ్ళున్నప్రదేశాల్నించి గంతులువేస్తూ ఎగిరారు.

తమభ్రఘనసంకాశమాపతంతం మహాకపిం
దృష్ట్వా తే వానరాః సర్వే తస్థుః ప్రాంజలయస్తదా

అప్పుడు దట్టమైన మేఘంలా చాలావేగంగా కిందకి వాలుతున్న హనుమంతుణ్ణి చూసి దోసిళ్ళు పట్టి నిల్చున్నారు.

తతస్తు వేగవాంస్తస్య గిరేర్గిరినిభః కపిః
నిపపాత మహేంద్రస్య శిఖరే పాదపాకులే

తర్వాత పర్వతమంత ఉన్న హనుమంతుడు, మహావేగంతో వచ్చి చెట్లతో నిండిన మహేంద్రపర్వతశిఖరం మీద దిగాడు.

హనుమాంస్తు గురూన్ వృద్ధాన్ జాంబవత్ప్రముఖాంస్తదా
కుమారమంగదం చైవ సోఽవందత మహాకపిః
దృష్ట్వా సీతేతి విక్రాంతః సంక్షేపేణ న్యవేదయత్

హనుమంతుడు జాంబవంతుడు మొదలైన పూజ్యులకీ, వృద్ధులకీ, యువరాజు అంగదుడికీ నమస్కారాలు చేశాడు. పరాక్రమవంతుడైన హనుమంతుడు 'సీతని చూశాను' అని సంక్షిప్తంగా చెప్పాడు.

ఉక్తవాక్యం హనూమంతమంగదస్తమథాబ్రవీత్
సర్వేషాం హరివీరాణాం మధ్యే వచనముత్తమమ్

హనుమంతుని మాటలు విన్న తర్వాత, అంగదుడు అందరు వానరవీరుల మధ్య అతనితో గొప్ప మాటలు పలికాడు.

అహో స్వామిని తే భక్తిరహో వీర్యమహో ధృతిః
దిష్ట్యా దృష్టా త్వయా దేవీ రామపత్నీ యశస్వినీ
దిష్ట్యా త్యక్ష్యతి కాకుత్స్థః శోకం సీతావియోగజమ్

"ఏమి నీ ప్రభుభక్తి! ఏమి నీ పరాక్రమం! ఏమి నీ ధైర్యం. మన అదృష్టం కొద్దీ నువ్వు ఆ కీర్తిమంతురాలైన సీతాదేవిని చూసివచ్చావు. ఇంకా అదృష్టం ఏమిటంటే, సీత దగ్గరలేకపోవడం వల్ల రాముడికి కలిగిన దుఃఖాన్ని ఇక విడిచిపెట్టేస్తాడు."

జాంబవాన్కార్యవృత్తాంతమపృచ్ఛదనిలాత్మజమ్

ఏతదాఖ్యాయ తత్సర్వం హనుమాన్ మారుతాత్మజః
భూయః సముపచక్రామ వచనం వక్తుముత్తమమ్

జాంబవంతుడు సీత కోసం వెతకడకోసం బయల్దేరిన తర్వాత ఏం జరిగిందో చెప్పమని హనుమంతుణ్ణి అడిగాడు. హనుమంతుడు జరిగిన విషయమంతా చెప్పి, మళ్ళా తను చెప్పదల్చుకున్నది ఇలా చెప్పాడు.

సఫలో రాఘవోద్యోగః సుగ్రీవస్య చ సంభ్రమః
శీలామాసాద్య సీతాయా మమ చ ప్రవణం మనః

సీతాదేవి పాతివ్రత్యం వల్ల రాముని ప్రయత్నం, సుగ్రీవుడి ఉత్సాహం అన్నీ ఫలితాల్ని ఇవ్వబోతున్నాయి. భక్తితో నా మనస్సు ఆ సీతాదేవి మీద లగ్నమైంది.

ప్రీతిమంతస్తతః సర్వే వాయుపుత్రపురస్సరాః
మహేంద్రాద్రిం పరిత్యజ్య పుప్లువుః ప్లవగర్షభాః
మేరుమందరసంకాశా మత్తా ఇవ మహాగజాః
ఛాదయన్త ఇవాకాశం మహాకాయా మహాబలాః

ఆ తర్వాత, వానరశ్రేష్ఠులంతా వాయుపుత్రుడైన హనుమంతుణ్ణి ముందుంచుకుని మహేంద్రాద్రిని వదిలేసి, సంతోషంగాఎగిరారు. మేరుమందరపర్వతాల్లా, మదించిన ఏనుగుల్లా, పెద్ద దేహాల్తో, మహాబలవంతులైన వాళ్ళంతా అలా ఎగరగానే వాళ్ళు ఆకాశాన్ని కప్పివేస్తున్నట్టు అనిపించింది.

ప్లవమానాః ఖమాప్లుత్య తతస్తే కాననౌకసః
నందనోపమమాసేదుర్వనం ద్రుమలతాయుతమ్
యత్తన్మధువనం నామ సుగ్రీవస్యాభిరక్షితం
అధృష్యం సర్వభూతానాం సర్వభూతమనోహరమ్

అలా ఆ వానరులంతా ఆకాశంలో తేలుతూ ఎగురుతూ, అందరి మనసుల్నీ ఆకర్షించే ఒక వనాన్ని చేరుకున్నారు. అది మంచి చెట్లతోటీ, లతలతోటీ నిండి నందనవనంలా ఉంది. దాన్ని సుగ్రీవుడు రక్షిస్తాడు. దాని పేరు మధువనం. ఏ ప్రాణీ దాన్ని (సుగ్రీవుడి ఆజ్ఞ లేనిదే) ఆక్రమించలేడు.

యద్రక్షతి మహావీర్యః సదా దధిముఖః కపిః
మాతులః కపిముఖ్యస్య సుగ్రీవస్య మహాత్మనః

మహాత్ముడూ, మహావీరుడూ, సుగ్రీవుడి మేనమామా అయిన దధిముఖుడనే వానరుడు ఆ మధువనాన్ని ఎల్లప్పుడూ కాపలా కాస్తుంటాడు.

తానువాచ హరిశ్రేష్ఠో హనుమాన్వానరర్షభః
అవ్యగ్రమనసో యూయం మధు సేవత వానరాః
అహమావారయిష్యామి యుష్మాకం పరిపంథినః

అప్పుడు, వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు వానరులతో "ఓ వానరులారా! మీరే దిగులూ లేకుండా తేనె తాగండి. మధువు సేవించండి. అడ్డొచ్చినవాళ్ళని నేను ఆపుతాను" అన్నాడు.

తే ప్రవిష్టా మధువనం పాలానాక్రమ్య వీర్యతః
పపుః సర్వే మధు తదా రసవత్ఫలమాదదుః

అప్పుడా వానరులంతా మధువనంలోకెళ్ళి వాళ్ళ బలంతో కాపలావాళ్ళని కొట్టి, కట్టిపడేసి, మధువులు తాగేసారు. మంచిమంచి రసాలతో ఉన్న పళ్ళని తిన్నారు.

అథ దృష్ట్వా దధిముఖం క్రుద్ధం వానరపుంగవాః
అభ్యధావంత వేగేన హనుమత్ప్రముఖాస్తదా

అప్పుడు కోపంగా వస్తున్న దధిముఖుణ్ణి చూసి, హనుమంతుడు మొదలైన వానరశ్రేష్ఠులు అతన్ని ఎదిరించడానికి వెళ్ళారు.

తం సవృక్షం మహాబాహుమాపతంతం మహాబలమ్
ఆర్యకం ప్రాహరత్తత్ర బాహుభ్యాం కుపితోఽఙ్గదః

పెద్ద చెట్టు చేత్తో పట్టుకుని వస్తున్న పెద్ద చేతులూ, గొప్పబలమూ ఉన్న తన తండ్రికి మేనమామ అయిన దధిముఖుణ్ణి చూసి, అంగదుడు కోపంతో చేతుల్తో కొట్టాడు.

స తైః ప్రవృద్ధైః పరిభర్త్స్యమానో
వనస్య గోప్తా హరివృద్ధవీరః
చకార భూయో మతిముగ్రతేజా
వనస్య రక్షాం ప్రతి వానరేభ్యః

ఆ తోటకి కాపలాదారూ, ఉగ్రమైన తేజస్సున్నవాడూ, వృద్ధవానరవీరుడూ అయిన దధిముఖుడు మితిమీరి ప్రవర్తిస్తున్న ఆ వానరులు భయపెడుతూంటే, వాళ్ల ఆగడాల్నించి తోటని రక్షించడానికి మరో ఆలోచన చేశాడు.

నిమేషాంతరమాత్రేణ స హి ప్రాప్తో వనాలయః
సహస్రాంశుసుతో ధీమాన్ సుగ్రీవో యత్ర వానరః

ఆ వానరుడు రెండుసార్లు కళ్ళు మూసితెరిచేంత సమయంలోగా బుద్ధిమంతుడూ, సూర్యుని కొడుకూ అయిన సుగ్రీవుడి దగ్గరకి చేరుకున్నాడు.

సుగ్రీవస్య శుభౌ మూర్ధ్నా చరణౌ పర్యపీడయత్
ఉత్థాయ సుమహాప్రాజ్ఞో వాక్యం దధిముఖోఽబ్రవీత్

సుగ్రీవుడి మంగళకరమైన పాదాలకి తన తల తగిలించాడు. సుగ్రీవుడిచే లేపబడిన ప్రాజ్ఞుడైన దధిముఖుడు సుగ్రీవుడితో ఇలా అన్నాడు.

నైవర్క్షరజసా రాజన్న త్వయా నాపి వాలినా
వనం నిసృష్టపూర్వం హి భక్షితం తచ్చ వానరైః

" రాజా! మధువనాన్ని నీ తండ్రి ఋక్షరజస్సుగాని, వాలిగాని, నువ్వుగాని స్వేచ్ఛగా అనుభవించడానికోసం, దాన్ని ఎవ్వరికీ ఇవ్వలేదు. అలాంటి మధువనాన్ని ఈ వానరులంతా భక్షించేసారు.

వనపాలం పునర్వాక్యం సుగ్రీవః ప్రత్యభాషత
వనం యదాభిపన్నాస్తే సాధితం కర్మ వానరైః
దృష్టా దేవీ న సందేహో న చాన్యేన హనూమతా
న చాప్యదృష్ట్వా వైదేహీం విశ్రుతాః పురుషర్షభ
వనం దత్తవరం దివ్యం ధర్షయేయుర్వనౌకసః

ఆ వనరక్షణచేసే దధిముఖుడితో సుగ్రీవుడు తిరిగి ఇలా అన్నాడు. ఓ పురుష శ్రేష్ఠుడా! నా అనుమతి లేకుండా వనంలోకి ప్రవేశించారంటే వాళ్ళు సందేహం లేకుండా సీతని చూసి వచ్చి ఉంటారు. వాళ్ళు అలా సీతని చూసి రాకపోతే, వరంగా ఇవ్వబడ్డ దివ్యమైన మధువనాన్ని ఆక్రమించరు.

తతః కిలకిలాశబ్దం శుశ్రావాసన్నమంబరే
హనుమత్కర్మదృప్తానాం నర్దతాం కాననౌకసామ్
కిష్కింధాముపయాతానాం సిద్ధిం కథయతామివ

ఇంతలో హనుమంతుడు సాధించిన కార్యం వల్ల గర్వంతో శబ్దాలు చేస్తూ, వాళ్ళ విజయాన్ని చాటిచెపుతున్నట్టుగా, ఆ వానరులంతా కిష్కింధానగరాన్ని చేరుతూండగానే వాళ్ళ కిలకిలాశబ్దాలు ఆకాశంలో దగ్గరగా వినబడ్డాయి.

తేఽఙ్గదప్రముఖా వీరాః ప్రహృష్టాశ్చ ముదాన్వితాః
నిపేతుర్హరిరాజస్య సమీపే రాఘవస్య చ

అంగదుడు మొదలైన ఆ వీరులంతా సంతోషిస్తూ ఆనందంతో రామసుగ్రీవుల ముందర దిగారు.

హనూమాంశ్చ మహాబాహుః ప్రణమ్య శిరసా తతః
నియతామక్షతాం దేవీం రాఘవాయ న్యవేదయత్

అప్పుడు గొప్ప బాహువులున్న హనుమంతుడు తల వంచి నమస్కారం చేసి, సీతాదేవి పతివ్రతానియమాల్ని కాపాడుకుంటూ, ఆరోగ్యంగా ఉన్నట్టు రాముడికి తెలిపాడు.

దృష్టా దేవీతి హనుమద్వదనాదమృతోపమమ్
ఆకర్ణ్య వచనం రామో హర్షమాప సలక్ష్మణః
ప్రీత్యా చ పరయోపేతో రాఘవః పరవీరహా
బహుమానేన మహతా హనుమంతమవైక్షత.

"సీతాదేవి కనబడింది" అని హనుమంతుడి నోటినుంచి వచ్చిన అమృతంలాంటి మాటని విని లక్ష్మణుడితో సహా ఉన్న రాముడు చాలా సంతోషపడ్డాడు. ఆ మహదానందంలో హనుమంతుణ్ణి అధికమైన గౌరవభావంతో చూశాడు.

ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై తాం దిశం ప్రతి
ఉవాచ వాక్యం వాక్యజ్ఞః సీతాయా దర్శనం యథా

మాట్లాడ్డంలో నేర్పరైన హనుమంతుడు, సీత ఉన్న దిక్కువైపుకి తిరిగి, ఆమెకి తలవంచి నమస్కారం చేసి, సీతని తనెలా చూశాడో చెప్పాడు.

ఏవం మయా మహాభాగా దృష్టా జనకనందినీ
ఉగ్రేణ తపసా యుక్తా త్వద్భక్త్యా పురుషర్షభ
అభిజ్ఞానం చ మే దత్తం యథా వృత్తం తవాన్తికే
చిత్రకూటే మహాప్రాజ్ఞ వాయసం ప్రతి రాఘవ

“ఓ పురుషోత్తమా! నీ మీద గొప్ప భక్తితో తీవ్రంగా తపస్సు చేస్తోంది. మహాభాగ్యవంతురాలైన సీతని ఇలాంటి స్థితిలో నేను చూశాను. ఓ రాఘవా! చిత్రకూటంలో నువ్వు దగ్గరున్నప్పుడు ఒక కాకి విషయంలో ఏం జరిగిందో దాన్ని గుర్తుగా చెప్పింది”

తౌ జాతాశ్వాసౌ రాజపుత్రౌ విదిత్వా
తచ్చాభిజ్ఞానం రాఘవాయ ప్రదాయ
దేవ్యా చాఖ్యాతం సర్వమేవానుపూర్వ్యా
ద్వాచా సంపూర్ణం వాయుపుత్రః శశంస

ఆ హనుమంతుడు రామలక్ష్మణులకి తను చెప్పినది విన్నాక ఊరటకలిగిందని గుర్తించి, ఆనవాలుగా తెచ్చిన చూడామణిని రాముడికి ఇచ్చి, సీతాదేవి యొక్క సందేశాన్ని పూర్తిగా, ఆమె చెప్పిన వరస తప్పకుండా చెప్పాడు.

తం తు దృష్ట్వా మణిశ్రేష్ఠం రాఘవః శోకకర్శితః
నేత్రాభ్యామశ్రుపూర్ణాభ్యాం సుగ్రీవమిదమబ్రవీత్

శ్రేష్ఠమైన ఆ మణిని చూడగానే రాముడు దుఃఖంతో బాధపడుతూ, కన్నీళ్ళు కారుస్తూ సుగ్రీవుడితో ఇలా అన్నాడు.

మణిరత్నమిదం దత్తం వైదేహ్యాః శ్వశురేణ మే
వధూకాలే యథాబద్ధమధికం మూర్ధ్నిశోభతే

మా పెళ్ళిలో పెళ్ళికూతురి తలమీద కట్టుగా ఎక్కువగా శోభించాలని ఈ మణిని సీతకి నా మామగారు ఇచ్చారు.

ఇమం దృష్ట్వా మణిశ్రేష్ఠం యథా తాతస్య దర్శనమ్
అద్యాస్మ్యవగతః సౌమ్య వైదేహస్య తథా విభోః

ఓ సౌమ్యుడైన సుగ్రీవా! ఈ శ్రేష్ఠమైన మణిని చూడగానే నా తండ్రినీ, పూజ్యుడైన జనకమహారాజునీ చూసినట్టుంది.

కిమాహ సీతా హనుమంస్తత్త్వతః కథయాద్య మే
ఏతేన ఖలు జీవిష్యే భేషజేనాతురో యథా

హనుమాన్! సీత ఇంకా ఏమన్నదో యథార్థంగా చెప్పు. రోగి మందు తీసుకోవడం వల్ల బ్రతికినట్టుగా, సీతని గురించిన మాటలు విని నేను జీవిస్తాను.

ఏవముక్తస్తు హనుమాన్ రాఘవేణ మహాత్మనా

సీతాయా భాషితం సర్వం న్యవేదయత రాఘవే

మహాత్ముడైన రాముడి మాటలు విన్న హనుమంతుడు సీత చెప్పిన విషయాలన్నీ రాముడికి చెప్పాడు.

శక్తౌ తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ

సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మాముపేక్షతః

'వాయువుతో, అగ్నితో సమానమైన తేజస్సున్న పురుషశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులను దేవతలుకూడా ఎదిరించలేరు. అంతవాళ్ళైయుండి కూడా వాళ్ళు నన్ను పట్టించుకోకుండా ఉన్నారెందుకు?'

జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ

ఊర్ధ్వం మాసాన్నజీవేయం రక్షసాం వశమాగతా

'ఓ దశరథకుమారా! ఒక్క నెలరోజులు మాత్రమే జీవిస్తాను. ఈ రాక్షసులవశంలో ఉన్న నేను ఒక్క మాసం దాటి జీవించలేను. '

వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రు భాషితమ్

పునరప్యహమార్యాం తామిదం వచనమబ్రువమ్

"కన్నీళ్ళతో దీనమైన మాట్లాడే సీతాదేవి మాటలు విని, నేను పూజ్యురాలైన ఆమెతో ఇలా అన్నాను.

హత్వా చ సమరే రౌద్రం రావణం సహ బాంధవమ్

రాఘవస్త్వాం వరారోహే స్వాం పురీం నయతే ధ్రువమ్

ఓ దేవీ! రాముడు భయంకరుడైన రావణుణ్ణి అతని బంధువుల్ని యుద్ధంలో చంపి నిన్ను తప్పకుండా అయోధ్యకు తీసుకెళతాడు.

గమనే చ కృతోత్సాహమవేక్ష్య వరవర్ణినీ

వివర్ధమానం చ హి మాముపాచ జనకాత్మజా

తిరిగివచ్చే ఉత్సాహంతో శరీరాన్ని పెంచుతూంటే నన్ను చూసి, మంచి దేహచ్ఛాయగల ఆ జానకి ఇలా అంది.

హనుమన్ సింహసంకాశావుభౌ తౌ రామలక్ష్మణౌ

సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్బ్రూయా హ్యానామయమ్

ఓ హనుమంతా! సింహాల్తో సమానమైన రామలక్ష్మణులిద్దర్నీ, మంత్రుల్తో కలిపి సుగ్రీవుణ్ణీ అందర్నీ కూడా క్షేమమడిగానని చెప్పు".

తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్

నిశమ్యాహం తతః శేషం వాక్యముత్తరమబ్రవమ్

మంచి అర్థంతో, వినయంతో, యుక్తిగా చెప్పిన ఆ మాటలు విని దానికి సమాధానం ఇలా చెప్పాను.

నివృత్తవనవాసం చ త్వయా సార్థమరిందమమ్

అభిషిక్తమయోధ్యాయాం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్

శత్రుసంహారకుడైన రాముడు వనవాసాన్ని పూర్తి చేసుకుని అయోధ్యానగరంలో నీతో సహా రాజ్యాభిషిక్తుడవడాన్ని నువ్వు చూస్తావు.

తతో మయా వాగ్భిరదీనభాషిణా

శివాభిరిష్టాభిరభిప్రసాదితా

జగామ శాంతిం మమ మైథిలాత్మజా

తవాపి శోకేన తదాభిపీడితా

రామా! నువ్వు శోకంతో ఉన్నావని వినడం చేత కూడా సీత ఎక్కువ దుఃఖిస్తోంది. అలా ఉన్న ఆమెని నేను దైన్యం లేకుండా మాట్లాడుతూ, ఆమెకి ఇష్టమయిన, మంగళాన్నిచ్చే, మాటల్తో ఓదారుస్తూంటే ఆమె మనశ్శాంతిని పొందింది.

ఇతి శ్రీమద్వాల్మీకీయే రామాయణే

సుందరకాండాంతర్గతలఘుపాఠః

సుందరకాండ లఘుపాఠం సమాప్తం

పారాయణాంతంలో చదివే శ్లోకాలు

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః
మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే
చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్
వేదవేదాంతవేద్యాయ మేఘశ్యామలమూర్తయే
పుంసాం మోహనరూపాయ పుణ్యశ్లోకాయ మంగళమ్
మంగళాశాసనపరై ర్మదాచార్యపురోగమైః
సర్వైశ్చ పూర్వైరాచార్యై స్సత్కృతాయాऽస్తు మంగళమ్

కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్
కరోమి యద్యత్ సకలం పరస్మై
శ్రీరాఘవాయేతి సమర్పయామి.

యదక్షర పదభ్రష్టం మాత్రాహీనం తు యద్భవేత్
తత్సర్వం క్షమ్యతాం దేవ శ్రీరాఘవ నమోఽస్తుతే

సర్వం నారాయణార్పణమస్తు. హరిః ఓమ్



ఆదిత్యహృదయమ్

ఆదిత్యహృదయమ్

తతోయుద్ధపరిశ్రాన్తం సమరే చింతయా స్థితమ్

రావణం చాగ్రతో దృష్ట్వా యుద్ధాయ సముపస్థితమ్

దైవతైశ్చ సమాగమ్య ద్రష్టుమభ్యాగతో రణమ్

ఉపాగమ్యాబ్రవీద్రామమగస్త్యో భగవాన్ ఋషిః

రాముడు యుద్ధం చేసి అలిసిపోయాడు. ఎదురుగా యుద్ధం చెయ్యడానికి వచ్చిన రావణుణ్ణి చూసి యుద్ధరంగంలో ఆలోచిస్తూ ఉన్నాడు. అప్పుడు ఆ యుద్ధం చూడ్డానికి దేవతలతో కలసి వచ్చిన భగవత్ స్వరూపమైన అగస్త్యమహర్షి రాముడి దగ్గరకి వచ్చి ఇలా అన్నాడు.

రామ రామ మహాబాహో శృణు గుహ్యం సనాతనమ్

యేన సర్వానరీన్వత్స సమరే విజయిష్యసే

గొప్ప బాహుబలం గలిగిన నాయనా! రామా! దేనిచేత యుద్ధంలో అందరు శత్రువుల్నీ జయించగలవో అట్టి నిత్యమైన రహస్యాన్ని విను.

ఆదిత్యహృదయం పుణ్యం సర్వశత్రువినాశనమ్

జయావహం జపేన్నిత్యమక్షయ్యం పరమం శివమ్

సర్వమంగలమంగల్యం సర్వపాపప్రణాశనమ్

చింతాశోకప్రశమనమాయుర్వర్ధనముత్తమమ్

పుణ్యప్రదమైన ఆదిత్యహృదయమనే ఈ స్తోత్రం సకలశత్రువుల్నీ నశింపజేసేది. జయాన్నిస్తుంది. ఎప్పుడూ తగ్గని ఫలాన్నిస్తుంది. పవిత్రమైనది. మంగళాన్ని కలగజేసే అన్ని స్తోత్రాల్లోకీ ఇది అతి మంగళకరమైనది. సకలపాపాల్నీ తొలగిస్తుంది. చింతనీ, దుఃఖాన్నీ పోగొడుతుంది. ఆయుస్సును పెంచే ఉత్తమమైన సాధనం. ఈ ఆదిత్యహృదయాన్ని(సూర్యుని హృదయంలో ఉన్న బ్రహ్మను గూర్చి తెలిపేది) నిత్యమూ జపించాలి.

రశ్మిమంతం సముద్యంతం దేవాసురనమస్కృతమ్

పూజయస్వ వివస్వంతం భాస్కరం భువనేశ్వరమ్

సూర్యుడు ప్రశస్తములైన కిరణాలు కలవాడు. (ఉదయపర్వతం వెనుకనుండి) ఉదయించేవాడు. దేవతలచేత, రాక్షసులచేత కూడా నమస్కరించబడ్డవాడు. కాంతినిచ్చేవాడు. ఇతరములైన కాంతుల్ని/తేజస్సుల్ని కప్పివేసేవాడు. లోకములన్నిటినీ నియమించేవాడు. అలాంటి సూర్యుణ్ణి పూజించు.

సర్వదేవాత్మకో హ్యేష తేజస్వీ రశ్మిభావనః

ఏష దేవాసురగణాన్ లోకాన్ పాతి గభస్తిభిః

ఇతడు సకల దేవతాస్వరూపుడు. గొప్ప తేజస్సు కలవాడు. తన కిరణాల చేత లోకాల్ని రక్షించేవాడు. తన కిరణాల చేత దేవతల్నీ, రాక్షసుల్నీ, లోకంలో ఉన్న జనాన్నీ రక్షిస్తాడు.

ఏష బ్రహ్మా చ విష్ణుశ్చ శివః స్కందః ప్రజాపతిః

మహేంద్రో ధనదః కాలో యమః సోమో హ్యపాంపతిః

ఈ సూర్యుడే బ్రహ్మదేవుడు; విష్ణువు; కుమారస్వామి; తొమ్మిదిమంది ప్రజాపతులు; మహేంద్రుడు; కుబేరుడు; కాలము; యముడు; చంద్రుడు; నీటికి దేవతైన వరుణుడు.

పితరో వసవః సాధ్యా అశ్వినౌ మరుతో మనుః

వాయుర్వహ్నిః ప్రజాః ప్రాణ ఋతుకర్తా ప్రభాకరః

ఈ సూర్యుడే పితృదేవతలు; ఎనిమిదిమంది వసువులు; సాధ్యులు; అశ్వినీదేవతలు; నలభైతొమ్మిదిమంది మరుత్తులు; మనువు; వాయువు; అగ్ని; ప్రజలు; ప్రాణవాయువు; ఋతువుల్ని నిర్మించేవాడు; కాంతిని ఇచ్చేవాడు.

ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్

సువర్ణసదృశో భానుర్హిరణ్యరేతా దివాకరః

అదితి కుమారుడు. అఖండమైన భూమికి అధిపతి. జగత్తుని సృష్టించేవాడు. జనుల్ని కర్మలు చేసేవాళ్ళుగా ప్రేరేపించేవాడు. ఆకాశంలో తిరిగేవాడు; జగత్తుని వర్షంచేత పోషించేవాడు. కిరణాలున్నవాడు. బంగారపు రంగు గలవాడు. ప్రకాశవంతమైనవాడు. బంగారము రేతస్సుగా గలవాడు. పగళ్లను చేయువాడు.

హరిదశ్వః సహస్రార్చిః సప్తసప్తిర్మరీచిమాన్

తిమిరోన్మథనః శంభుస్త్వష్టా మార్తాండకోఽంశుమాన్

ఆకుపచ్చని గుర్రములు కలవాడు. వేలకిరణాలు కలవాడు. ఏడు గుర్రాలున్న వాడు. కిరణములున్నవాడు కావున చీకటిని నశింపజేసేవాడు. సుఖానికి మూలకారణమైనవాడు. అన్ని రూపాల్ని సంహరించేవాడు. బ్రహ్మాండం నశించిన తర్వాత మళ్ళీ అది సృష్టించడాని కోసం పుట్టినవాడు.

హిరణ్యగర్భః శిశిరస్తపనోఽహస్కరో రవిః

అగ్నిగర్భోఽదితేః పుత్రః శంఖః శిశిరనాశనః

సూర్యుడు బ్రహ్మవిష్ణురుద్రస్వరూపుడు. చల్లనివాడు, వేడిని కలిగించేవాడు. పగటిని తయారుచేయువాడు. స్తుతింపబడువాడు. గర్భంలో అగ్నికలవాడు. అదితికి కొడుకు. సాయంకాల సమయమున శాంతించేవాడు. మంచును కరిగించేవాడు.

వ్యోమనాథస్తమోభేదీ ఋగ్యజుఃసామపారగః

ఘనవృష్టిరపాం మిత్రో వింధ్యవీథీప్లవంగమః

ఆకాశానికి ప్రభువు. రాహువును చీల్చినవాడు. ఋగ్వేద, యజుర్వేద, సామవేదాల ఒడ్డును చూచినవాడు (సంపూర్ణంగా తెలిసినవాడు). అధికంగా వర్షాన్నిచ్చేవాడు. నీటికి మిత్రుడు. ఆకాశంలో వేగంగా సంచరించేవాడు.

ఆతపీ మండలీ మృత్యుః పింగలః సర్వతాపనః

కవిర్విశ్వో మహాతేజా రక్తః సర్వభవోద్భవః

సూర్యుడు ఎండని ఇచ్చేవాడు. గుండ్రని మండలము గలవాడు. శత్రువులకు మృత్యువు. ఎర్రనివాడు. అన్నింటినీ వేడెక్కించేవాడు. పండితుడు. ప్రపంచాన్ని నడిపేవాడు. గొప్పతేజంతో ఉన్నవాడు. అందరిపట్ల అనురాగం కలవాడు. అన్ని జీవులకీ ఉత్పత్తి స్థానమైనవాడు.

నక్షత్రగ్రహతారాణామధిపో విశ్వభావనః

తేజసామపి తేజస్వీ ద్వాదశాత్మన్నమోఽస్తు తే

సూర్యుడు, అశ్వని, భరణి, కృత్తిక మొదలైన 26 నక్షత్రాలకీ, నవగ్రహాలకీ, తారలకీ అధిపతి. జగత్తుకు స్థాపకుడు. అగ్ని మొదలైన తేజస్సులలో అధికమైన తేజస్సు కలవాడు. పన్నెండు రూపములు కలవాడా! నీకు నమస్కారము.

నమః పూర్వాయ గిరయే పశ్చిమాయాద్రయే నమః

జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః

తూర్పుదిశలో పర్వతం రూపంలో ఉన్న సూర్యుడికి నమస్కారము. పడమటి దిశలో పర్వతం రూపంలో ఉన్న సూర్యుడికి నమస్కారము. జ్యోతిర్గణాల అధిపతికీ, దినాధిపతికీ నమస్కారము.

జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమో నమః

నమో నమః సహస్రాంశో ఆదిత్యాయ నమో నమః

ఉపాసన చేసేవాళ్ళకి విజయాన్నీ, ఉన్నతినీ, క్షేమాన్నీ ఇచ్చేవాడికి, ఆకుపచ్చని గుర్రములు కలవాడు అయిన ఆదిత్యునికి నమస్కారము, వేలకిరణములు కలవాడా! నమస్కారము.

నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమో నమః

నమః పద్మప్రబోధాయ ప్రచండాయ నమోఽస్తుతే

శత్రువులపట్ల ఉగ్రంగా ఉండేవానికి నమస్కారము. వీరునికి నమస్కారము. వేగముగా ప్రయాణించువానికి నమస్కారము. తామరపువ్వులని వికసింపజేసేవానికి నమస్కారము. తీక్ష్ణమైన సూర్యభగవానుడా! నీకు నమస్కారము.

బ్రహ్మేశానాచ్యుతేశాయ సూర్యాయాదిత్యవర్చసే

భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయ వపుషే నమః

అన్నింటినీ (దుష్టశక్తుల్ని) నాశనంచేసేవానికి, రౌద్రరూపం గలవానికి, బ్రహ్మవిష్ణుశివాత్మలు గలవానికి, ఆదిత్యరూపమైన తేజస్సు గలవానికి, , కాంతివంతమైన సూర్యునికి నమస్కారము.

తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయామితాత్మనే

కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయే నమః

చీకటినీ, మంచునీ, శత్రువుల్నీ, కృతజ్ఞతలేనివాళ్ళనీ నశింపజేసేవానికి, ఇంత అని చెప్పడానికి వీల్లేనంత స్వరూపం కలవానికి, ప్రకాశించువానికి, తేజస్సులన్నిటికీ రాజు అయిన సూర్యునికి నమస్కారము.

తప్తచామీకరాభాయ హరయే విశ్వకర్మణే

నమస్తమోభినిఘ్నాయ రుచయే లోకసాక్షిణే

కరిగించిన బంగారపు మెరుపుకలవానికి, అజ్ఞానాన్ని హరించేవానికి, విశ్వాన్ని సృష్టించినవానికి, చీకట్లు పారద్రోలేవానికి, కాంతిస్వరూపానికి, లోకుల పుణ్యపాపాలకి సాక్షి అయినవానికి నమస్కారము.

నాశయత్యేష వై భూతం తదేవ సృజతి ప్రభుః

పాయత్యేష తపత్యేష వర్షత్యేష గభస్తిభిః

ప్రభువైన ఇతడే ప్రళయకాలంలో జగత్తుని నశింపజేస్తాడు. దాన్ని మళ్ళీ పుట్టిస్తాడు. ఇతడు తన కిరణాల్తో ఎండిపోయేలాచేస్తాడు, కాలుస్తాడు. వర్షం కురిపిస్తాడు.

ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః

ఏష చైవాగ్నిహోత్రం చ ఫలం చైవాగ్నిహోత్రిణామ్

ఇతడు జగత్తులో ఉన్న ప్రాణులు నిద్రపోతున్నప్పుడు, వాటిలో అంతరాత్మ రూపంలో ఉండి మెలకువగా ఉంటాడు (ఉంచుతాడు). ఇతడే అగ్నిహోత్రము. అగ్నిహోత్రం చేసేవాళ్ళకి అందే ఫలం కూడా ఇతడే.

దేవాశ్చ క్రతవశ్చైవ క్రతూనాం ఫలమేవ చ,
యాని కృత్యాని లోకేషు సర్వేషు పరమప్రభుః

దేవతలు, యజ్ఞాలు, యజ్ఞాల వల్ల వచ్చే ఫలం అన్నీ ఈ సూర్యుడే. లోకంలో చేసే అన్నిపనుల విషయంలోనూ మిక్కిలి సమర్థుడు.

ఏనమాపత్సు కృచ్ఛ్రేషు కాంతారేషు భయేషు చ
కీర్తయన్ పురుషః కశ్చిన్నావసీదతి రాఘవ

రామా! ఆపదల్లోను, ప్రయాణించడం కష్టమైన మార్గాల్లోను, భయం కలిగించే విషయాల్లోను ఈ ఆదిత్యుణ్ణి కీర్తించే ఏ మానవుడికీ నాశనం లేదు.

పూజయస్వైనమేకాగ్రో దేవదేవం జగత్పతిమ్
ఏతత్త్రిగుణితం జప్త్వా యుద్ధేషు విజయిష్యసి

జగత్తుకు భర్త అయిన ఈ దేవదేవుణ్ణి ఏకాగ్రచిత్తంతో పూజించు. ఈ ఆదిత్యహృదయాన్ని మూడుసార్లు జపిస్తే యుద్ధంలో జయాన్ని పొందుతావు.

అస్మిన్ క్షణే మహాబాహో రావణం త్వం వధిష్యసి,

ఏవముక్త్వా తతోఽగస్త్యో జగామ స యథాగతమ్

ఓ మహాబాహూ! నువ్వు ఈ క్షణంలోనే రావణుణ్ణి చంపగలవు. అగస్త్యుడు ఇలా చెప్పి వచ్చిన విధంగానే మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయాడు.

ఏతచ్ఛ్రుత్వా మహాతేజా నష్టశోకోఽభవత్తదా

ధారయామాస సుప్రీతో రాఘవః ప్రయతాత్మవాన్

అది విన్న మహాతేజస్వి అయిన రాముడు, తన విచారాన్ని విడిచిపెట్టాడు. చాలా సంతోషించి నిశ్చలమైన మనస్సుతో ఆదిత్యహృదయాన్ని ధారణ చేసాడు.

ఆదిత్యం ప్రేక్ష్య జప్త్వా తు పరం హర్షమవాప్తవాన్

త్రిరాచమ్య శుచిర్భూత్వా ధనురాదాయ వీర్యవాన్

రావణం ప్రేక్ష్య హృష్టాత్మా యుద్ధాయ సముపాగమత్

సర్వయత్నేన మహతా వధే తస్య ధృతోఽభవత్

పరాక్రమవంతుడైన ఆ రాముడు మూడుసార్లు ఆచమనం చేసి పవిత్రుడై, సూర్యుణ్ణి చూసి, ఆదిత్యహృదయాన్ని జపించి, గొప్ప ఉత్సాహాన్ని పొందాడు. విల్లుని చేత్తో పట్టుకుని, సంతోషం నిండిన మనస్సు కలవాడై, రావణుణ్ణి చూసి యుద్ధానికి వచ్చాడు. తన శాయశక్తులా ప్రయత్నించి అతన్ని చంపాలని నిశ్చయించుకున్నాడు.

అథ రవిరవదన్నిరీక్ష్య రామం

ముదితమనాః పరమం ప్రహృష్యమాణః

నిశిచరపతిసంక్షయం విదిత్వా

సురగణమధ్యగతో వచస్త్వరేతి

అప్పుడు సంతోషించిన మనస్సుకలవాడైన సూర్యుడు, రోమాంచము కలిగిన శరీరంతో దేవతాగణం మధ్యలో నిలబడి, రావణుడు (రాముడి చేతిలో) మరణించబోతున్నాడని తెలుసుకుని, రాముణ్ణి చూసి "త్వరపడు" అన్నాడు.

ఇత్యార్షే వాల్మీకీయే శ్రీమద్రామాయణే ఆదికావ్యే యుద్ధకాండే

పంచోత్తరశతతమః సర్గః



సంక్షేప రామాయణమ్

సంక్షేపరామాయణమ్

తపఃస్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్

నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్

తపశ్శాలి అయిన వాల్మీకి, తపస్సునీ, వేదాలను అధ్యయనాన్నీ చేయడంలో ఆసక్తి ఉన్నవాడూ, వాక్కును బాగా తెలిసిన వాళ్ళలో శ్రేష్ఠుడూ, మునులలో గొప్పవాడూ అయిన నారదుణ్ణి అడిగాడు.

కోన్వస్మిన్సామ్ప్రతం లోకే గుణవాన్కశ్చ వీర్యవాన్

ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః

ఇప్పుడు భూలోకంలో మంచి గుణాలున్నవాడూ, గొప్ప పరాక్రమం ఉన్నవాడూ, ధర్మం తెలిసినవాడూ, ఇతరులనుంచి పొందిన చిన్న ఉపకారాన్ని కూడా గుర్తుంచుకునే లక్షణం (కృతజ్ఞత) కలవాడూ, సత్యమే పలికేవాడు, చెదరని, గట్టి సంకల్పం కలవాడూ అయిన గొప్ప పురుషుడెవరున్నాడు?

చారిత్రేణ చ కో యుక్తః సర్వభూతేషు కో హితః

విద్వాన్ కః కః సమర్థశ్చ కశ్చైక ప్రియదర్శనః

మంచి నడవడి కలవాడూ, అన్ని ప్రాణలకీ హితాన్ని చేసేవాడూ, విద్వాంసుడూ, అసాధ్యాలయిన పనుల్ని సాధించేవాడూ, చూసేవాళ్ళకి ఎప్పుడూ ఒకే విధంగా ఆనందం కలిగించేవాడూ అయిన మహాపురుషుడెవడు?

ఆత్మవాన్ కో జితక్రోధో మతిమాన్ కోఽనసూయకః
కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే

ధైర్యం కలవాడూ, కోపాన్ని జయించినవాడూ ఎవడు? మంచి తేజస్సుగలవాడూ, అసూయ లేనివాడూ ఎవడు? ఎవడికి కోపం వస్తే, యుద్ధంలో దేవతలుకూడా భయపడతారు? (అలాంటి వాడున్నాడా?)

ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం పరం కౌతూహలం హి మే
మహర్షే త్వం సమర్థోఽసి జ్ఞాతుమేవంవిధం నరమ్

అటువంటి వాడెవడైనా ఉంటే ఆ విషయాన్ని నేను వినాలని కోరుతున్నా. తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉంది. ఓ మహర్షీ! అటువంటి గుణాలున్న మనుష్యుణ్ణి గురించి తెలియడానికి నీకు (నీకే) అవకాశం ఉంది.

శ్రుత్వా చైతత్త్రిలోకజ్ఞో వాల్మీకేర్నారదో వచః
శ్రూయతామితి చామంత్ర్య ప్రహృష్టో వాక్యమబ్రవీత్

మూడులోకాల్లో జరిగే విషయాలన్నీ తెలిసిన నారదుడు, వాల్మీకి మాటను (ప్రశ్నను)విని, సంతోషపడి "చెప్తాను విను" అని, ఇలా చెప్పాడు.

బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీర్తితా గుణాః

మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యుక్తః శ్రూయతాం నరః

ఓ మునీ! నువ్వు అడిగిన (వర్ణించిన) ఈ గుణాలు అనేక విధాలుగా గొప్పవైనవి. సాధారణ మానవుల్లో కనుపించనివి (దొరకనివి). అలాంటి గుణాలన్నీ ఉన్న మహాపురుషుణ్ణి నిశ్చయించి చెప్తాను విను.

ఇక్ష్వాకువంశప్రభవో రామో నామ జనైః శ్రుతః

నియతాత్మా మహావీర్యో ద్యుతిమాన్ ధృతిమాన్ వశీ

ఇక్ష్వాకువంశంలో పుట్టిన రాముణ్ణి గురించి జనమంతా వినే ఉంటారు. అతడు నిశ్చితమైన స్వభావం ఉన్నవాడు. గొప్ప పరాక్రమం, ధైర్యం, వర్చస్సు (తేజస్సు) ఉన్నవాడు. ఇంద్రియాల్ని అదుపులో పెట్టుకున్నవాడు.

బుద్ధిమాన్ నీతిమాన్ వాగ్మీ శ్రీమాన్ శత్రునిబర్హణః

విపులాంసో మహాబాహుః కంబుగ్రీవో మహాహనుః

ఆ రాముడు బుద్ధి, నీతి, అన్ని శాస్త్రాల్లోనూ మంచి పాండిత్యం కలవాడు. ఐశ్వర్యమున్నవాడు. శత్రువుల్ని నశింపజేసేవాడు. అతని మూపులు ఎత్తుగా

ఉంటాయి. భుజాలు బలిసి ఉంటాయి. కంఠం శంఖంలా ఉంటుంది. అతని దవడ పైభాగం ఎత్తుగా ఉంటుంది.

మహోరస్కో మహేష్వాసో గూఢజత్రురరిందమః
ఆజానుబాహుః సుశిరాః సులలాటః సువిక్రమః

అతని ఛాతీ చాలా విశాలంగా ఉంటుంది. అతని ధనుస్సు (విల్లు) గొప్పది. అతని మూపుమీద ఎముకలేవీ కనబడవు (కండబట్టి ఉంటాడు). శత్రువుల్నీ, కామం, క్రోధం మొదలైన వాటినీ పోగొట్టేవాడు. మోకాళ్ళ దాకా ఉన్న పొడుగైన చేతులున్నవాడు. మంచి లక్షణాలున్న తల (శిరస్సు), శుభలక్షణాలున్న నుదురు కలిగి ఉన్నవాడు. ఆ రాముని నడక ఎంతో అందంగా ఉంటుంది.

సమః సమవిభక్తాంగః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్
పీనవక్షా విశాలాక్షో లక్ష్మీవాన్ శుభలక్షణః

అతని శరీరం సరిగ్గా ఉండవలసినంత ఉంటుంది (పొడుగూ కాదు, పొట్టీకాదు). అన్ని అవయవాలూ సరిగ్గా ఉండవలసిన ప్రమాణంలో విభజించబడి ఉంటాయి. శరీరపు చాయ చక్కగా ఉంటుంది. అతని పరాక్రమం అద్భుతం. అతని ఛాతీ బలిసి ఉంటుంది. కళ్ళు విశాలంగా ఉంటాయి. అవయవాల శోభ మెచ్చుకోదగ్గట్టుగా ఉంటుంది. సాముద్రిక శాస్త్రంలో చెప్పిన మంచి లక్షణాలన్నీ అతని శరీరంలో ఉన్నాయి.

ధర్మజ్ఞః సత్యసంధశ్చ ప్రజానాం చ హితే రతః
యశస్వీ జ్ఞానసంపన్నః శుచిర్వశ్యః సమాధిమాన్

రాముడు ధర్మం తెలిసినవాడు. సత్యమైన మార్గంలోనే నడవాలనే నిర్ణయం తీసుకున్నవాడు. (శరణుకోరినవాణ్ణి రక్షించడం, చేసిన ప్రతిజ్ఞని నిలబెట్టుకోవడం లాంటివి చెయ్యడం). ప్రజలకి మంచి చేయడంపట్ల (ధర్మం ఒప్పుకున్నదాన్నే) ఎక్కువ ఆసక్తి చూపించేవాడు. గొప్ప కీర్తి పొందినవాడు. అన్ని విషయాలూ తెలిసినవాడు. నిజాయతీ కలవాడు. పెద్దలు చెప్పినట్టు వినేవాడు. తనని నమ్ముకున్నవాళ్ళకి వశమైనవాడు (తనని నమ్ముకున్నవాళ్ళకి రక్షణ కల్పించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాడు).

ప్రజాపతిసమః శ్రీమాన్ ధాతా రిపునిషూదనః
రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా

ఆ శ్రీ రాముడు బ్రహ్మదేవుడితో సమానమైనవాడు. అద్భుతమైన వైభవం ఉన్నవాడు.అందరికన్న మిన్న. ప్రపంచాన్ని పోషించేవాడు. శత్రువులని సంహరించేవాడు. లోకంలో ఉన్న జీవులన్నిటినీ రక్షించేవాడు. ధర్మాన్ని పరిరక్షించేవాడు.

రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా
వేదవేదాంగతత్త్వజ్ఞో ధనుర్వేదే చ నిష్ఠితః

తన ధర్మమైన క్షత్రియధర్మాన్ని రక్షించేవాడు. తనవారందరినీ రక్షించేవాడు. వేదము, వేదాంగాలైన శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం మొదలైన

విద్యల్లో ఉన్న తత్త్వమంతటినీ తెలుసుకున్నవాడు. ధనుర్వేదంలో కూడా అసాధారణమైన ప్రజ్ఞ ఉన్నవాడు. (ఎవరికీ తెలియనంతగా, ఎవరూ ఊహించలేని విధంగా విల్లుతో ధర్మప్రకారం యుద్ధం చెయ్యగలవాడు.)

సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞః స్మృతిమాన్ ప్రతిభానవాన్

సర్వలోకప్రియః సాధురదీనాత్మా విచక్షణః

ఒక్క వేదవేదాంగాలే కాకుండా ధర్మశాస్త్రం, పురాణాలు, న్యాయం, మీమాంస, యోగం మొదలైన శాస్త్రాలని క్షుణ్ణంగా తెలిసినవాడు. తెలుసుకున్న విషయాల్ని ఎప్పుడూ మరచిపోడు. ప్రతిరోజూ చేసే వ్యవహారాల్లో ఏమిటి మాట్లాడాలి, ఏమిటి మాట్లాడకూడదు, ఎప్పుడు ఏది చెప్పాలి అన్న విషయంలో అతని సమయస్ఫూర్తి చాల గొప్పది. లోకంలో ఉన్న ప్రాణులన్నిటికీ చాలా ఇష్టమైనవాడు. ఎలాంటి కష్టం వచ్చినా అతని మనస్సు కలత చెందదు. దీనంగా ఉండడు. (కష్టాల్లో కూడా ధైర్యంగా ఉంటాడు). వినేవాళ్ళకి ఆనందం కలిగేలా మాట్లాడతాడు. సమయానికి తగినట్టు పనిచేసిపెట్టి ఆనందపెడతాడు.

సర్వదాభిగతః సద్భిః సముద్ర ఇవ సింధుభిః

ఆర్యః సర్వసమశ్చైవ సదైకప్రియదర్శనః

ఎలాగైతే నదులన్నీ ఎప్పుడూ సముద్రాన్ని చేరుకుంటాయో, అలాగే ప్రజలందరూ ఎప్పుడు కావలసివస్తే అప్పుడు రాముణ్ణి చేరుకునేవారు. అలా ఆ రాముడు గౌరవించబడేవాడు. అలా వచ్చినవాళ్ళందర్నీ సమానంగా చూసేవాడు. ఎవరు ఏ సమయంలో వచ్చి కలిసినా అదే ప్రేమతో, అదే ఆప్యాయతతో చేరదీసేవాడు.

స చ సర్వగుణోపేతః కౌసల్యానందవర్ధనః

సముద్ర ఇవ గామ్భీర్యే ధైర్యేణ హిమవానివ

ఆ రాముడు అలా ప్రకృతిలో ఉన్న అన్ని మంచిగుణాల్నీ కలిగినవాడు. (ఆ గుణాల్తో) అతని తల్లి కౌసల్యకి ఆనందాన్ని పెంపొందించేవాడు (కౌసల్యకి ఆనందం రోజు రోజుకీ పెరిగేది). సముద్రంలా గంభీరంగా ఉండేవాడు. హిమాలయ పర్వతంలా ధైర్యంగా ఉండేవాడు. (తలెత్తుకుని స్థిరంగా నిలచేవాడు).

విష్ణునా సదృశో వీర్యే సోమవత్ప్రియదర్శనః

కాలాగ్నిసదృశః క్రోధే క్షమయా పృథివీసమః

ధనదేన సమస్త్యాగే సత్యే ధర్మ ఇవాపరః

ఆ రాముడు పరాక్రమంలో విష్ణువుతో సమానమైనవాడు. చంద్రుణ్ణి చూస్తే వచ్చే ఆనందం అతన్ని చూస్తే వస్తుంది. (అధర్మ విషయాల్లో) కోపం వచ్చినప్పుడు ప్రళయకాలంలో అగ్నిలా భయంకరమైనవాడు. ఓర్పులో భూదేవిలాంటి వాడు. దానంచేయడంలో కుబేరుడిలాంటి వాడు. సత్యాన్ని పాటించడంలో ధర్మదేవతలాంటి వాడు. ఈ విషయంలో రాముణ్ణి మించినవాళ్ళు లేరు.

తమేవం గుణసంపన్నం రామం సత్యపరాక్రమమ్

జ్యేష్ఠం శ్రేష్ఠగుణైర్యుక్తం ప్రియం దశరథస్సుతమ్

ప్రకృతీనాం హితైర్యుక్తం ప్రకృతి ప్రియకామ్యయా

యౌవరాజ్యేన సంయోక్తుమైచ్ఛత్ ప్రీత్యా మహీపతిః

అప్పుడు భూమిని పాలిస్తున్న దశరథమమహారాజు ప్రజలకి హితమైన పని చేద్దామనే కోరికతో, తన పెద్ద కొడుకూ, (పైన చెప్పిన) మంచి గుణాల్తో కూడుకున్నవాడూ, అమోఘమైన పరాక్రమంతో కూడినవాడూ, ఎప్పుడూ ప్రజల మేలునే కోరేవాడూ, తనకి చాలా ఇష్టమైనవాడూ అయిన శ్రీరాముణ్ణి యువరాజుగా చేద్దామనుకున్నాడు.

తస్యాభిషేకసమ్భారాన్ దృష్ట్వా భార్యాథ కైకయీ
పూర్వం దత్తవరా దేవీ వరమేనమయాచత
వివాసనం చ రామస్య భరతస్యాభిషేచనమ్

అప్పుడు, దశరథుని రాణుల్లో (భార్యల్లో) ఒక రాణి అయిన కైకేయి ఆ రాముడికి యువరాజు పట్టాభిషేకానికి సమకూరుస్తున్న వస్తువుల్ని చూసింది. పూర్వపు రోజుల్లో దశరథుడు కైకేయికి రెండు వరాలు ఇచ్చాడు (అవి అప్పుడు అడగలేదు. ఈ పట్టాభిషేకం చూసి ఇప్పుడు అడిగింది). 'రాముణ్ణి అడవికి పంపాలి. భరతుడికి పట్టాభిషేకం చెయ్యాలి' అని అడిగింది.

స సత్యవచనాద్రాజా ధర్మపాశేన సంయతః
వివాసయామాస సుతం రామం దశరథః ప్రియమ్

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి అనే కారణంచేత, ధర్మం అనే తాడుచేత కట్టివేయబడిన ఆ దశరథుడు, తనకి అతి ఇష్టమైన కొడుకైన రాముణ్ణి అడవులకి పంపాడు.

స జగామ వనం వీరః ప్రతిజ్ఞామనుపాలయన్

పితుర్వచననిర్దేశాత్ కైకేయ్యాః ప్రియకారణాత్

మహావీరుడైన ఆ రాముడు కైకేయికి ఆనందం కలిగించడం కోసం తండ్రి చెప్పీ చెప్పగానే ఆ మాటని ఆజ్ఞగా తీసుకుని, తన ప్రతిజ్ఞని నిలుపుకుంటూ (తండ్రి గౌరవం కాపాడ్డం తన విధి అనేది రాముడి ప్రతిజ్ఞ) అడవికి వెళ్ళిపోయాడు.

తం వ్రజన్తం ప్రియో భ్రాతా లక్ష్మణోఽనుజగామ హ

స్నేహాద్వినయసంపన్నః సుమిత్రానందవర్ధనః

భ్రాతరం దయితో భ్రాతుః సౌభ్రాత్రమనుదర్శయన్

లక్ష్మణుడు దశరథుని మరో భార్య అయిన సుమిత్ర ఆనందాన్ని పెంపొందించే కొడుకు. ఈ లక్ష్మణుడు రాముడికి చాలా ఇష్టమైన తమ్ముడు. రాముడికి లక్ష్మణుడంటే సహజమైన ప్రేమ. లక్ష్మణుడు చాలా వినయమున్న వాడు. తనకి అన్నయ్య మీద ఉన్న ప్రేమతో అడవికి వెళుతున్న రాముడి వెంటే వెళ్ళాడు.

రామస్య దయితా భార్యా నిత్యం ప్రాణసమా హితా

జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితా

సర్వలక్షణసంపన్నా నారీణాముత్తమా వధూః

సీతాప్యనుగతా రామం శశినం రోహిణీ యథా

జనకమహారాజు వంశంలో పుట్టిన సీత రాముడికి భార్య. అతనికి అతి ఇష్టమైనది, ప్రాణంతో సమానమైనది, ఎప్పుడూ అతనికి హితమైన పనుల్నే చేసేది. రాక్షసుల్ని మోహింపజెయ్యడానికి తయారుచెయ్యబడ్డ దేవమాయలా చాలా అందగత్తె. అన్ని శుభలక్షణాలూ ఉన్నది. స్త్రీలలో ఉత్తమమైనది. ఇక్ష్వాకువంశానికి తగిన కోడలు. ఆ సీత కూడా చంద్రుడి వెంట వెళ్ళే రోహిణిలా, రాముడి వెంట అడవికి వెళ్ళింది.

పౌరైరనుగతో దూరం పిత్రా దశరథేన చ
శృంగిబేరపురే సూతం గంగాకూలే వ్యసర్జయత్
గుహమాసాద్య ధర్మాత్మా నిషాదాధిపతిం ప్రియమ్
గుహేన సహితో రామో లక్ష్మణేన చ సీతయా

అయోధ్యలో ఉన్న ప్రజలూ, దశరథుడూ చాలాదూరం రాముడి వెనకన వెళ్ళారు. ధర్మాత్ముడైన ఆ రాముడు, గంగానది ఒడ్డున శృంగిబేరపురంలో బోయల నాయకుడైన గుహుణ్ణి కలుసుకున్నాడు. రాముడు తననీ, సీతనీ, లక్ష్మణుణ్ణీ అక్కడ వరకూ తీసుకొచ్చిన సూతుణ్ణి వెనక్కి పంపించేసాడు.

తే వనేన వనం గత్వా నదీస్తీర్త్వా బహూదకాః
చిత్రకూటమనుప్రాప్య భరద్వాజస్య శాసనాత్
రమ్యమావసథం కృత్వా రమమాణా వనే త్రయః
దేవగంధర్వసంకాశాస్తత్ర తే న్యవసన్ సుఖమ్

ఆ సీతారామలక్ష్మణులు ఒక అడవినుంచి మరొక అడవికి చేరుకుంటూ, గొప్ప గొప్ప నదుల్ని దాటుకుంటూ వెళ్ళారు. ఆ తర్వాత భరద్వాజమహర్షి చెప్పిన ప్రకారం చిత్రకూటమనే పర్వతాన్ని చేరుకున్నారు. అక్కడ ఒక సుందమైన పర్ణశాలని కట్టుకుని, వాళ్ళు ముగ్గురూ అక్కడున్న వనాల్లో సుఖాలు అనుభవిస్తూ దేవతల్తోనూ, గంధర్వుల్తోనూ సమానమైన వాళ్ళలా నివసించారు.

చిత్రకూటం గతే రామే పుత్రశోకాతురస్తథా
రాజా దశరథః స్వర్గం జగామ విలపన్సుతమ్

రాముడు చిత్రకూటం వెళ్ళిన తర్వాత దశరథుడు కొడుకులేడన్న దుఃఖంతో పీడించబడి, ఆ కొడుకుకోసం ఏడుస్తూ ప్రాణాలు వదిలి స్వర్గానికి వెళ్ళిపోయాడు.

మృతే తు తస్మిన్భరతో వసిష్ఠప్రముఖైర్ద్విజైః
నియుజ్యమానో రాజ్యాయ నైచ్ఛద్రాజ్యం మహాబలః
స జగామ వనం వీరో రామపాదప్రసాదకః

దశరథుడు చనిపోగానే, రాజపురోహితుడైన వసిష్ఠుడు మొదలైన బ్రాహ్మణులంతా మహాబలుడైన భరతుణ్ణి రాజ్యం చెయ్యమని ఆదేశించారు. అయినా, (రాముడే రాజ్యం చెయ్యాలని అనుకున్న) భరతుడు అందుకు ఒప్పుకోలేదు. రాగద్వేషాల్ని జయించి వీరుడై ఆ భరతుడు రాముణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకుందామని అడవికి వెళ్ళాడు.

గత్వా తు సుమహాత్మానం రామం సత్యపరాక్రమమ్

అయాచద్భ్రాతరం రామమార్యభావపురస్కృతః

త్వమేవ రాజా ధర్మజ్ఞ ఇతి రామం వచోఽబ్రవీత్

రాముడి పట్ల గౌరవంతో నిండిన ఆ భరతుడు పూజించదగిన హృదయమున్నవాడూ, సత్యపాలనలో పేరెన్నికగన్నవాడూ, అన్నగారూ అయిన రాముణ్ణి చేరుకుని ప్రార్ధన చేసాడు. “అన్ని ధర్మాల్నీ తెలిసిన నువ్వే రాజువు” అని రాముడితో అన్నాడు.

రామోఽపి పరమోదారః సుముఖః సుమహాయశాః

న చైచ్ఛత్పితురాదేశాద్రాజ్యం రామో మహాబలః

రాముడు అందరికీ సంతోషం కలిగించేవాడు. తనని ఆశ్రయించిన వాళ్ళకి అన్ని కోరికలూ తీర్చేవాడు. ఎప్పుడూ ఆనందమైన ముఖముతో ఉండేవాడు, అడిగినవి ఇవ్వడానికి ఒప్పుకునే మనస్తత్వం ఉన్నవాడు. తన గొప్ప గుణాలవల్ల కీర్తి పొందినవాడు. గొప్ప దేహబలం కలవాడు. అయినా, తండ్రి తనకి ఇచ్చిన ఆజ్ఞ వల్ల రాజ్యాన్ని తీసుకోడానికి ఇష్టపడలేదు.

పాదుకే చాస్య రాజ్యాయ న్యాసం దత్వా పునః పునః

నివర్తయామాస తతో భరతం భరతాగ్రజః

రాముడు ఆ భరతుడికి రాజ్యపాలన చెయ్యడానికి తన పాదుకల్ని ఉంచుకోమని ఇచ్చి, ఎన్నో విధాల భరతుడికి నచ్చజెప్పి అతన్ని వెనక్కి పంపాడు.

స కామమనవాప్యైవ రామపాదావుపస్పృశన్

నందిగ్రామేఽకరోద్రాజ్యం రామాగమనకాంక్షయా

రాముణ్ణి వెనక్కి తీసుకెళ్ళి రాజుని చెయ్యాలన్న కోరిక తీరని భరతుడు ఆ రాముడి పాదుకల్ని పూజిస్తూ, రాముడు సుఖంగా తిరిగిరావాలని మనస్సులో కోరుకుంటూ, (అయోధ్య పక్కనే ఉన్న) నందిగ్రామం అనే ఊళ్ళో ఉంటూ, (పాదుకలద్వారానే) రాజ్యం చేసాడు.

గతే తు భరతే శ్రీమాన్ సత్యసంధో జితేంద్రియః

రామస్తు పునరాలక్ష్య నాగరస్య జనస్య చ

తత్రాగమనమేకాగ్రో దండకాన్ ప్రవివేశ హ

భరతుడు వచ్చి బ్రతిమాలినా రాజ్యాన్ని తీసుకోని రాముడు ధర్మం పాటించి ప్రకాశించాడు. భరతుడు వచ్చి బ్రతిమాలినా తన ప్రతిజ్ఞను వదలక తండ్రికిచ్చిన మాట తప్పక సత్యసంధుడయ్యాడు. రాజ్యం తీసుకోవడం వల్ల వచ్చే సుఖాలకి లొంగిపోక జితేంద్రియుడయ్యాడు. అయితే భరతుడి వెంటవచ్చిన అయోధ్యానగర పౌరులు తను ఉన్న చోటు తెలిసిపోవడం వల్ల మళ్ళీ మళ్ళీ వస్తూంటారని ఊహించిన రాముడు తండ్రికిచ్చిన మాట పాటించడానికి అది అడ్డుగా ఉంటుందని దండకారణ్యానికి వెళ్ళాడు.

ప్రవిశ్య తు మహారణ్యం రామో రాజీవలోచనః

విరాధం రాక్షసం హత్వా శరభంగం దదర్శ హ

సుతీక్ష్ణం చాప్యగస్త్యం చ అగస్త్యభ్రాతరం తథా

పద్మముల వంటి కన్నులు గల రాముడు దండకారణ్యంలో ప్రవేశించిన వెంటనే విరాధుడు అనే రాక్షసుణ్ణి చంపాడు. తరవాత (ఆ అడవిలో నివసిస్తున్న) శరభంగ మహర్షినీ, సుతీక్ష్ణమహర్షినీ, అగస్త్యమహామునినీ, అగస్త్యుని తమ్ముడిని దర్శించుకున్నాడు.

అగస్త్యవచనాచ్చైవ జగ్రాహైంద్రం శరాసనమ్

ఖడ్గం చ పరమప్రీతస్తూణీ చాక్షయసాయకౌ

అగస్త్యుడు తనకి ఇంద్రుడిచ్చిన విల్లుని, కత్తిని, తరగనన్ని బాణాలనిచ్చే అమ్ములపొదిని తీసుకొమ్మని రాముడికి ఇచ్చాడు. రాముడు చాలా సంతోషంగా వాటిని తీసుకున్నాడు.

వసతస్తస్య రామస్య వనే వనచరైః సహ

ఋషయోఽభ్యాగమన్సర్వే వధాయాసురరక్షసామ్

రాముడు శరభంగమహర్షి ఆశ్రమంలో నివాసం చేస్తున్నప్పుడు, ఆ చుట్టుపక్కల ఉండే ఋషులంతా అసురుల్ని, రాక్షసుల్ని చంపమని ప్రార్థించడానికి రాముడి దగ్గరకి వచ్చారు.

స తేషాం ప్రతిశుశ్రావ రాక్షసానాం తథా వనే

ప్రతిజ్ఞాతశ్చ రామేణ వధః సంయతి రక్షసామ్

ఋషీణామగ్నికల్పానాం దండకారణ్యవాసినామ్

రాక్షసులు నివసించే ఆ అడవిలో ఆ ఋషులు చేసిన ప్రార్థనని రాముడు అంగీకరించాడు. అగ్నితో సమానమైన తేజస్సున్న, దండకారణ్యంలో నివసిస్తున్న ఆ మునులకి “యుద్ధంలో రాక్షసుల్ని చంపుతా”నని మాట ఇచ్చాడు.

తేన తత్రైవ వసతా జనస్థాననివాసినీ

విరూపితా శూర్పణఖా రాక్షసీ కామరూపిణీ

దండకారణ్యంలో జనస్థానం అనే ప్రదేశంలో శూర్పణఖ అనే రాక్షసి నివసిస్తుండేది. ఆమె కామరూపిణి, అంటే తనకి నచ్చిన రూపాన్ని పొందగలదు. ఆ రాక్షసిని రాముడు వికారమైన దానిగా చేసాడు. (ఆమె రాముణ్ణి పెళ్ళిచేసుకోమని కోరింది. చేసుకోనంటే సీతని చంపడానికి సిద్ధపడింది. రాముని ఆజ్ఞతో లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసేసాడు)

తతః శూర్పణఖావాక్యాదుద్యుక్తాన్ సర్వరాక్షసాన్

ఖరం త్రిశిరసం చైవ దూషణం చైవ రాక్షసమ్

నిజఘాన రణే రామస్తేషాం చైవ పదానుగాన్

ఆ శూర్పణఖ చెప్పిన మాటలు విని ఖరుడు, త్రిశిరసుడు, దూషణుడు అనే రాక్షసులు వాళ్ళ అందరు అనుచరుల్తో సహా యుద్ధానికి వచ్చారు. వాళ్ళందర్నీ రాముడు యుద్ధంలో చంపేశాడు.

వనే తస్మిన్నివసతా జనస్థాననివాసినామ్
రక్షసాం నిహతాన్యాసన్ సహస్రాణి చతుర్దశ

అలా దండకారణ్యంలో నివసిస్తున్న ఆ రాముడి చేత జనస్థానంలో నివసిస్తున్న పధ్నాలుగు వేలమంది రాక్షసులు చంపబడ్డారు.

తతో జ్ఞాతివధం శ్రుత్వా రావణః క్రోధమూర్ఛితః
సహాయం వరయామాస మారీచం నామ రాక్షసమ్

అప్పుడు రావణుడు జ్ఞాతుల మరణవార్త విని, చాల కోపించి, తనకి సహాయం చెయ్యమని మారీచుడనే రాక్షసుణ్ణి కోరాడు.

వార్యమాణః సుబహుశో మారీచేన స రావణః
న విరోధో బలవతా క్షమో రావణ తేన తే

"ఓ రావణా! మహాబలవంతులైన ఖరుడు మొదలైన పధ్నాలుగువేల మంది రాక్షసుల్ని చంపిన మహాబలవంతుడైన రాముడితో విరోధం మంచిది కాదు" అని మారీచుడు చాలా సార్లు రావణుణ్ణి వారించాడు.

అనాదృత్య తు తద్వాక్యం రావణః కాలచోదితః

జగామ సహ మారీచస్తస్యాశ్రమపదం తదా

చావు దగ్గరకి వచ్చిన రావణుడు మారీచుడి మాటల్ని లెక్కచెయ్యలేదు. అతన్ని వెంటబెట్టుకుని రాముడి ఆశ్రమానికి వెళ్ళాడు.

తేన మాయావినా దూరమపవాహ్య నృపాత్మజౌ

జహార భార్యాం రామస్య గృధ్రం హత్వా జటాయుషమ్

మాయారూపంలో (బంగారు లేడి రూపంలో) ఉన్న మారీచుడి ద్వారా రామలక్ష్మణుల్ని వాళ్ళ పర్ణశాలనుంచి దూరంగా వెళ్ళిపోయేలా చేసి, రాముడి భార్య అయిన సీతని అపహరించి తీసుకుపోయాడు.ఆమెని వాడినుంచి విడిపిద్దామని వచ్చిన జటాయువుని చంపేశాడు.

గృధ్రం చ నిహతం దృష్ట్వా హృతాం శ్రుత్వా చ మైథిలీమ్

రాఘవః శోకసంతప్తో విలలాపాకులేంద్రియః

రాముడు, చనిపోవడానికి సిద్ధంగా ఉన్న జటాయువును చూసి, అతని ద్వారా సీతని రావణుడు ఎత్తుకుపోయాడని విని, ఇంద్రియాల్ని వశంలో పెట్టుకోలేక విపరీతంగా దుఃఖించాడు. (రెండు విషయాలూ రాముణ్ణి తీవ్రంగా బాధించాయి).

తతస్తేనైవ శోకేన గృధ్రం దగ్ధ్వా జటాయుషమ్
మార్గమాణో వనే సీతాం రాక్షసం సందదర్శ హ
కబంధం నామ రూపేణ వికృతం ఘోరదర్శనమ్

అలా దుఃఖంతో బాధపడుతూనే, గ్రద్దయైన ఆ జటాయువుకి దహన సంస్కారాలు చేసి, సీతకోసం వెతుక్కుంటూ వెళుతూ, ఆ అడవిలో వికృతంగా, భయంకరమైన రూపంలో ఉన్న కబంధుడనే రాక్షసుణ్ణి చూశాడు.

తం నిహత్య మహాబాహుర్దదాహ స్వర్గతశ్చ సః
స చాస్య కథయామాస శబరీం ధర్మచారిణీమ్
శ్రమణీం ధర్మనిపుణామభిగచ్ఛేతి రాఘవ

గొప్పబలంతో కూడిన బాహువులున్న రాముడు, ఆ కబంధుణ్ణి చంపి దహనసంస్కారాలు చేసాడు. అప్పుడు ఆ కబంధుడు స్వర్గానికి పోతూ “ ఓ రామా! ధర్మాన్ని ఆచరించడంలో నేర్పున్నదీ, బాగా ఆచరించేదీ అయిన ఒక శబరస్త్రీ సన్న్యాసిని ఉంది. ఆమె వద్దకు వెళ్ళు” అని చెప్పాడు.

సోఽభ్యగచ్ఛన్మహాతేజాః శబరీం శత్రుసూదనః
శబర్యా పూజితః సమ్యగ్రామో దశరథాత్మజః

గొప్ప తేజస్సుకలవాడూ, శత్రువులని సంహరించేవాడూ అయిన రాముడు ఆ శబరి వద్దకు వెళ్ళాడు. ఆమెచేత బాగా పూజింపబడ్డాడు.

పంపాతీరే హనుమతా సంగతో వానరేణ హ

హనుమద్వచనాచ్చైవ సుగ్రీవేణ సమాగతః

(ఆ తరువాత) పంపాసరస్సు తీరంలో హనుమంతుడనే వానరుణ్ణి కలిసాడు. ఆ హనుమంతుని మాటలు విని (అతని రాజైన) సుగ్రీవుడితో స్నేహం చేసుకున్నాడు.

సుగ్రీవాయ చ తత్సర్వం శంసద్రామో మహాబలః

ఆదితస్తద్యథావృత్తం సీతాయాశ్చ విశేషతః

మహాబలుడైన రాముడు సుగ్రీవుడికీ, హనుమంతుడికీ మొదటినుంచీ అంతవరకూ జరిగిన విషయాల్నీ, ముఖ్యంగా సీత గురించిన విషయాల్నీ, జరిగింది జరిగినట్లుగా చెప్పాడు.

సుగ్రీవశ్చాపి తత్సర్వం శ్రుత్వా రామస్య వానరః

చకార సఖ్యం రామేణ ప్రీతశ్చైవాగ్నిసాక్షికమ్

సుగ్రీవుడు రాముడు చెప్పినదంతా విని, అతనితో పరిచయానికి సంతోషించి, అగ్నిసాక్షికంగా రాముడితో స్నేహం చేసుకున్నాడు.

తతో వానరరాజేన వైరానుకథనం ప్రతి

రామాయావేదితం సర్వం ప్రణయాద్దుఃఖితేన చ

అప్పుడు, రాముడు సుగ్రీవుణ్ణి “ నీకూ, వాలికీ (సుగ్రీవుడి అన్న వాలి) విరోధం ఎలా ఏర్పడింది?” అని అడిగాడు. దానికి, సుగ్రీవుడు దుఃఖిస్తూ, స్నేహంతో ఏర్పడిన చనువుతో, రాముడికి ఆ కథంతా చెప్పాడు.

ప్రతిజ్ఞాతం చ రామేణ తదా వాలివధం ప్రతి

వాలినశ్చ బలం తత్ర కథయామాస వానరః

అది విన్న రాముడు వాలిని చంపుతానని ప్రతిజ్ఞ చేసాడు. అప్పుడు సుగ్రీవుడు రాముడికి వాలి ఎంత బలవంతుడో వర్ణించి చెప్పాడు.

సుగ్రీవః శంకితశ్చాసీన్నిత్యం వీర్యేణ రాఘవే

రాఘవప్రత్యయార్థం తు దున్దుభేః కాయముత్తమమ్

దర్శయామాస సుగ్రీవో మహాపర్వతసన్నిభమ్

సుగ్రీవుడికి రాముడి పరాక్రమం మీద మొదటినుంచీ సందేహంగా ఉంది (వాలిని చంపగలడా లేదా అని). అందువల్ల రాముడి పరాక్రమం మీద తనకి నమ్మకం కలగడానికోసం, కొండలా పడి ఉన్న దుందుభి అనే రాక్షసుడి కళేబరాన్ని (మృతదేహాన్ని) చూపించాడు. (ఒకప్పుడు వాలిదాన్ని తన చేతుల్తో చాలా దూరంగా విసిరేసాడు)

ఉత్స్మయిత్వా మహాబాహుః ప్రేక్ష్య చాస్థి మహాబలః

పాదాంగుష్ఠేన చిక్షేప సంపూర్ణం దశయోజనమ్

గొప్పబలం, ఆ బలంతో పాటు పని చెయ్యగల గొప్ప బాహువులూ ఉన్న రాముడు (సుగ్రీవుడి సందేహం గుర్తించి) గంభీరంగా నవ్వి, ఆ ఎముకల గూడుని తన కాలి బొటనవేల్తో పూర్తిగా పదివేల యోజనాల దూరం విసిరికొట్టాడు.

బిభేద చ పునః సాలాన్ సప్తైకేన మహేషుణా

గిరిం రసాతలం చైవ జనయన్ ప్రత్యయం తదా

ఆ తర్వాత సుగ్రీవుడికి మరింత నమ్మకం కలిగించడాని కోసం, ఒకే ఒక్క గొప్పబాణంతో వరుసగా ఉన్న ఏడు మద్దిచెట్లనీ, ఒక పర్వతాన్నీ, పాతాళాన్నీ చీల్చాడు.

తతః ప్రీతమనాశ్చైవ విశ్వస్తశ్చ మహాకపి:

కిష్కిధాం రామసహితో జగామ చ గుహాం తదా

అదంతా చూసిన తర్వాత సుగ్రీవుడి మనస్సుకి ఆనందం, రాముడి బలంమీద నమ్మకం కలిగాయి. అప్పుడు రాముణ్ణి వెంటబెట్టుకుని, గుహలా ఉన్న కిష్కింధానగరానికి వెళ్ళాడు.

తతోఽగర్జద్ధరివరః సుగ్రీవో హేమపింగలః

తేన నాదేన మహతా నిర్జగామ హరీశ్వరః

కిష్కింధలోకి వెళ్ళి, బంగారపురంగులో ఉన్న ఆ వానరరాజైన సుగ్రీవుడు గర్జించాడు. ఆ గొప్పనాదాన్ని విని వాలి బయటకి వచ్చాడు.

అనుమాన్య తదా తారాం సుగ్రీవేణ సమాగతః

నిజఘాన చ తత్రైనం శరేణైకేన రాఘవః

అప్పుడు, వాలి, (యుద్ధం వద్దన్న) తన భార్య తారని ఒప్పించి, సుగ్రీవుడితో యుద్ధానికి తలపడ్డాడు. అక్కడ రాముడు ఒకేఒక్క బాణంతో వాలిని చంపాడు.

తతః సుగ్రీవవచనాద్ధత్వా వాలినమాహవే

సుగ్రీవమేవ తద్రాజ్యే రాఘవః ప్రత్యపాదయత్

అలా, రాముడు సుగ్రీవుడి ప్రార్థనప్రకారం వాలిని చంపి, ఆ వాలి రాజ్యానికి సుగ్రీవుణ్ణి రాజుని చేసాడు.

స చ సర్వాన్ సమానీయ వానరాన్ వానరర్షభః

దిశః ప్రస్థాపయామాస దిదృక్షుర్జనకాత్మజామ్

వానరుల్లో శ్రేష్ఠుడైన సుగ్రీవుడు మిగిలిన వానరులందర్నీ రప్పించి, సీతని వెదకడానికి అన్ని దిక్కులకీ పంపాడు.

తతో గృధ్రస్య వచనాత్సంపాతేర్హనుమాన్ బలీ

శతయోజనవిస్తీర్ణం పుప్లువే లవణార్ణవమ్

అప్పుడు, బలశాలియైన హనుమంతుడు సంపాతి (జటాయువు అన్న) అనే ఒక గ్రద్ద చెప్పిన సమాచారం వల్ల (సీత లంకలో ఉందని తెలిసి) నూరుయోజనాల వెడల్పున్న ఉప్పుసముద్రాన్ని దాటాడు.

తత్ర లఙ్కాం సమాసాద్య పురీం రావణపాలితామ్
దదర్శ సీతాం ధ్యాయన్తీమశోకవనికాం గతామ్

రావణుడిచేత పాలింపబడుతున్న లంకా పట్టణాన్ని చేరి, అక్కడ అశోకవనంలో రాముణ్ణి గురించే ధ్యానం చేస్తున్న సీతని చూసాడు.

నివేదయిత్వాభిజ్ఞానం ప్రవృత్తిం చ నివేద్య చ
సమాశ్వాస్య చ వైదేహీం మర్దయామాస తోరణమ్

హనుమంతుడు, రాముడు తనకిచ్చిన ఉంగరాన్ని సీతకి గుర్తుగా ఇచ్చి, రాముడికీ, సుగ్రీవుడికీ ఏర్పడ్డ స్నేహం మొదలైన విషయాలు ఆమెకు చెప్పి, ఆమెని ఊరడించాడు. అంతేకాదు, అశోకవనంలోకి వెళ్ళడానికి కట్టిన బయటగుమ్మాన్ని (ఎత్తైన తోరణంలాంటిదాన్ని) విరగ్గొట్టి పిండి చేసాడు కూడా.

పంచ సేనాగ్రగాన్ హత్వా సప్త మంత్రిసుతానపి
శూరమక్షం చ నిష్పిష్య గ్రహణం సముపాగమత్

(దానివల్ల జరిగిన యుద్ధంలో) ఐదుగురు సేనానాయకుల్ని, ఏడుగురు మంత్రికుమారుల్ని చంపాడు. శూరుడైన అక్షకుమారుణ్ణి (రావణుడి కొడుకుని)

నుజ్జు చేసాడు. ఇంద్రజిత్తు (రావణుడి పెద్ద కొడుకు) తనమీద ప్రయోగించిన బ్రహ్మాస్త్రానికి కట్టుబడ్డాడు. (కేవలం బ్రహ్మమీద గౌరవంతో).

అస్త్రేణోన్ముక్తమాత్మానం జ్ఞాత్వా పైతామహాద్వరాత్
మర్షయన్రాక్షసాన్వీరో యంత్రిణస్తాన్యదృచ్ఛయా
తతో దగ్ధ్వా పురీం లంకామృతే సీతాం చ మైథిలీమ్
రామాయ ప్రియమాఖ్యాతుం పునరాయాన్మహాకపిః

వీరుడైన ఆ హనుమంతుడు, పూర్వం బ్రహ్మదేవుడిచ్చిన వరం వల్ల, బ్రహ్మాస్త్రం తనని విడిచిపెట్టినట్టు తెలిసినా, మరొక పనిని మనసులో ఉంచుకుని, కట్టుబడ్డట్టే ఉండిపోయాడు. (అలా ఉండిపోతే రావణుణ్ణి కూడా చూడచ్చుగదా అని). ఆ రాక్షసులు తనని త్రాళ్ళతో కట్టి, బాధిస్తున్నా సహించాడు. రావణుడితో మాట్లాడాక, సీత ఉన్న అశోకవనాన్ని తప్ప, మిగిలిన లంకంతా కాల్చి, తను సీతను చూసిన సంతోషమైన వార్తని చెప్పడానికి తిరిగి రాముడి దగ్గరకెళ్ళాడు.

సోఽభిగమ్య మహాత్మానం కృత్వా రామం ప్రదక్షిణమ్
న్యవేదయదమేయాత్మా దృష్టా సీతేతి తత్త్వతః

సీతను పోగొట్టుకున్నప్పటికీ రాముడు ఏ మాత్రం ధైర్యాన్ని కోల్పోకుండా ఉన్నాడు. చక్కని బుద్ధి, తెలివితేటలు, సమయస్ఫూర్తి ఉన్న హనుమంతుడు ఆ రాముడి దగ్గరకి వెళ్ళి, అతనికి ప్రదక్షిణము, నమస్కారము చేసి “చూసాను సీతను” అని జరిగినది జరిగినట్లు చెప్పాడు.

తతః సుగ్రీవసహితో గత్వా తీరం మహోదధేః

సముద్రం క్షోభయామాస శరైరాదిత్యసన్నిభైః

ఆ తర్వాత రాముడు సుగ్రీవుడితో కలిసి సముద్రతీరానికి వెళ్ళి, (సముద్రుడు తనకి వశమై సహాయం చెయ్యక పోతూంటే) సూర్యతేజస్సుతో సమానమైన బాణాలతో సముద్రుణ్ణి కుదిపివేశాడు.

దర్శయామాస చాత్మానం సముద్రస్సరితాం పతిః

సముద్రవచనాచ్చైవ నలం సేతుమకారయత్

నదులన్నిటికీ అధిపతి అయిన సముద్రుడు రాముడి కోపానికి భయపడి, తన నిజరూపంతో కనిపించాడు. సముద్రుడు చెప్పిన మాట ప్రకారం, రాముడు నలుడిచేత సేతువుని (వంతెనని) కట్టించాడు.

తేన గత్వా పురీం లఙ్కాం హత్వా రావణమాహవే

రామః సీతామనుప్రాప్య పరాం వ్రీడాముపాగమత్

రాముడు ఆ సేతువు ద్వారా లంకకుపోయి యుద్ధంలో రావణుణ్ణి చంపాడు. సీతను తిరిగిపొందిన వెంటనే చాలా సిగ్గుపడ్డాడు. (చాలాకాలం పరాయివాడి ఇంట్లో ఉండిపోయిన సీతను తిరిగి భార్యగా పొందడానికి).

తాముువాచ తతో రామః పరుషం జనసంసది

అమృష్యమాణా సా సీతా వివేశ జ్వలనం సతీ

ఆ కారణం వల్ల రాముడు ఆ జనాల గుంపు ముందర సీతతో (ఆ విషయం గురించి) కఠినంగా మాట్లాడాడు. పతివ్రత అయిన సీత రాముడి మాటల్ని సహించలేక అగ్నిలో దూకింది.

తతోఽగ్నివచనాత్సీతాం జ్ఞాత్వా విగతకల్మషామ్

బభౌ రామః సంప్రహృష్టః పూజితః సర్వదైవతైః

అప్పుడు ఆమె ఏ పాపమూ ఎరుగనిదని అగ్నిదేవుని ద్వారా తెలుసుకుని సంతుష్టిపొంది, అందరి దేవతలచేత పూజింపబడి ప్రకాశించాడు.

కర్మణా తేన మహతా త్రైలోక్యం సచరాచరమ్

సదేవర్షిగణం తుష్టం రాఘవస్య మహాత్మనః

గొప్ప ధైర్యమున్న రాముడు లోకాల్ని పీడించిన ఆ రావణుణ్ణి చంపడం చూసి మూడులోకాల్లో ఉన్న చరాచరజీవులతో (కదిలే జీవులు, కదలని జీవులు) కూడిన దేవతలు, ఋషుల సమూహాలన్నీ సంతోషపడ్డాయి.

అభిషిచ్య చ లంకాయాం రాక్షసేంద్రం విభీషణమ్

కృతకృత్యస్తతో రామో విజ్వరః ప్రముమోద హ

రాముడు విభీషణుణ్ణి లంకకు రాజుగా పట్టాభిషేకం చేసి కృతకృత్యుడయాడు. రాముడు తన ప్రతిజ్ఞలు నెరవేరడంతో మనసులో చింతలన్నీ తొలగిపోయాయి. ఈ రాముని పరాక్రమము, సత్యవ్రతము ఆశ్చర్యము గదా!

దేవతాభ్యో వరం ప్రాప్య సముత్థాప్య చ వానరాన్

అయోధ్యాం ప్రస్థితో రామః పుష్పకేణ సుహృద్వృతః

యుద్ధాన్ని చూడడానికి వచ్చిన దేవతలనుండి రాముడు వరాలు పొందాడు. ఆ వరాల ద్వారా యుద్ధంలో చనిపోయిన వానరులందర్నీ బ్రతికించుకున్నాడు. స్నేహితులందరితో కలిసి పుష్పకవిమానమెక్కి అయోధ్యకి బయల్దేరాడు.

భరద్వాజాశ్రమం గత్వా రామస్సత్యపరాక్రమః

భరతస్యాంతికం రామో హనూమంతం వ్యసర్జయత్

సత్యవ్రతాన్ని పాటించడంలో స్థిరమైన మనస్సుగలవాడు, అందరి జనుల మనస్సుల్నీ హరించేవాడు అయిన రాముడు (పుష్పకవిమానం మీద) భరద్వాజాశ్రమానికి వెళ్ళి, (అక్కడ ఆగి,) హనుమంతుణ్ణి భరతుడి దగ్గరకి పంపాడు. (తాను వచ్చిన వార్త భరతుడికి త్వరగా చేరవేయాలని).

పునరాఖ్యాయికాం జల్పన్ సుగ్రీవసహితశ్చ సః

పుష్పకం తత్సమారుహ్య నందిగ్రామం యయౌ తదా

ఆ రాముడు సుగ్రీవుడు, విభీషణుడు మొదలయినవాళ్ళతో కలిసి, పాతకథలన్నీ చెప్పుకుంటూ భరతుడున్న నందిగ్రామానికి వెళ్ళాడు.

నందిగ్రామే జటాం హిత్వా భ్రాతృభిః సహితోఽనఘః
రామః సీతామనుప్రాప్య రాజ్యం పునరవాప్తవాన్

ఏ పాపాలూ లేని రాముడు నందిగ్రామంలో సోదరుల్ని కలిసాడు. తన జడల్నీ మునివేషాన్నీ వదిలిపెట్టి సీతాదేవితో సహా తిరిగి తన రాజ్యానికి వెళ్ళి పాలన చేసాడు.

ప్రహృష్టముదితో లోకస్తుష్టః పుష్టః సుధార్మికః
నిరామయో హ్యరోగశ్చ దుర్భిక్షభయవర్జితః

రాముడు రాజవగానే లోకమంతా ఒక గగుర్పాటుతో కూడిన ఆనందాన్ని పొందింది. రాముడు రాజవాలనే కోరిక తీరడంతో తృప్తి చెందింది. సంతోషంతో లోకం అభివృద్ధి పొందింది. మంచి ధర్మంతో నడిచింది. పీడలు, వ్యాధులు లేనిదయింది. కరువుకాటకాలు లేనిదయింది.

న పుత్రమరణం కించిద్ద్రక్ష్యన్తి పురుషాః క్వచిత్
నార్యశ్చావిధవా నిత్యం భవిష్యన్తి పతివ్రతాః

రామరాజ్యంలో ఎక్కడా కొంచెం కూడా మనుషులు వాళ్ళ పిల్లలు చనిపోవడం చూడరు. ఆడవాళ్ళు విధవరాళ్ళు కారు. నిత్యం పతివ్రతలుగా ఉంటారు.

న చాగ్నిజం భయం కించిన్నాప్సు మజ్జన్తి జన్తవః

న వాతజం భయం కించిన్నాపి జ్వరకృతం తథా

న చాపి క్షుద్భయం తత్ర న తస్కరభయం తథా

రామరాజ్యంలో అగ్ని భయంగాని, జల భయంగాని, వాత భయంగాని, జ్వర భయంగాని, ఆకలి బాధగాని, దొంగల భయంగాని లేదు.

నగరాణి చ రాష్ట్రాణి ధనధాన్యయుతాని చ

నిత్యం ప్రముదితాః సర్వే యథా కృతయుగే తథా

నగరాలూ, రాష్ట్రాలూ ధనధాన్యాల్తో నిండిపోయాయి. అందరు ప్రజలూ కృతయుగంలో ప్రజల్లా సంతోషంగా ఉన్నారు.

అశ్వమేధశతైరిష్ట్వా తథా బహుసువర్ణకైః

గవాం కోట్యయుతం దత్త్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి

అసంఖ్యేయం ధనం దత్త్వా బ్రాహ్మణేభ్యో మహాయశాః

గొప్ప కీర్తిగల రాముడు వందలకొద్దీ అశ్వమేధయాగాల్ని, అనేక బహుసువర్ణక యాగాల్నీ చేసి వాటిద్వారా దేవతలని పూజించి, పదివేలకోట్ల ఆవుల్నీ, లెక్కపెట్టలేనంత ధనాన్నీ బ్రాహ్మణులకిచ్చి శాశ్వతమైన స్థానాన్ని పొందగలడు.

రాజవంశాన్ శతగుణాన్ స్థాపయిష్యతి రాఘవః

చాతుర్వర్ణ్యం చ లోకేఽస్మిన్ స్వే స్వే ధర్మే నియోక్ష్యతి

రఘువంశంలో పుట్టిన ఈ రాముడు ఈ లోకంలో వందరెట్ల రాజవంశాల్ని స్థాపించగలడు. నాలుగు వర్ణాలవాళ్ళనీ, వాళ్ళ వాళ్ళ ధర్మాల్లో నియోగించగలడు.

దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ

రామో రాజ్యముపాసిత్వా బ్రహ్మలోకం గమిష్యతి

రాముడు పదికొండు వేల సంవత్సరాల పాటు ప్రజలందరికీ సుఖం కలిగేలా రాజ్యాన్ని పాలించి, బ్రహ్మలోకానికి వెళ్తాడు.

ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితమ్

యః పఠేద్రామచరితం సర్వపాపైః ప్రముచ్యతే

రామచరిత పరిశుద్ధినిస్తుంది. పుణ్యప్రదం. వేదాలతో సమానం. దీన్ని చదివేవాళ్ళకి అన్నిపాపాలూ తొలగిపోతాయి.

ఏతదాఖ్యానమాయుష్యం పఠన్ రామాయణం నరః

సపుత్రపౌత్రస్సగణః ప్రేత్య స్వర్గే మహీయతే

రామాయణమనే ఈ చెప్పబడ్డ కథ ఆయుర్దాయాన్ని ఇస్తుంది. దీన్ని చదివిన వాళ్ళు పిల్లలతో, వారి పిల్లలతో, స్నేహితులందరితో సర్వసౌఖ్యాల్నీ అనుభవించి, మరణించిన తరువాత స్వర్గంలో పూజలు అందుకొంటారు.

పఠన్ ద్విజో వాగృషభత్వమీయాత్

స్యాత్ క్షత్రియో భూమిపతిత్వమీయాత్

వణిగ్జనః పణ్యఫలత్వమీయాత్

జనశ్చ శూద్రోఽపి మహత్త్వమీయాత్

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే

బాలకాణ్డే (శ్రీమద్రామాయణకథాసంక్షిప్తో నామ) ప్రథమః

సర్గః

అని వాల్మీకి ఋషిచే చెప్పబడిన, మొట్టమొదటి కావ్యము అయిన

శ్రీమద్రామాయణంలో బాలకాండలో సంక్షేపరూపంలో రామాయణ కథ.

సర్వం శ్రీ హనుమత్సీతాలక్ష్మణభరతశత్రుఘ్నసపరివారసమేత శ్రీ

రామచంద్రార్పణమస్తు.

ఇతి తిరునారాయణీయం సమాప్తం.

